# మరణ రహస్యం - 3

(నచికేత విద్య)




మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# మరణ రహస్యం-3

(నచికేత విద్య)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2019 శ్రీ వికారి - గురుపూర్ణిమ

ప్రతులు : 1,000

© ధనిష్ఠ - 2019

వెల : రూ॥ **100-00**

*ప్రతులకు :*

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-76-0

*ముద్రణ :*

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్,

విశాఖపట్నం - 530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

పరమగురువు మాస్టర్ సి.వి.వి.గారు అందించిన భృక్త రహిత తారక రాజయోగమున అమరత్వము, బ్రహ్మత్వము ప్రధాన ఆశయములుగ, గమ్యములుగ తెలుపబడినవి. మరణ స్వరూప స్వభావములను తెలియుట, ప్రయత్నముతో మరణమును అధిగమించుట, చిరంజీవత్వము పొందుట, బ్రహ్మత్వమును బడయుట మార్గముగ నిర్దేశింపబడినవి. మాస్టర్ సి.వి.వి.గారు తమ జీవితముననే అమరత్వమును, బ్రహ్మత్వమును అనుయాయులకు ప్రదర్శించినారు. పలుమార్లు దేహము వదలి మరల దేహమున ప్రవేశించినారు. బ్రహ్మత్వమును ప్రకటించుటయేగాక ప్రదర్శించినారు. ఒక నిర్దిష్టమగు జీవన విధానము అందించినారు.

మరణమును గూర్చిన శోధనము, పరిశోధనము మన వాఙ్మయమున అపారముగ నున్నవి. అందు కొన్ని ఉపాఖ్యానము లను భాగ్యనగరమందు నిర్వర్తింపబడుచున్న గురుపూర్ణిమ బృందజీవనములలో వివరించుకొనుట జరిగినది.

మార్కండేయుడి కథ, సతీసావిత్రి కథ ఆధారముగ మరణ రహస్యము వివరింపబడినది మరియు ప్రచురింప బడినది కూడ. ప్రస్తుతము నచికేతుని కథగ మరణ రహస్యమును వివరించుట జరుగగా, దానిని ఈ పుస్తకమున ప్రచురించి అందించుట జరుగుచున్నది. ఈ మరణరహస్య ఉపాఖ్యానము లను ప్రచురించుటకు ఉత్సాహముతో వ్రాతప్రతులను తయారుచేయుట, వానిని ముద్రించు విషయమున శ్రీమతి **& శ్రీ జి.వి. రామారావుగారి కుటుంబము** తరుగని ఉత్సాహము కనబరచు చున్నారు. అందు అంతర్హితమైన మాస్టరుగారి ప్రోత్సాహము మాకు స్పష్టముగ గోచరించు చున్నది. వారి కుటుంబముపై మాస్టరుగారు ప్రసరించుచున్న అనుగ్రహము కూడ స్పష్టముగ గోచరించు చున్నది. వారి యావత్ కుటుంబము నకు మాస్టరుగారి రక్ష సదా నిలచియుండు గాక అని ప్రణమిల్లుతూ.....

విశాఖపట్నం
**5-4-2019**

**పార్వతీకుమార్**
ధనిష్ఠ

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | పరిచయము | ........ | 11 |
| 2. | నచికేత విద్య | ........ | 20 |
| 3. | దైవ నిర్ణయము | ........ | 32 |
| 4. | యమలోక ప్రవేశము | ........ | 44 |
| 5. | నచికేతాగ్ని | ........ | 54 |
| 6. | దర్శనజ్ఞానము | ........ | 79 |
| 7. | దర్శనజ్ఞానము-2 | ........ | 88 |
| 8. | శిష్య పరీక్ష | ........ | 104 |
| 9. | యమబోధ | ........ | 126 |
| 10. | అంగుష్ఠమాత్ర పురుషుడు | ........ | 143 |
| 11. | ముక్తాయింపు | ........ | 159 |
| 12. | పునరాగమనము | ........ | 188 |

# మరణ రహస్యం-3

**(నచికేత విద్య)**

# 1. పరిచయము

**క**ఠోపనిషత్తు అంటే 'మరణ రహస్యం' తెలిపే ఉపనిషత్తు. మరణరహస్యం చెప్పినవాడు సృష్టిలో మరణానికి అధిపతి. యమధర్మరాజు దీనికి గురువు. విన్నవాడు నచికేతుడు, చిన్న పిల్లవాడు. "నాకు మరణం గూర్చి చెప్పు. మిగతావన్నీ ఎందుకులే" అన్నాడు. మరణం ఎప్పుడొస్తుందో ఎవరూ చెప్పలేరు కదా! అందుచేత నచికేతుడు చిన్నవాడైనా "మిగిలినవన్నీ ఎవరి దగ్గర అయినా తెలుసుకోవచ్చు. మరణం గురించి నీవొక్కడివే చెప్ప గలవు" అన్నాడు. మొత్తం సృష్టిలో మరణం గురించి చెప్ప గలిగిన వాడు యమధర్మరాజే. అతడు ధర్మరాజే. యమము అంటే లో నియతి, బాహ్య నియతి అని రెండు నియతులు గలవాడు. యమమును సృష్టిలో పరిపూర్ణముగా, అద్భుతంగా నిర్వర్తించేవాడు.

లోపలి నియతి, బయటి నియతి రెండూ వుండాలి. నియత్తు అని అమ్మవారి పేరుంది. మన్యు, మను, మహాకాల, మహత్, శివ, ఋతధ్వజ, ఉరు, రేతోభవ, కాల, వామదేవ, ధృతవ్రత అని ఏకాదశ రుద్రులున్నారు. అందులో నాలుగోవాడిని 'మహత్తు' అంటారు. ఆ మహత్తు భార్యనే 'నియత్తు' అంటారు. నియత్తు

అంటే సృష్టిలో ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు కనిపింప చేస్తుంది. ఈ మరణ రహస్యం తెలిస్తే లేరనుకునే మన తాతలు, ముత్తాతలు ఉన్నారని తెలుస్తుంది. ఇలాంటి విద్యను యముడి దగ్గర ఎవరు నేర్చుకోగలరు? లో నియతి, బయట నియతి ఉన్నవారు మాత్రమే నేర్చుకోగలరు. ఇక్కడ గురువు యమధర్మరాజు, శిష్యుడు నచికేతుడు. విద్య మరణ రహస్యం. దీనిని 'నచికేతోపాఖ్యానము' అంటారు.

ఇందులో ఒక ప్రధానమైన ప్రశ్న వుంది. "ఓ యమధర్మ రాజా! మరణానంతరం మనిషి జీవిస్తున్నాడని కొందరు, లేదని కొందరు అంటారు, నిజమేమిటి?" అని అడిగాడు. అందుకని దీనిని మరణానికి సంబంధించిన రహస్యాన్ని బోధించే ఉపనిషత్తు అంటారు. భాగవతంలో పరీక్షిత్తుకు శుక మహర్షి తెలిపిన రహస్యం కూడ మరణమును గూర్చియే!

*"ఏను మృతుండ నౌదు నని*
*యింత భయంబు మనంబులోపలన్*
*మానుము సంభవంబు గల*
*మానవకోట్లకుఁ జావు నిత్యమౌ*
*గాన హరిం దలంపు మిఁకఁ గల్గదు*
*జన్మము నీకు ధాత్రిపై*
*మానవనాథ పొందెదవు మాధవలోక*
*నివాస సౌఖ్యముల్"* అన్నాడు.

మానవులకు చావు నిత్యమే! కాని నరులకు కాదు. మానవులంటే మనస్సు ప్రధానముగా జీవించేవారు. వారికి మరణం ఉంటుంది. మనస్సు, ఇంద్రియాలు, శరీరం జీవుని యందు పుట్టేవి. పుట్టేవి పోతాయి, మరణిస్తాయి. జీవుడు (జీవాత్మ), అతని వెలుగు (బుద్ధి) ఎప్పుడూ వుంటాయి. వాటికి చావు లేదు. కనుక తాను జీవుడనని, స్వయం ప్రకాశకుడ నని, మనస్సు, ఇంద్రియములు, శరీరము తన తొడుగులని తెలిసిన వారికి మరణం ఉండదు. అలాంటి వారికి వెలుగు లోకాలలో శాశ్వత సౌఖ్య జీవనం వుంటుంది, కనుక బుద్ధి కక్ష్యలో జీవిస్తే మరణం ఉండదు. మనో కక్ష్యలో జీవిస్తే మరణం ఉంటుంది అని శుక మహర్షి పరీక్షిత్తుకు బోధిస్తాడు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునితో “మనము బట్టలు మార్చినట్లుగా దేహాలు జన్మ కొకటిగా మారుస్తాము. జీర్ణవస్త్రాలను వదిలేసినట్లుగా జీవుడు జీర్ణ దేహమును వదలి మరో కొత్త దేహమును పొందుతాడు” అంటూ

*వాసాంసి జీర్ణాని యథా విహాయ*
*నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।*
*తథా శరీరాణి విహాయ జీర్ణా*
*న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥* అన్నాడు.

మనసేంద్రియ శరీరాలను భగవానుడు దస్తులతో పోల్చాడు. పాత దుస్తులు వదిలేసి కొత్త దుస్తులు వేసుకొన్నట్లు జీవులు దేహాలు వదులుతూ, దేహాలు ధరిస్తూ ఉంటారని ప్రాథమికముగనే భగవద్గీతలో బోధిస్తాడు.

మనం వేసుకున్న దుస్తులు భౌతికం కావచ్చు, దివ్యం కావచ్చు. దివ్యంలో కూడా చాలా రంగు లున్నాయి. అసలు ఏమీ లేకుండా నగ్నం కూడా వుండవచ్చు. శుక మహర్షి అలా నగ్నంగా, దిసమొలతో వుంటాడని చెబుతారు. అందుచేత ఆయన దిగంబరుడు. దానికర్థం ఏ శరీర బంధమూ లేనివాడనే. *'దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!'* అని కొలువ బడే దత్తాత్రేయుడు కూడా దిగంబరుడే. సాక్షాత్తు కృష్ణుడే భర్త కావాలని గోపికలు కార్తీక మాసములో రోజూ ఉదయం మూడు గంటలకే లేచి, కొలనులో స్నానం చేసి కాత్యాయనీ దేవి గుళ్ళో పూజలు చేస్తుంటారు. అలా నలభై రోజులు పూజించారు. చివరి రోజు ఫలశ్రుతిలో వాళ్ళు నీళ్ళలోకి దిగంగానే ఆయన వారి చీరలన్నీ దాచేస్తాడు. వేణునాదం వినిపిస్తాడు. సంగతి తెలిసిన గోపికలు ప్రార్థిస్తే "నా కోసమేగా ఇన్ని రోజులుగా తాపత్రయ పడుతున్నారు. దేహాభిమానం, ఆత్మాభిమానం వదలకపోతే నా దగ్గరకు రాలేరు" అన్నాడు. నీవు, నీ దేహం ఏదీ లేదు. నేనే నీలో నీవుగా ఉన్నాను. కృష్ణుడు *"నే నెవరిని అనుగ్రహింప చూతు,*

*వాని సకల విత్తంబు నే నపహరింతు"* అంటూ నా దగ్గరకు బట్టలు కట్టుకుంటే రాలేరన్నాడు. అంటే అన్ని పొరలు దాటి వెళ్తే మాత్రమే భగవద్దర్శనం కలుగుతుంది. ఈ సత్యాన్ని వారికి దర్శనం చేయిస్తాడు. అలాగే మీరాబాయి కూడా. "కృష్ణుడి దగ్గరకు వెళ్తే నీకేమీ మిగలదు. వాడొక్కడే మిగులుతాడు అంటుంది."

మరణం గురించి చెప్పుకునేటప్పుడు ముగ్గురిని తలచు కోవాలి. 1. మార్కండేయుడు, 2. సావిత్రి, 3. నచికేతుడు. మార్కండేయుడు మరణాన్ని దాటిన చిరంజీవి. ఈ నాటికీ భూమి మీద వున్నాడు. ఆయన త్రేతాయుగంలో రామునికి, ద్వాపర యుగంలో ధర్మరాజుకు దర్శనమిచ్చాడు. ఇప్పటికీ మరణం దాటిన వారికి దర్శనమిస్తాడు. మరణం దాటాలంటే దానిని గురించిన తపన, యోగజీవనాన్ని నిష్ఠతో గడపాలి. అప్పుడు మార్కండేయ మహర్షి సాన్నిధ్యం లభిస్తుంది.

**మార్కండేయుడు :**

మార్కండేయుడు పుట్టగానే జాతకం చూపించారు. "మహత్తర మైన జీవి. కాని 16 ఏళ్ళ కన్నా వుండడు" అని చెబుతారు. మహత్తరమైన జీవి అంటే మహత్తును కూడా దాటిన వాడు. మహత్తంటే ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా కనిపించే మాయ. మాయ లేకపోతే ప్రపంచమే లేదు. సృష్టి కూడా లేదు. అలా

మాయను దాటినవాడు మార్కండేయుడు. తల్లిదండ్రులు శివ భక్తులు. 5 ఏళ్ళు రాగానే "నాన్నా! ఇంకా నీకు 11 ఏళ్ళు ఆయుష్షు ఉంది. నీవు ఉత్తమోత్తమమైన జీవిగా ప్రపంచంలో ప్రసిద్ధి చెందే అవకాశం వుంది. నీకు మరణం కూడా వున్నది. అందుచేత నీవు మరణం దాటడానికి 'మృత్యుంజయ దీక్ష' తీసుకొమ్మని" చెబుతారు.

అలాంటి మార్కండేయుడు శివానుగ్రహంగా మృత్యు రహస్య మందు మేల్కాంచాడు. కారణ శరీరంతో (లింగ స్వరూపుడై) శివుని ఆశ్రయించి, శివుడై, శాశ్వతుడై యున్నాడు. యిలాంటి మార్కండేయుని కథ ఎంతో ముఖ్యమైనది. *(వివరములకు మాస్టరుగారిచే వివరింపబడిన 'మార్కండేయుడు' గ్రంథమును చూడండి.)*

## సావిత్రీదేవి :

సావిత్రీదేవి పతి ప్రాణాలకోసం యముని అనుసరించిందని అంటే ఆవిడకు ఇదివరకే మరణరహస్యం తెలిసి వుండాలి. మరణం దాటి చిరంజీవి అయి బ్రహ్మత్వాన్ని పొందినటువంటిది సావిత్రీదేవి. సావిత్రీవ్రతం ఉత్తరాయణ పుణ్యకాలంలో చేస్తారు. సావిత్రి అంటే సూర్యుడు అస్తమించినా, ఇంకా వెలుగు వుంటుందే ఆ వెలుగే సావిత్రి.

సావిత్రి సహగమనం చేస్తుంది. సహగమనం అంటే అగ్నిలో దూకడం కాదు. స్థూలదేహాన్ని అక్కడే వదలి, సూక్ష్మ దేహంతో ఆయన వెంట వెళ్ళిపోతుంది. మృత్యు దేవత కనబడతా దేమిటి? కనబడితే కంగారే. సావిత్రికి ఆయన కనబడ్డాడు. మాట్లాడింది. యముడి నుండి మామగారికి పోయిన కళ్ళు రావాలని, పోయిన రాజ్యం ఇప్పించమని వరాలు పొందుతుంది. అయినా వదలక స్వచ్ఛందంగానే యమలోకం వెళ్తుంది (Volunteered to follow the Lord Pluto - the Lord of Death). యముడు ఇలా వచ్చినవారెవరూ లేరని ఆశ్చర్యపోతాడు. ఆనందంతో ఇంకో వరం కోరుకొమ్మంటాడు. అందుకు ఆమె "నేనెప్పటికీ ముత్తైదువగా వుండేలా వరమిమ్మని కాక నాకు సంతానం కావాలి" అని అడుగుతుంది. యమధర్మరాజు 'సరే' అనగానే "యమధర్మరాజా! సంతానం కావాలంటే భర్త కావాలి కదా! నేను వివాహితను కదా! మరల వివాహం చేసుకోను కదా! నా భర్తను నాకిచ్చేయి" అని అడుగుతుంది. ఆమె మాటలకు యముడు కూడా సంతోష పడతాడు. యమునితో పాటు యమ లోకం వరకు స్వచ్ఛందంగా నడిచి వచ్చిందంటే, ఆమె యోగినియా, సామాన్య స్త్రీయా, ఒక మామూలు భక్తురాలా? ఆమె పరిపూర్ణమైన, మహత్తరమైన జీవి కావటం చేత యమధర్మరాజు సంతోషించి వరం ఇస్తాడు.

ఆ తరువాత భర్త వచ్చి శరీరంలో చేరతాడు. తాను సహ శరీరంలో చేరుతుంది. ఇద్దరూ కలిసి ఇంటికి వచ్చేస్తారు. ఇపుడు వాళ్ళకు మృత్యుభయం లేదు. శత్రురాజులు వెళ్ళిపోయారు అని రాజ్యం అప్పగించి  వెళ్లారు. మామగారికి కళ్ళు కూడా వచ్చాయి. ఇవన్నీ ఎలా జరిగాయంటే లోపల ఉంటే ఇట్టే జరిగి పోతాయి. అలాంటి సావిత్రీదేవి కథ ప్రాతః స్మరణీయము. *(వివరములకు మాస్టరుగారిచే వివరింపబడిన 'సతీసావిత్రీదేవి' గ్రంథమును చూడండి.)*

మార్కండేయుడు తపస్సు ద్వారా మనసేంద్రియ శరీరాలను అధిగమించి శివ దర్శనం పొంది, శాశ్వత తత్త్వమును  గూడ పొంది, ఒక ప్రయోజనము కొరకు మరల శరీరములో వశించి, ఆపైన చిరంజీవిగా నిలచివున్న మహర్షి.

సావిత్రీదేవి ఇతఃపూర్వమే తపస్వి అవటంచేత యమ దేవునితో సూక్ష్మలోకాలకు పయనించి, యముని మెప్పించి, తన పెనిమిటిని, అతని వంశాన్ని ఉద్ధరించిన అసామాన్య తపస్విని. ఆమెకు మరణం లేదని తెలుసు. మరణించిన వానిని మరల కొనిరావటం కూడ తెలుసు. తదనుగుణమైన ధర్మాలు తెలుసు. ఆమె మార్కండేయునివలే తన మరణాన్ని దాటే ప్రయత్నము చేయలేదు. ఆ అవసరం గూడ ఆమెకు లేదు. ఇతరులను మరణం నుండి దాటించిన మహాయోగిని. మాస్టర్ సి.వి.వి. గారి యోగ

ప్రయోజనం గూడ అదే. వారు అట్టి మహత్కార్యములను నిర్వర్తించి చూపిన మహాయోగి.

ఇక నచికేతుని విషయానికి వస్తే, నచికేతుడు కుర్రవాడు. యముని యొక్క ప్రశంస పొంది, యముని ద్వారా వరాన్నిపొంది, మరణ రహస్యాన్ని యముడిని కోరి తెలుసుకున్నాడు. తనకు మరణం రాకూడదని కోరుకోలేదు నచికేతుడు. లోకానికి మరణ రహస్యం తెలియజేయడానికి, యముని వద్ద మరణం యొక్క స్వరూప స్వభావాలను క్షుణ్ణంగా ఉపదేశం పొంది మర్త్యలోకాలకు అందించినవాడు నచికేతుడు.

ఈ మూడు ఉపాఖ్యానాలు మరణ రహస్యం గూర్చినవే అయినా వైవిధ్యం ఉంది.

# ౨. నచికేత విద్య

నచికేతుడి కథ 'కఠ' ఉపనిషత్తుగా ఋషులు మనకు అందించారు. 'కఠ' అనే పదానికి ప్రత్యేకంగా అర్థమేమీ లేదు. కఠ అనే పదమే ఒక రహస్యం. 'క' నుండి 'ఠ' వరకు పన్నెండు అక్షరాలు ఉన్నాయి. "క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ". ఈ పన్నెండు అక్షరముల శబ్ద తరంగములు, పన్నెండు దళములు గల ఒక పద్మం మనలో వుంది. దానిని ద్వాదశదళ పద్మము అంటారు. దానినే హృదయపద్మము అంటారు. అందుచేత హృదయపద్మము యొక్క రహస్యాలు బోధించే ఉపనిషత్తు ఇది. హృదయ పద్మానికి వున్న పన్నెండు దళములు మూడు, మూడు దళములు ఒక గుత్తిగా నాలుగు అరలలో వుంటుంది.



ఒక  మూడు దళములు త్రిగుణంగా, నాలుగు పొరలుగా విచ్చుకుంటుంది. అలాంటి దళం దైవానికి అర్పించడంలో ఒక సంకేతం వుంది. అలాగే మూడు దళముల బిల్వం ఉంటుంది. నాలుగు త్రిదళ బిల్వాలను ఒకదాని మీద ఒకటి ఏర్పాటు చేస్తే హృదయ పద్మం ఎలా వుంటుందో కొంత అవగాహన వస్తుంది. అది హృదయపద్మానికి నిజమైన చిత్రీకరణ, దానిని బాగా తెలిసిన మహర్షులు మాత్రమే ఇవ్వగలరు. కాని మామూలు పుస్తకాలలో చూస్తే మూలాధారం అంటే ఒక వృత్తములో నాలుగు భాగాలు చేసి నాలుగు భాగాలు, నాలుగు దళాలుగా చూపిస్తారు. స్వాధిష్ఠానం అంటే ఆరు భాగాలు ఆరు దళాలుగా, మణిపూరకం అంటే పది భాగాలు పది దళాలుగా, హృదయం అంటే పన్నెండు దళాలుగా చూపిస్తారు. ఈ పద్మాలన్నీ త్రీ డైమెన్షనల్ మాత్రమే. పద్మం నొక్కేసినట్టుగా ఉండదు. నాలుగు పొరలలో మూడు మూడు దళములుగా ఒక్కొక్క దళమునందు ఒక్కొక్క అక్షరం యొక్క విభూతితో ఉంటుంది. 'క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ.'



మొదటి పొర అన్నమయం, రెండవ పొర ప్రాణమయం, మూడవ పొర మనోమయం, నాలుగవ పొర విజ్ఞానమయం. అక్కడినుండి లోపలికెడితే అక్కడ దర్శనమిచ్చే దెవరు? దానినే ఉపనిషత్తులో నీ వెలుగు, నీ వెలుగు రూపం. దానిని అంగుష్ఠ మాత్ర పురుషుడని యముడు నచికేతునకు తెలుపుతాడు. అది ఒక జ్యోతి స్వరూపంగా గోచరిస్తూ ఉంటుంది. దాని చుట్టూ విజ్ఞానమయ, మనోమయ, ప్రాణమయ, అన్నమయ కోశములతో కూడి ఈ రక్త మాంసాదులతో ఏర్పడి వున్నది. ఆ జ్యోతి స్వరూపమే జీవుడని, అతనిని బొటనవ్రేలు (అంగుష్ఠం) పరిమాణంలో దర్శనం చేయవచ్చని ఉపనిషత్తులు తెలుపుతున్నాయి. ఈ అంగుష్ఠ మాత్ర పురుషుడు విరాట్పురుషుని నమూనాలో ఏర్పడతాడని, విరాట్పురుషుని యందు వున్న సమస్త ప్రజ్ఞలు, శక్తులు అంగుష్ఠ పురుషుని యందు కూడ నిక్షిప్తం చేయబడి వున్నవని శాస్త్రము తెలుపుతోంది. విరాట్పురుషుడు సముద్రమైతే అంగుష్ఠుడు అల వంటి వాడని, అతడు విశ్వాత్మ అయితే ఇతడు జీవాత్మ అని తెలుపుతారు. కనుకనే మానవుడు దైవము యొక్క ప్రతిరూప మంటారు. దైవము మానవుని తన ప్రతీకగా నిర్మించాడంటారు. “God made Man in. His own image and likeness.” అని బైబిలు పాత నిబంధనములో పేర్కొనబడి యున్నది.

‘అంగుష్ఠమాత్ర పురుషుడు’ దర్శనమైతే క్షరత్వం వదలినట్లే. అక్కడి నుండి దైవాన్ని చేరే మార్గం ఉంది. అప్పుడు దైవ స్వరూపం

తెలుస్తుంది. గురువు గుహుడు కదా! అతడే గుహలో ఉంటాడు. అతడికి గురువు గణపతి. అది గొప్ప విషయం కదా! కుమార స్వామిని కూడా 'గుహుడు' అని పిలుస్తారు. కాని ఆయన బయట కనిపించే గురువు కాదు. లోపల కనిపించే సువర్ణమయ మూర్తిగా దర్శనమిస్తాడు. అలా దారి కనిపిస్తుంది. ఈ దర్శనానికి పూర్వం కావలసింది ఋణవిముక్తి. ఆ ఋణవిముక్తే మనకు నిత్యకర్మగా వచ్చేస్తుంది. తల్లి, తండ్రి, గురువు, సంతానం, పశువులు, సమాజ ఋణాలు తీర్చుకోవాలి. ఇవన్నీ డైమెన్షన్స్. అన్నమయ, ప్రాణ మయ, మనోమయ, విజ్ఞానమయ కోశముల యందు పూర్వకర్మ ఆవరించి యుంటుంది. నిష్కామ కర్మయోగ సూత్రాలను అవలంబిస్తేనే ఈ కర్మ హరింపబడుతుంది. అనాహత పద్మ మందలి నాలుగు పొరలు దాటాలంటే, నాలుగు కోశములందలి కర్మ హరింపబడాలి. అందుచేత నాలుగు పొరలలో మూడు, మూడు దళములుగా మొత్తం దళములు ఒక్కొక్క అక్షరము యొక్క విభూతితో ఉంటుంది. 'క' నుండి 'ఠ' వరకూ వున్న పన్నెండు అక్షరాలు వాటి లోపల కేంద్రముగా ఒక బిందువు ఉంటుంది. ఆ బిందువు ఒకదానిని ఒకటిగా అనుసంధానం చేయునప్పుడు హృదయం యొక్క గుహలలోకి తీసుకు వెళ్తుంది. అందుకే హృదయంలో ధ్యానం చేయండి అంటే కొంతమంది బయటే ఉండిపోతారు. బాగా శ్రద్ధగా చేసినవాళ్ళు లోపలికి వెళ్తారు.

అలా ఒకటో ప్రాకారం నుండి రెండవ ప్రాకారంలోకి వెళ్ళినట్లు, ఇంకా బాగా ఆసక్తితో, శ్రద్ధతో, భక్తితో అదే సర్వస్వంగా చేసుకుంటే మూడో పొరలోకి, కొంచెం తరువాత నాలుగవ పొరలోకి సాధకుడు వెళ్తాడు. అటుపైన గర్భగుడిలో ప్రవేశిస్తాడు. అందుకే దేవాలయానికి ప్రాకారా లుంటాయి. దేవాలయాలలో పెద్ద ఎత్తుగోడతో బాహ్యం నుండి వేరుచేస్తూ లోపల ఒక ఆలయ ప్రాంగణం వుంటుంది. ఇంకా లోపలికి వెళ్తే ఆవరణలు వుంటాయి. వానినే Hall of Learning, Hall of Wisdom, Hall of Experience అని పిలుస్తారు. ఆ తరువాత Hall of At-one-ment వుంటుంది. దేవాలయంలో గర్భగుడిలో దేవునితో కలసి పోవటం వుంటుంది. గర్భగుడిలో దగ్గరగా చూడటం అంటే గర్భగుడి కంటే ఒక గడపముందు నిలుచోబెట్టి చూపించటం ఉంటుంది. లేకపోతే బయటే వుంటాము. దేవాలయంలోకి రాకుండా తిరుగుతూ వూళ్ళో ఎంతోమంది ఉంటారు కదా! వెళ్ళినా లోపలి వరకు వెళ్ళేవాళ్ళు ఎంతమంది? గర్భగుడి గడప వరకు వెళ్ళే వాళ్ళు ఎంతమంది? గడపదాటి లోపలికి వెళ్ళి దేవుడితో ఏకత్వం చెందేవాళ్ళు ఎంతమంది? కేవలం హృదయపద్మంలో కూచుంటే చాలని అనుకోకూడదు. తిరుపతిలో మొదటి ద్వారం వద్ద 'పడికావలి' అని ఉంటుంది. అక్కడ పడివుండటమే 'పడి కావలి'. అక్కడ ఎవరి ప్రమేయము, ప్రభావము లేక కేవలం నీ

ప్రవర్తన, నీ పరహిత జీవనం, నీవు చేసే దానము, నీవు చేసే తపస్సును బట్టి ఒక్కొక్క ద్వారం దాటగలవు.

ఈ కఠోపనిషత్తు దేని గురించి ఎక్కువగా చెబుతుందంటే "ముందు హృదయంలో ప్రవేశించు, మనస్సు నుండి హృదయంలో ప్రవేశించమనే". అలా ప్రవేశించటానికి కొంత సమయం కావాలి. ఆ సమయం ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి దినము నిర్దిష్ట సమయములలో మనసును శ్వాసపై లగ్నం చేయాలి. శ్వాస పుట్టుక స్థానమైన హృదయ స్పందన చేరాలి. అలా నిత్యం రెండు మూడు మార్లు కనీసం 24 నిమిషాలు పాటు నిర్వర్తించాలి. దినచర్య క్రమబద్ధం చేసుకుంటేకాని, ఈ కార్యక్రమం చేయలేరు. ఆహార విహారాలు క్రమబద్ధం చేసుకొని హృదయం చేరినవాడు మనసు నుండి కాక హృదయం నుండే పనిచేస్తుంటాడు. మనసు విలువలు వేరు, హృదయం విలువలు వేరు. మనసు విలువలన్నీ ప్రాపంచిక విలువలే. అలాకాక హృదయం చేరినకొద్దీ, సంస్కారవంతుడు కనిపిస్తే స్పందిస్తాడు. సంస్కారం లేనివాడిని చూస్తే ముక్తసరిగా వుంటాడు. సద్గురువు అందరియందు స్పందించడు. తెలిసిన వాడు లోపలి సౌందర్యం, లోపలి వెలుగు చూస్తాడు. లోపలి అందాన్ని, విద్యను ఏదీ మింగదు. కఠోపనిషత్తు అంతా హృదయ విద్యయే. హృదయ గుహలోకి తీసుకువెళ్ళే విద్య.

కఠోపనిషత్తుగా పేరుగాంచిన ఈ ఉపాఖ్యానము ఇహపర సౌఖ్యాలను పరిపూర్ణంగా లభింప చేయడమే కాకుండా మరణాన్ని దాటటం, ఆత్మని తెలియటం, పరమాత్మతో అనుసంధానం చెందటం, బ్రహ్మమై కీర్తి చెందటం– ఇలాంటి సోపాన క్రమములు అమర్చబడి ఉన్నవి. భారతీయ వాఙ్మయంలో మనకి రకరకాల ఉపాఖ్యానా లున్నాయి. వీటి ప్రధాన ఉద్దేశము మరణం దాటటమే. ఎందుకంటే మరణం దాటనివాడు ఎన్ని విద్యలు నేర్చుకున్నా మరణంతో ఆ విద్యలన్నీ నశిస్తాయి. మళ్ళీ జన్మ ఎత్తితే మొదటి నుంచి మళ్ళీ నేర్చుకుంటూ ఉండాలి.

ఈ విద్యకు గురువు లోకాలలో మరణానికి అధిపతియైన యముడు. శిష్యుడు బాల నచికేతుడు. మృత్యుదేవత అయిన యముడు మరణరహస్యం వివరించే ఏకైక ఉపాఖ్యానము ఇదే. అతనికంటే ఇతరులకు ఈ విషయం ఎక్కువ తెలుసు అనటానికి వీలులేదు కదా! సృష్టిలో ఏ విద్యయందు ఎవరు నిష్ణాతులో, వారిని అధిపతులుగా భగవంతుడు నియమించాడు. అలాంటి మృత్యు విషయంలో యమధర్మరాజే మరణానికి అధిపతి. అతడి చేత ఈ వివరణ అందుకున్న నచికేతుడు, లోకానికి అందించటం చేత మర్త్యులైన మానవులు (చనిపోయేవారు) మృత్యువును దాటి ఇహము నందు, పరము నందు జీవిస్తూ ఇహపర సౌఖ్యాలు

అనుభవిస్తూ, తమ నిజ స్వరూపములు ఆవిష్కరింపబడిన వారై ఋషులవలె శాశ్వతంగా, సృష్టి కార్యమునందు నియమితులై వుంటారు. అందుచేత ఈ ఉపాఖ్యానము ఉపనిషత్తులలో అత్యంత ప్రాధాన్యతను సంపాదించుకొన్నది.

ఇతర విద్యలకన్నా మరణరహస్యం తెలిపే విద్య ఉత్తమ మైనదని శ్రీమద్భాగవతము, భగవద్గీత ఇత్యాది గ్రంథాలు తెలియ చేస్తాయి. వాఙ్మయము కూడ మానవుడు అక్షరుడై, శాశ్వతుడై, దైవాంశ సంభూతుడని తెలిసి, దైవమే తాను అని ఎరిగి జీవించ డానికి నరజన్మ ఎత్తడం జరుగుతుందని చెబుతుంది. కేవలం నరజన్మలో మాత్రమే పొందతగిన విద్య ఇది. దేవతలలో కూడ కొందరికి మాత్రమే దైవం తెలుసు. అందరికీ దైవం తెలియదు, బ్రహ్మం తెలియదు. భగవద్గీత విభూతియోగంలో కృష్ణుడు ఒకమాట చెబుతాడు. నేను తెలిసినవారు, నా విభూతి తెలిసినవారు దేవత లలో కూడా కొందరే ఉన్నారు. *"నమే విదుః సురగణాః......."* (అ 10, శ్లో 2). ఇలాంటివారు మానవులలో కూడ చాలా తక్కువగ వున్నారు. ఎవరు వారి వారి నిజ స్వరూపము ఆవిష్కరింప బడి ఉంటారో, వారు శాశ్వతులై సృష్టి లయమైనప్పుడు కూడా తెలిసి ప్రవేశించి, మరల తెలిసి వ్యక్తమవుతుంటారు. అలాంటి వారే సనక, సనందనాది కుమారులు, నారదుడు, సప్తర్షులు, మనువులు.

రుద్రులలో శంకరుణ్ణి నేను, ఋషులలో మరీచిని నేను అంటాడు. నన్ను తెలుసుకొన్న వారిలో, తెలుపగలిగిన వారిలో 'నేను'గా ఉన్నటువంటిది నారదుడు. అశ్వములలో ఉచ్చైశ్రవము నేను, మానవులలో నరుడను నేను అంటాడు. నరుడు నశింపని వాడు. మానవుడు అంటే మనస్సు ప్రధానంగా జీవించేవాడు కావటం చేత వాడు మరణిస్తాడు. మనం నిద్ర పోయినప్పుడు మనస్సు తనలోకే హరింపబడుతుంది. అందుచేత మానవుడు కేవలం మనోవంతుడైతే చాలదు. ఇంద్రియవంతుడై కేవలం తిని, తిరిగేవాడైతే పశుప్రాయుడై ఉంటాడు. దేహము మాత్రమే తెలిసి ఉంటే ఆ పశువులలో కూడా హీనపశువై ఉంటాడు. అందుచేత మానవుడు మనోవంతుడు. తనను తాను నియమించుకొని శ్రద్ధా వంతుడై, కృషి సలిపి బుద్ధిమంతుడు కూడా కావాలి. బుద్ధిలో ప్రవేశించినవాడు బుద్ధిమంతు డవుతాడు. అలాంటివారినే 'హితులు' అంటారు.

మంచి అలవాట్లు ఉన్నవాడిని బుద్ధిమంతుడు అంటాము. అది సామాన్య అర్థం. *'బుద్ధి ఆకాశ ప్రకాశం'* – ఎప్పుడూ ఈ ప్రకాశంలో జీవించే వాడికి తాను ఎందుకు పుట్టాడో తెలుస్తుంది. ఏం చేయాలో తెలిసి వుంటుంది. బుద్ధి దేనికంటే అసలు ఎందుకు పుట్టాం? ఈ జన్మకి సార్థకత ఏమిటి? ఏం తెలుసుకోవాలని

పుట్టాం? మానవజన్మ ప్రయోజనం ఏమిటి? మనకు, పశువులకూ తేడా ఏమిటి? ఇవన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నం చేసి మనసులో నుండి బుద్ధిలోకి యోగ సాధన లేక భక్తిసాధన ద్వారా ప్రవేశించిన వాడిని 'నరుడు' అంటారు. మానవుడు ఎప్పుడు బుద్ధిలో ప్రవేశిస్తాడో అప్పుడు అతడు నశించడు. **మానవులందరూ నరులు కారు**. నరులు నారాయణునితో అనుసంధానం చెందే అర్హత పొందినవారు. నరుడు కానివాడు నారాయణుని గురించి ఎంత చింతన చేసినా అందుకొనే స్థితికి, అనుగ్రహ స్థితికి ఎదగలేడు. **మానవుడు నరుడు కావాలి.** మానవుడిగా తనకేమి కావలెనో తెలుస్తుంది. అది పరిమితమైన జీవితం. నరుడిగా జీవిస్తే అందరికీ ఏం కావాలో తెలుస్తుంది. అది చాలా ప్రాథమికమైన తేడా!

ఋషులు 'జంతూనాం మానవజన్మ దుర్లభం' అనలేదు. *'జంతునాం నరజన్మ దుర్లభం'* అన్నారు. మానవుడిగా చాలమంది పుడతారు. మానవుడు నరుడవ్వాలని అలా చెప్పారు. అంటే అశాశ్వతమైన విషయాలలో నుండి శాశ్వతమైన విషయాలలోకి తన్ను తాను ఉద్ధరించుకోవాలి. అలా మనలను మనం ఉద్ధరించు కోవటానికి పెద్దలు, తెలిసినవారు, గురువులు, వారందించిన సద్గ్రంథాలున్నాయి. వాటి ఆధారంగా నరుడై వెలగాలి. అందుచేత భగవంతుడు పాండవులలో 'నరుడను' నేను అన్నాడు కాని, అర్జునుడు నేను అనలేదు.

తాను ఎందుకుపుట్టాడో అది తెలిసి దానిని నిర్వర్తించటం అన్నది నరుడు మాత్రమే చేయగలడు. ఈ చక్కని అవకాశము కేవలం మనకు మాత్రమే వుంది. అందుకే మన పెద్దలు *'శరీరం ఇదం ఖలు ధర్మసాధనం'* అన్నారు. మానవ శరీరం కన్నా ఉత్తమ శరీరం ఇంకొకటి లేదు. నీవు మహర్షి, బ్రహ్మర్షి ఏదైనా కావచ్చు. దేవత కావచ్చు. ఆకాశంలో ఎగరవచ్చు. ఏదైనా చేయవచ్చు. ఋషి ఒక చోట వుండి మొత్తం మన గోళమే కాదు, మొత్తం సూర్యమండలంలో వుండే విషయాలన్నీ కూడా గమనించగలడు. అంటే మానవుడు నరుడిగా మారి, నరుడిగా ఇంకా ఉత్తమ శరీరంలోకి ప్రవేశించి ఋషిగా, మహర్షిగా, రాజర్షిగా, బ్రహ్మర్షిగా అట్లా మార్పు చెందుతాడు.

ఈ మార్పు గొంగళిపురుగు సీతాకోకచిలుకగా మారి నట్లుగా జరుగుతుంది. గొంగళిపురుగు ఒంటి మీద పాకితే కంపరంగా ఉంటుంది. దురదపుట్టి బాధ పెడుతుంది. కాని సీతాకోకచిలుక వాలితే చాలా ఆహ్లాదంగా వుంటుంది. దురద, బాధ లేకపోగా ఆనందంగా వుంటుంది. ఇలాంటి మార్పు మానవుడిలో జరిగితే ఆ మానవజన్మ ఫలించినట్లే. లేకపోతే జన్మ దుర్వినియోగమైనట్లే. మళ్ళీ మానవుడిగా పుట్టటం దుర్లభం. నీకిచ్చిన విలువైన వస్తువును సద్వినియోగం చేయడానికి, మళ్ళీ

అదే విధమైన వస్తువు ఇవ్వటమనేది తల్లి కరుణ. ప్రకృతిమాత యొక్క కరుణ. నీకు శిక్షణ యిద్దామనుకుంటే మళ్ళీ ఆ జన్మ నీకు ఇవ్వకపోవచ్చు. అందుచేత లభించిన మానవ జన్మను చక్కగా పండించుకొని మరల అజ్ఞానంలో పుట్టకుండా, జ్ఞానవంతుడవై ఎప్పుడైనా పుట్టవలసి వచ్చినా ఈ జ్ఞానంతో పుట్టి జీవించే విధానం పెద్దలు మనకిచ్చారు. అలాంటి విధానమునే యముడు నచికేతుడికి కూడా తెలియచేస్తాడు. ఆ నచికేతుడి కథ తెలుసుకుందాం.

# 3. దైవ నిర్ణయం

**న**చికేతుడు వాజశ్రవసుడనే ఒక సత్పురుషుని కుమారుడు. చిన్నప్పటినుండి రకరకాల యజ్ఞాలు, యాగాలు చూసి, వాటి గురించి బాగా వినటం వలన అతనికి వాజశ్రవసుడనే పేరు వచ్చింది. అతని పేరు ఉద్దాలకుడు. అతడు క్షత్రియ కుమారుడని అంటారు కాని, ఎప్పుడైతే ఈ యజ్ఞ యాగాదులయందు ఆసక్తి చూపించాడో, అతనియందు బ్రాహ్మణధర్మం ఎక్కువగా గోచరింప సాగటంతో కొన్ని కొన్ని వ్యాఖ్యానాలలో బ్రాహ్మణుడని వ్రాయ బడింది. ఏమైనా అతడు మానవుడు. ఉద్దాలకుడు అనే మానవుడు. అందరూ చేసే యజ్ఞాలు చూసి ఉత్సాహపడి మనం కూడా ఏదో ఒకటి చేస్తే బాగుంటుంది, ఎప్పుడూ ఇలాగే తింటూ తిరుగుతూ వుంటే కాదు అనుకున్నాడు. ఈ ఋషులు చాలా యజ్ఞాలు చేస్తున్నారు. పెద్దలు యజ్ఞము, దానము, తపస్సు అని చెప్పారు. అన్ని యజ్ఞాలలో కన్నా దానయజ్ఞం గొప్పదని ఆయనకు తెలుస్తుంది. దానం చేద్దామని అనుకుంటాడు.

మానవులలో రకరకాల గుణవిశేషం చేత వర్గీకరణ ఉన్నది.

అందుచేత అతడు దానము అనే యజ్ఞమును పెట్టుకున్నాడు. దాన మిద్దామని అనుకున్నా అతనిలో కించిత్ అశ్రద్ధ ఉండడం చేత ఆ దాన మిస్తున్నప్పుడు, ఆ దక్షిణలు అవీ ఇస్తున్నపుడు పనికిరానివి కూడా ఇస్తుంటాడు. అది చూసి నచికేతుడు బాధ పడతాడు. *"శ్రద్ధయా దేయమ్, అశ్రద్ధయా అదేయమ్"* అంటే "నీవు ఎవరికి దానమిస్తున్నావో వాడిలో నన్ను చూసి దానం ఇస్తే, నీ దానం ఫలిస్తుంది" అని కృష్ణుడు భగవద్గీతలో చెబుతాడు. దానం పుచ్చుకొనేవాడిని హీనుడు, దీనుడు, దరిద్రుడు గానూ చూడకూడదు. వాళ్ళలో కూడా దైవం వున్నాడు. అలాగే దాన వస్తువు ఉపయోగకరముగ ఉండాలి. మనకు పనికిరానివి, పాడైపోయినవి వదిలించుకోవడానికి యిస్తే అది దాన మవదు. నీళ్ళు తాగడానికి, గడ్డి మేయటానికి, పాలు ఇవ్వటానికి, ఈన డానికి శక్తి కోల్పోయిన ఆవులను దానం చేసే వ్యక్తి ఆనంద రహితమైన లోకాలకు వెళ్తాడు. అందువలననే శ్రేష్ఠమైన వాటిని దానం చేయాలి. మనకున్న బరువు తగ్గించుకోవటానికి నాలుగు రోడ్ల కూడలిలో పెట్టటం దానం కాదు. దానం శ్రద్ధగా చేయాలి.

బలి చక్రవర్తి దానమనే యజ్ఞము ద్వారా విష్ణుమూర్తి సందర్శనము, విష్ణుమూర్తి అనుగ్రహమును పొందాడు. కర్ణుడు కేవలం దానం చేత ఉద్ధరింపబడతాడు. దాన ధర్మము, స్నేహ

ధర్మము కర్ణుడు చూపిన ఉత్తమోత్తమ ధర్మాలు. అందుచేత అతనిని గురించిన భయము కృష్ణునికి కూడా కలిగింది. బలి చక్రవర్తి, శిబి చక్రవర్తి కూడా అలాంటి వారే.

మనకు కూడా అప్పుడప్పుడు ఒక స్ఫూర్తి వస్తుంది. ఎక్కువ పుణ్యం చేస్తే ఎక్కువ కలిసి వస్తుందని, ఎక్కువ దానం చేస్తే ఏదో కలిసి వస్తుందని చేస్తూంటాము. పని అయితే వేంకటేశ్వర స్వామి హుండీలో కొంత వేస్తాము. పని బాగా, పూర్తిగా అయితే ఇంకొంచెం వేసి, ఇంకొంచెం చెప్పి వస్తాము. ఆయనతో అన్ని రకాల డీల్స్ చేస్తుంటాము. మనం ఇస్తే మనకి వస్తుందని తెలియటం ఒక విజ్ఞానం. అలా పుచ్చుకుంటూ పోతే ఎక్కువ పని సాగదు. ఇప్పుడు Business Management అంతా Customer's Satisfaction అంటారు. పేరుకు సర్వీస్ అంటారు కాని వాడికి వాడు సర్వీస్ చేసుకుంటూ వుంటాడు. వాడి సంతృప్తికోసం customer service అంటారు. 'మీ పెరుగుదలే మా పెరుగుదల' అంటారు కాని అంతా వ్యాపారమే. ఇలా వ్యాపార సరళితో పుణ్యం కోసం కొంత ధర్మకార్యాలు చేస్తుంటారు. అందుకే "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవా!" అన్నారు.

ఇకపోతే 'యజ్ఞము' అంటే ఇతరులకు హితము చేస్తూ, జీవిస్తే 'యజ్ఞార్థ జీవనము' అంటారు. ఏవో కట్టెలు పోగుచేసి

పొగ పెడితే కాదు. ఇతరుల హితంకోసం నీవు అగ్నిదేవుని ఆరాధన చేస్తే, అది ఎక్కువ ప్రజ్వలిస్తుంది. నీ కోసం చేసుకున్నా దేవతలు వస్తారు. మన కోసం చేసుకుంటే కొంచెం నిధులిస్తారు. ఎక్కువమంది కోసం అయితే వాళ్ళు మనయందు ఎక్కువ శ్రద్ధ వహిస్తారు. మనం ఇచ్చేది మంచినీళ్ళే అయినా పెద్ద అడ్వర్‌టైజ్ మెంట్, పేపరులో పెద్దగా వార్త, టీ.వి.లలో ప్రచారం. ఇలా చేస్తే మంచినీళ్ళు ఇచ్చిన ఫలితం అప్పుడే తగ్గిపోతుంది. **మనలను పెంచుకోవటంకోసం మంచి పనులు చేయకూడదు**. ఇతరుల శ్రేయస్సుకోసం చేయాలి. ఇతరుల శ్రేయస్సును మాత్రమే ఉద్దేశించి, వారియందు దైవాన్ని దర్శిస్తూ చేసే దానం సత్ఫలాలు యిస్తుంది. వాజశ్రవసుడు ఈ సత్యాన్ని గ్రహిస్తాడు. వాజశ్రవసు డనగా బాగా విశేషంగా అన్నదానం చేసేవాడని అర్థం. అతడు అలా తన యావదాస్తిని కరగించి అన్నదానం చేస్తూ వుంటాడు. దానికి కారణం అతడు స్వర్గలోక సౌఖ్యాలన్నీ పొందాలని. స్వర్గ ఫలాలు పొందాలంటే బలి, శిబి వంటివారి వలె దానం చేయాలి. ప్రధానంగా అన్నదానం విశేషంగా చేయటం వలన అతనిని లోకం వాజశ్రవసుడని కొనియాడింది.

నచికేతుడు 5 ఏళ్ళ చిన్న పిల్లవాడు. అతని తండ్రి దానం పేరిట వట్టిపోయిన ఆవులను దానమివ్వడం నచికేతుడు

చూస్తాడు. నాన్న ఈ దానం ఫలాన్ని ఆశించి చేస్తున్నాడు. శ్రద్ధ లోపించింది. నీళ్ళు త్రాగలేనివి, గడ్డి తినలేనివి, ఒట్టిపోయినవి, ఇంద్రియము లుడిగినవి అయిన గోవులను దానం చేస్తూవుంటే నచికేతుడు దుఃఖపడిపోతాడు. తన తండ్రి అథోలోకాలకు పోతాడేమో ననే భయం అతనికి కలుగుతుంది. అందువలన దుఃఖ లోకాలలోకి ప్రవేశించవలసి వస్తుందని చింతిస్తాడు. ఆయన తనకున్న ఆవులలో ఇంకా ఈనని ఆవులు, పాలివ్వని ఆవులు, సరిగా ఆహారం కూడా తినలేని ఆవులు వున్నాయి. అలా బక్క చిక్కిన ఆవులన్నింటినీ ఇచ్చేస్తుంటాడు. అలా ఇస్తుంటే నచికేతుడికి దుఃఖం వస్తుంది. అయ్యో! తండ్రి తప్పు చేస్తున్నాడే అనిపిస్తుంది. చిన్నవాడు కాబట్టి చెప్పడం బాగుండదు. తండ్రికి స్వర్గాది లోకాలు లభించక పోయినా దుఃఖ కారణమైన లోకాల్లో ప్రవేశించవలసి వస్తుందేమోనని చింత చేశాడు. అందుకే వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళి "నాన్నా! అందరికీ అన్నీ ఇస్తున్నావు కదా! మరి నన్ను ఎవరికి దానం ఇస్తున్నావు?" అని అడిగాడు.

పుత్ర దానంవల్ల స్వర్గాది లోకాలు సులభంగా లభిస్తాయి. పుత్రదానం సామాన్యమైన విషయం కాదు. ఏ ఫలమూ ఆశించక పుత్రదానం చేసే దంపతికి విశేష పుణ్యం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

అన్ని దానాల్లో కన్నా అత్యద్భుతమైన దానం ఏమిటంటే పుత్రదానం. పుత్రదానం అందరూ చేయలేరు. ఆయన కొడుకును ఇచ్చేటంతటి వాడు కాదు కదా! ఆ తండ్రికి కొడుకంటే చాలా ప్రియం. ఎవరికైనా అంతే కదా. ఎవడి కొడుకు వాడికి ప్రియమే! కొడుకును ఎవ్వరికీ ఇవ్వలేడు కదా! ఆ తరువాత కన్యాదానం. కన్యాదానం చేస్తే కోటి ఆవులు దానం చేసినంత ఫలం. కన్యాదానం చేసేవాడు అల్లుడిలో విష్ణుమూర్తిని చూసి, విష్ణువుకు నా కూతురిని సమర్పించు కుంటున్నాను అనే భావంతో చెయ్యాలి. అప్పుడే ఆ కన్యాదానానికి ఫలముంది. ఇకపోతే అన్నదానం, వస్త్రదానం, విద్యాదానం, వైద్యదానం ఇవన్నీ ఉన్నాయి. వీటిలో శ్రద్ధ ఉంటే ఆనంద లోకాలలోకి వెళ్తాడు.

సేవ అనే పెద్ద పదాన్ని చాలా సులభంగా వాడేస్తుంటాము. అయినా ఎప్పుడూ కష్టాలే అంటుంటాము. సర్వీస్ చేస్తుంటే కష్టాలు ఎందుకు వస్తాయి? రావు. చేస్తుంటే ఆనందం రావాలి. చేసే దానిలో శ్రద్ధ లేకపోతే అలా అవుతుంది. విషయం చిన్నదైనా, పెద్దదైనా పర్యవసానా లుంటాయి. **శ్రద్ధ ఉన్నవాడికి పూర్వజన్మలు కూడా గుర్తు వస్తాయి.** పూర్వం తానేమిటో తెలుస్తుంది. తరువాత కూడా ఏమిటో తెలుస్తుంది. ఎప్పటికీ మరపురానిది శ్రద్ధ. సనత్సు జాతుడు శ్రద్ధ లేకపోవటంవల్ల మృత్యువు వస్తుందంటాడు.

తెలిసింది ఆచరిస్తే ఇంకొంచెం తెలుస్తుంది. రామకృష్ణ పరమ హంస దగ్గరకు ఒకాయన వచ్చి నాకు దైవదర్శనం కావాలన్నాడు. పరమహంస 'అలాగే, తప్పకుండా!' అన్నాడు. ఒక చిన్న విషయం చెప్పి 'ఇది చేస్తూ ఉండు' అన్నాడు. ఆ వ్యక్తి 'ఇది చేశాక, తరువాత ఏమవుతుంది?' అని అడిగాడు. 'ఇది చేస్తే ఆ తరువాత ఏం చేయాలో నీకే తెలుస్తుంది' అన్నారు. అలాగే పెద్ద అడవి దాట డానికి చిన్న దీపం ఇస్తారు. అది ముందు వెళ్ళే రెండు, మూడు అడుగుల వరకు కనిపిస్తుంది. అజ్ఞానమనే అడవి దాటాలంటే జ్ఞానమనే దీపం కావాలి అంటారు. సూర్యోదయం లోపల స్నానం చేసి శుద్ధి అయి, ఆరాధనకు సిద్ధం కావాలి అని చెబుతారు. ఋషిమార్గమంటే ఇదే.

చిన్నపని అయినా పూర్ణశ్రద్ధతో చేయాలి. చిన్న చిన్న పనులు సవ్యంగా చేస్తూవుంటే క్రమంగా పెద్ద పనులు చేసే సమర్థత, అవకాశం వస్తాయి. శ్రద్ధగా టార్చిలైటు సాయంతో మూడు అడుగులు చీకటిలో నడిస్తే మరో మూడు అడుగులు కనబడుతుంది. అలా మైలుదూరం అయినా చీకటిలో దాట వచ్చును. మన దగ్గరవున్న బుద్ధి టార్చిలైటు లాంటిది. దాన్ని ఆచరణయందు ఉపయోగించాలి. అపుడు క్రమంగా మార్గంలో సాగవచ్చు.

నచికేతుడు మళ్ళీ 'నాన్నా! నన్నెవరికి ఇస్తావు?' అని అడిగాడు. తండ్రి ఒకసారి ఊరుకున్నాడు. ఆ పిల్లాడు మళ్ళీ మళ్ళీ అడిగాడు. కొన్నాళ్ళ తరువాత మళ్ళీ అడిగాడు. ఆయనలో చిరాకు మొదలైంది. అంతే కదా! మనకన్నా చిన్నవాడు అలా ఇబ్బంది పెట్టే ప్రశ్న వేస్తే వాడిని నొక్కేస్తాం, తొక్కేస్తాం. తప్పు అలా అనకూడదు అంటాము కదా! ఇంకా అడిగితే చెంప మీద ఒక్కటిస్తాము.

నచికేతుడు కూడా తండ్రికి చిరాకు వచ్చేంత వరకూ అడుగుతూనే ఉంటాడు. అతని ఉద్దేశమేమంటే నేను నీకెంత ప్రియమో అలా ప్రియమైన వస్తువులను దానం చేస్తే ఉత్తరోత్తర తండ్రికి బాగుంటుంది అని. కొడుకు అలా అడిగేసరికి కోప మొచ్చిన తండ్రి 'నిన్ను యముడికి ఇచ్చేస్తానురా!' అంటాడు. అలా అనగానే నచికేతుడు యముడి దగ్గరకు వెళ్ళిపోయాడు!

ఇలాంటి వాళ్ళ కథలు గొప్పగా వుంటాయి. అలాగే ఇంకో కుర్రాడున్నాడు. అతని పేరు 'దేవళుడు'. లోకంలో అతని గురించి తెలిసిన పేరు 'అష్టావక్రుడు'. అతడు తల్లి కడుపులో ఉన్నప్పుడు తండ్రి అందరికి వేదం చెబుతుంటాడు. వ్యాఖ్యానం చేస్తుంటాడు. ఆయన చేస్తున్న వ్యాఖ్యానం గర్భంలో వున్న పిల్లవాడికి చాలా అభ్యంతరం అనిపిస్తుంది. ఆ వ్యాఖ్యానాలు తెలిస్తే చేయాలి

లేకపోతే ఊరుకోవాలి. తెలిసీ తెలియక ఏదో మాట్లాడేస్తుంటే అపచారమైపోతుంది. అలా అపచారమవటం వలన తండ్రికి అథోగతి పడుతుంది. తనకు తండ్రి ఎడల కర్తవ్యమే కాదు బాధ్యత కూడా వుంది. చివరికి భరించలేక ఒక రోజు కడుపులో నుండే 'నీవు చెప్పేది తప్పు' అంటాడు. వీడు కడుపులో నుండే బయట చేస్తున్న వ్యాఖ్యానంలో తప్పు పడుతున్నాడు. తండ్రి వ్యాఖ్యానాన్ని తప్పు పట్టేవాడు ఎంతవాడు అయి వుండాలి? కాని ఆయన మహర్షి. ఏదో కారణం చేత పుడతాడు. దానికి కోపించిన తండ్రి 'అష్ట వంకరలతో పుట్టు' అని శపిస్తాడు. ఆ బిడ్డ 'తథాస్తు!' అనుకున్నాడు. అట్లాగే పుట్టాడు.

ఈ తెలిసీ, తెలియని కుర్రాడు ఐదేళ్ళ వయసులో వుండగా అతని తండ్రి ఒకరోజున జనకుడి సభకు వెళ్ళి అక్కడ, బ్రహ్మావాదు లందరూ వాదిస్తూ వుండగా బ్రహ్మము గురించి వాదించి, తనకు తానే సాటి అనిపించుకోవాలని అక్కడికి వెళ్ళి వరుణుడి కొడుకు చేతిలో ఓడిపోతాడు. అతడు ఓడిపోయిన వాళ్ళను వరుణా లయానికి పంపిస్తాడు. ఎవరూ గెలవరు. ఎందుకంటే వరుణుడు అంతా తెలిసినవాడు. అష్టావక్రుడు ఐదేళ్ళ కుర్రవాడు, తండ్రి ఓడిపోయేలోగా తాను సభకు వెళ్తాడు. అతను సభలో ప్రవేశించ గానే అక్కడున్న బ్రహ్మావాదులందరూ చూస్తారు. జనకుడు కూడా

చూస్తాడు. ఎనిమిది వంకరలతో కూడిన పిల్లవాడిని చూసి అందరికీ నవ్వు వచ్చింది. వాళ్ళందరూ నవ్వడం ఆపిన తరువాత తాను వాళ్ళందరినీ చూసి అంతకన్నా బిగ్గరగా నవ్వుతాడు. అప్పుడు జనకుడు ఆశ్చర్యపోతాడు.

మనం వీడిని చూసి నవ్వితే, వాడు మనలను చూసి నవ్వు తున్నాడని ఆ పిల్లవాడిని కూర్చుండబెట్టి 'మేము నవ్వితే నీవెందుకు నవ్వావు?' అని అడిగితే, ఇక్కడ మీరందరూ బ్రహ్మం గురించి మాట్లాడుతున్నారు అంటే బ్రహ్మదర్శనులై వుండాలి. బ్రహ్మాన్ని చూడని వాళ్ళు మాట్లాడితే ఇలాగే వుంటుంది. మీ నవ్వు చూసి తెలిసిపోయింది. మీలో ఎవ్వరికీ బ్రహ్మాన్ని గురించి తెలియదని తెలిసింది. అందుకే నవ్వాను. మీరు నా రూపం చూసి నవ్వారు. రూపం బ్రహ్మమా? రూపంలో నుండి ప్రకాశించేది బ్రహ్మమా? రూపాన్ని చూసి నిర్ణయించే మీరు బ్రహ్మవాదులు ఎలా అవుతారు? ఇక్కడ వున్నవాళ్ళందరినీ ముందుగా వరుణాలయానికి పంపాలి అన్నాడు. సభలోవున్న వారందరూ ఆశ్చర్యపోతారు.

సభలోని వారంతా ఏమిటీ బ్రహ్మం అంటే – అది అవ్యక్తం, దానికి రూపం లేదు, గుణం లేదు. అది అనిర్వచనీయం, తర్కానికి అతీతమైనది. అప్రతర్క్యం, అవిజ్ఞేయం. తెలుసుకోవడానికి వీలు పడదు. దానిలోనికి మనం చేరిపోవటమే ఉంటుంది. అలాంటి

తత్త్వం గురించి మాట్లాడుకునే వారు నన్ను చూచినప్పుడు నాలో 'నేను' కనబడక రూపం కనిపించింది. కాబట్టి మీరు ఎలాంటివారో అర్థమై నవ్వు వచ్చింది. నేను మిమ్ములను చూచి నవ్వటంలో సత్యముందా? మీరు నన్ను చూసి నవ్వటంలో సత్యముందా? అని అడుగుతాడు.

జనకుడు సాక్షాత్తు జనకుడే కదా! ఆయన మహాయోగి. దిగివచ్చి దండం పెడతాడు. తన సభలో ఉండమని అడుగుతాడు. అందుకు అష్టావక్రుడు 'నీ సభలో ఉండవలసిన అగత్యం నాకు లేదని' అంటాడు. అష్టావక్రుడు ఎలాంటివాడంటే ఆయనే జనకునికి 'అష్టావక్ర సంహిత' చెబుతాడు.

నచికేతుడు కూడా యమలోకంలోకి ఎందుకు వెళ్ళాడు? తండ్రి చేసినది నచ్చక. తండ్రి చేసే పుణ్యకార్యాల్లో శ్రద్ధలేదని, అది తండ్రికి తెలియచేయాలని, తండ్రి కోసమే యమలోకం వెళ్తాడు. అందుకనే మొట్టమొదట కఠోపనిషత్తులో ఏం చెబుతారంటే "జీవితంలో బాగుపడదా మనుకునేవాళ్ళు, ఏ పని చేసినా, ఆ పనిని దైవంగా దర్శించి, శ్రద్ధగా నిర్వర్తించమంటారు." అన్నిటియందూ శ్రద్ధ ఉండాలి. దేహపోషణమునందు, మాటలయందు, చేతలయందు, చూపులయందు, వినికిడియందు శ్రద్ధ ఉండాలి. మామూలుగా చేసే పనులు కూడ శ్రద్ధగా చేయాలి. దైవమును

గూర్చిన పనిని శ్రద్ధ లేకుండా చేస్తే దానికి పర్యవసానా లుంటాయి. మంచి లోకాలకు, పుణ్యలోకాలకు, ఉత్తమలోకాలకు, స్వర్గానికి పోవాలని తాపత్రయపడి ఫలాపేక్షతో చేసే యజ్ఞములో తండ్రికి శ్రద్ధ లోపించింది. దానితో తండ్రి పతనం చెందుతాడు. అందుకు నచికేతుడు అడ్డుపడతాడు. మనం నిద్రలేచి మంచంపై కూచున్నప్పుడు శ్రద్ధ ఆవరించాలి. దుప్పట్లు చక్కగా మడిచిపెట్టు కోవడంలో, దంతధావనంలో, స్నానంలో శ్రద్ధ చూపించాలి. అతి చిన్న విషయం నుండి అతి పెద్ద విషయం వరకు శ్రద్ధ వహించి ఉండాలి. శ్రద్ధ వల్లనే సమస్తము సమకూరుతాయి. మన ప్రజ్ఞ అప్రమత్తంగా ఉండాలంటే శ్రద్ధ అవసరం. అప్రమత్తమగు ప్రజ్ఞకు సర్వమూ సాధ్యమే. శ్రద్ధ ఉన్న మనిషి పరాకుగా వుండక ప్రస్తుతంలో ఉంటాడు. మరచిపోవడం ఉండదు. మరపు లేని వానికి మృత్యువు కూడ లేదు!

# 4. యమలోక ప్రవేశం

**తం**డ్రి అనాలోచితమైన 'వాక్కు' కారణంగా నచికేతుడు యముడి దగ్గరకు వెళ్ళేముందు ఇలా అనుకుంటాడు. "నేను తండ్రి దగ్గరుండే విద్యార్థులలో అందరికన్నా గొప్పవాడినని అనను కాని హీనుడను మాత్రం కాదే. ఎందుకు ఇలా జరిగింది?" తండ్రికి తనపై అంత ఆగ్రహం కలిగిందే అని విచారిస్తాడు. తండ్రిని కలవరపరిచి, అతని ఆగ్రహమునకు పాత్రుడవటము నచికేతునికి వైఫల్య మనిపించింది. ఎలాగైనా మరల తండ్రి అనుగ్రహం భవిష్యత్తులో పొందాలని నిర్ణయించుకొంటాడు. ప్రస్తుతం తను తండ్రి ఆజ్ఞను నిర్వర్తించాలి కదా! అది దైవ నిర్ణయము అనుకొని యమలోకానికి వెళ్తాడు. యమలోకానికి వెళ్ళటానికి యమధర్మరాజు చిట్టాలో నచికేతుడు వచ్చే కార్యక్రమం లేదుకదా!

లోకాలలో ఎవరెవరు, ఎప్పుడెప్పుడు మరణించ వలసిన దినపట్టీ ఆయనకు సమయం ప్రకారం వచ్చేస్తుంది. ఆయన ఆ యా జీవులను పట్టుకొచ్చేస్తుంటాడు. అన్నీ సమయానికి సరిగా జరిగి పోతుంటాయి. శ్రద్ధకి యముడు ప్రతీక.

నచికేతుడికి ఉన్న శ్రద్ధ కారణంగా అలాంటి లోకంలోకి ప్రవేశిస్తాడు. అక్కడ అతనికోసం యమలోకం తెరచి ఉండదు. ఎందుకంటే నచికేతుడు అక్కడికి రావటానికి అపాయింట్‌మెంట్ ఉండదు. రావలసినవాళ్ళు వచ్చినప్పుడు మాత్రమే ద్వారాలు తెరుచుకుంటాయి. అక్కడ నచికేతుడు మూడు రోజులపాటు (మూడు పగళ్ళు, మూడు రాత్రులు) వేచి ఉంటాడు. నిద్ర, ఆహారం, కనీసం మంచినీళ్ళు కూడా వుండవు. లోకవ్యవహారాలన్నీ చూసుకొని యమధర్మరాజు యమలోకానికి వచ్చి ఈ కుర్రవాడిని చూస్తాడు. ఆయన మంత్రులు వచ్చి "ఈ కుర్రవాడు



బ్రాహ్మణ కుమారుడు. చూస్తే అగ్నిహోత్రుడిలా ఉన్నాడు. మూడు రోజుల నుండి నీళ్ళు, నిద్రాహారాలు మాని మీకోసం వేచి వున్నాడు" అని చెబుతారు.

అలా అపాయింట్‌మెంట్ లేకుండా వచ్చేవాడు అతిథి. భగవంతుడు మన ఇంట్లోకి వచ్చే ముందు అపాయింట్‌మెంట్ తీసుకొని వస్తాడా? *'అతిథి దేవోభవ!'* అన్నారు. తల్లి, తండ్రి, గురువే కాక అతిథి కూడా దేవుడే. తిథి, వార, నక్షత్ర సంబంధం లేకుండా వచ్చేవాడు అతిథి. వచ్చిన వాడిని బయట నిలబెట్టి 'ఎందుకు వచ్చారండి?' అనకూడదు. ఎవడు వచ్చినా, బయటే నిలబెట్టి పంపకుండా కూచోబెట్టి మంచినీళ్ళు యివ్వాలి. వాడి కోసం కాదు, నీకోసం. నీరు యిచ్చి వారొచ్చిన కారణం అడగాలి. నీకు తెలియకుండా, సంబంధం లేకుండా, నీ అనుమతి లేకుండా, నీ ముందు నిలబడ్డాడంటే వాడు ఎవడైనా కావచ్చు. వచ్చినవాడిని కూచోబెట్టి మంచినీళ్ళు ఇవ్వటమనేది సదాచారం.

చిన్నపిల్లవాడు, మూడు రోజుల నుండి అన్నం తినలేదు, మంచి నీళ్ళు త్రాగలేదు, నిద్రపోలేదంటే మానవ లోకంలో మూడు రోజులు కాదది. యమలోకంలో మూడు రోజులు. మానవ లోకంలో ఒక సంవత్సరము దేవతాలోకాలలో ఒక రోజు. మన ఒక నెల పితృ లోకాలలోని వారికి ఒక రోజు. మనం మాసికం

అని వెళ్ళిపోయిన వారికోసం పన్నెండు నెలలు పెడుతుంటాము. కాని వాళ్ళకు అది పన్నెండు నెలలు కాదు, పన్నెండు రోజులు.

యమలోకం సూర్యసమానమైన లోకం. సూర్యుడు, అగ్ని, వాయువు, యముడు మొదలైన దేవతలున్నారు. కుబేరుడు, నిఋతి లాంటి అష్టదిక్పాలకు లున్నారు. భూలోకంలో ఒక సంవత్సరం అక్కడ ఒక రోజు. అలాంటిది నచికేతుడు అక్కడ మూడు రోజులున్నాడుట అంటే భూలోకం లెక్కలో మూడు సంవత్సరములు. అలా మూడు సంవత్సరముల పాటు ఆహారం లేకుండా, మంచినీళ్ళు త్రాగకుండా, నిద్రపోకుండా ఒక చిన్న పిల్లవాడు ఉన్నాడంటే వాడు ఎంతటివాడై ఉండాలి! అక్కడ ఉండే యమధర్మరాజు, మంత్రులు చాలా ఆశ్చర్యపోయారు. అసలు అక్కడికి వచ్చే ప్రేతాలన్నీ మహా దాహంతో వస్తుంటాయి. మంచినీళ్ళు ఇస్తే చాలు అనేటట్టుగా ఉంటాయి. అందుకే ప్రేత సంస్కారము చేసినప్పుడు విపరీతమైన ఉదకదానం ఉంటుంది. ఎన్ని తర్పణాలు విడిస్తే జీవుడికి అంత తృప్తి. మరి నచికేతుడు మంచినీళ్ళు, ఆహారము అడగలేదు. నిద్ర కూడా పోలేదు. యముడికి ఎందుకు ఆశ్చర్యం వేసిందంటే తన లోకంలోకి తనకు తెలియకుండా రాగలిగినవాడు ఎవడూ ఉండడు. పిలిస్తేనే ఎవరూ రారే! తానే వెళ్ళి ప్రేతాన్ని తెచ్చుకోవాలి. అలా వేలాదిమందిని

రోజూ తెచ్చుకొని వాళ్ళ వాళ్ళ పనులనుబట్టి వాళ్ళకు ఏదో అనుభవం అందిస్తూ ఉంటారు. మరీ బాగుంటే స్వర్గానికి పంపిస్తారు. లేదంటే నరకానికి పంపిస్తారు.

శ్రీకృష్ణుడు గీత తొమ్మిదవ అధ్యాయంలో పుణ్యం అయిపోతే స్వర్గంలో ఉండేవాడు నరకంలోకి వచ్చేస్తాడు. '*క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి*' మళ్ళీ పుణ్యం సంపాదించి మళ్ళీ స్వర్గానికి వెళ్తాడు. ఇట్లా మాటి మాటికీ పుడుతూనే వుంటాడు. ఇలా పుడుతూ, చస్తూ జీవులు కోటానుకోట్ల జన్మలు ఎత్తుతుంటారు. ఇది యుగాలైనా, కల్పాలైనా తెమలవు. పెరుగుతూనే ఉంటాయి. అందుచేత ఇలాంటి వాటిలో నుంచి బయటకు రావాలంటే ఎట్లా వస్తావు? అందుకే కృష్ణుడు '*మామేకం శరణం వ్రజ*' నన్ను (బ్రహ్మమును) శరణు వేడమన్నాడు. ఆ బ్రహ్మమును సద్గురువు ద్వారానే చేర గలము. సద్గురువు మూర్తీభవించిన బ్రహ్మమే!

నచికేతుడు అలా ఉండటం చూసి చాలా ఆనందించి, "ఏమయ్యా, నీతో నాకేం పనిలేదు కదా! పిలిస్తేనే ఎవడూ రాడు కదా! నీ అంతట నీవే వచ్చేశావు. నిన్ను చూస్తే చాలా ఆనందంగా ఉంది. నీకు మూడు వరాలు ఇస్తాను, కోరుకో" అంటాడు. యముడు మూడు వరాలు ఇచ్చినప్పుడు నచికేతుడు మొదటి వరంగా **"మా తండ్రి భూమిమీద ఉన్నాడు. ముందు ఆయనకు**

**నాపై కోపం పోగొట్టమని"** అడుగుతాడు. ఎందుకంటే సత్పురుషులు మనమీద అలిగితే, దాని వలన మళ్ళీ దుష్ఫలితాలు, పర్యవసానా లుంటాయి. నేను తిరిగి వెళ్ళినప్పుడు నా తండ్రి నా మీద కినుక వహించకుండా ఉన్ముఖుడై వుండేలా ఆశీర్వదించు అని అడుగు తాడు. ఆ మాట విని యముడు ఆనందిస్తాడు.

నచికేతుడికి తిరిగి భూమి మీదకు వెళ్తాననే నమ్మకం ఉంది! రామాయణంలో కూడా రాముడు జీవితమంతా తండ్రిని ఉద్ధరించడానికే గడిపాడు. తనకు ఏ ఉద్ధారణ అక్కరలేదు. కేవలం దశరథుని ఉద్ధరించడానికే కొడుకుగా పుడతాడు. లోకంలో ధర్మం నేర్పడానికి, ఉత్తమంగా ఎలా జీవించాలో తెలియచేయటానికి పుడతాడు. అంతే కాని భూమి మీద తాను పొందవలసింది ఏమీ లేదు. రాముడు నిర్వర్తించిన ఉత్తమోత్తమ ధర్మం 'పిత్రోద్ధరణ'. ఇలా రాముడు ఎన్నో ధర్మాలను నిర్వర్తించాడు. భరతుడు తన ధర్మాన్ని పరిపూర్ణంగా నిర్వర్తిస్తాడు. జరిగిన అధర్మాన్ని తెలుసు కున్నాడు. తల్లి మమకారంతో రాజ్యం కోరింది. రాముడికి భరతుని గురించే కాదు, అందరి గురించి కూడా తెలుసు.

హనుమంతుడు ఎవరూ చేయలేని, ఎవరూ చేయని పని చేసినప్పుడు రాముడు హనుమంతుని కౌగలించుకొని నీవు భరతునితో సమానమైన సోదరుడవు అన్నాడు. దీనిని బట్టి

భరతుడు ఎంతటివాడో అర్థమవుతుంది. హనుమంతుడికి కూడా భరతుడంటే తెలియాలని లంకనుండి తిరిగి వచ్చేటప్పుడు, మళ్ళీ భరద్వాజ ఆశ్రమంలో ఆగి, "భరతుడు పధ్నాలుగేళ్ళు రాజ్యం ఏలాడు కదా! అలవాటు పడ్డాడేమో చూడు. ఒకసారి చూసిరా, రాజ్యానికి అలవాటు పడితే ఇక్కడి నుంచి నేను వెనక్కు వెళ్ళిపోతాను" అని హనుమంతుని పంపిస్తాడు. హనుమంతుడు వెళ్ళి చూస్తే అక్కడ భరతుడు కాక సాక్షాత్తు రాముడే వుంటాడు. రాముడికి ప్రతీకయే భరతుడు. భరతుడు ఎక్కడా రాజుగా ఉండడు. బంటుగానే అన్ని కార్యాలను నిర్వహిస్తాడు. వనవాసం చేసే రాముడు ఎలా ఉంటాడో, రాజప్రాసాదంలో రాజ్యానికి రక్షకుడిగా భరతుడు అలా ఉంటాడు. ఏదీ లేనిచోట జటా వల్కలములు, నార వస్త్రములు, దీక్ష. కాని అన్నీ ఉన్నచోట అలా ఉండటం వేరుకదా! రాముడు భరతుడికి చెప్పిన సమయం అయిపోతూ వుంది. రాముడు సమయానికి రాకపోతే ప్రాయోప వేశం చేస్తానని భరతుడు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటాడు. హనుమంతుడికి చాలా ఆశ్చర్యం వేస్తుంది. మన వలన మన ముందు తరం వాళ్ళు ఉత్తమ లోకాలకు వెళ్ళాలి. కాని మనవలన వాళ్ళు దిగజార కూడదు. వాళ్ళకున్న స్థితికి భంగం కలుగ కూడదు. నీవు చేసే పనివలన ముందు మూడు తరాలకి, వృద్ధి

అయినా జరుగుతుంది లేక అజ్ఞానం చేత హాని కూడా జరుగు తుంది. అలా హాని జరిగితే సంతానం గురించి బాధపడతారు.

అలాగే సద్గురువు కూడా సదాచార సంపన్నుడైన శిష్యుడు చక్కగా ఇచ్చిన యోగాన్ని శ్రద్ధతోనూ, భక్తితోనూ, విధి విధానంగా నిర్వర్తిస్తుంటే సద్గురువుకు కూడా ఉత్తమగతు లుంటాయి. అందుకే సద్గురువులు తొందరపడి ఎవరినీ శిష్యులని అంగీకరించరు. ఎందుకంటే శిష్యుడు బాగా నిష్ణాతుడని దృఢ నమ్మకం ఏర్పడాలి. వీడు చాలా వెలుగు తేగలడనిపిస్తే అలాంటి వాడికి లోపలే ఉపదేశం జరుగుతుంది. మిగతా వారందరికీ జనరల్‌గా జరుగు తుంది. అందుకనే సద్గురువుకు కూడా మానసపుత్రుడు ఉంటాడు. తన మనసుకు అన్నివిధాల నచ్చినవాడుంటే వాడి చెవిలో చొప్పిం చేస్తాడు.

మరో ఉదాహరణ : శుక మహర్షి. శుకుని తండ్రి వేద వ్యాసుడు. శుకుని వలన ఇంకా ఉత్తమ లోకాలకు వెళ్ళగలడు. వేదవ్యాసుడి తండ్రి పరాశరుడు. శుకుని వలన వేదవ్యాసుడు, వేదవ్యాసుని వలన పరాశరుడు, పరాశరుని వలన శక్తి మహర్షి, శక్తి మహర్షి వలన వశిష్ఠ మహర్షికి సప్తఋషులలో ఒకరైనా అందరికీ ఉన్నతి కలిగించేలా ఒక వంశ పరంపరవుంది. ముగ్గురిని ఉద్ధరించటానికైనా, కిందకు లాగేయటానికైనా ఒకడు చాలు.

తన తరువాత మూడు తరాలకు దారి ఇచ్చి వెళ్ళటమనేది ఒక మహత్తరమైన బాధ్యత. తన ముందు మూడు తరాలు ఉద్ధరింప బడటం, తరువాత మూడు తరాలు కాక ఏడు తరాలైనా, పధ్నాలుగు తరాలైనా ఎక్కడా తెంపు లేకుండా అనుసరించాలి. కుసంస్కారం గల కొడుకు తన దగ్గర ఉన్న తండ్రికి గాని, గురువుకుగాని క్షోభే.

నచికేతుడు కొడుకు కాబట్టి తండ్రి చేసే పని తప్పని చెప్ప కూడదు. తప్పని చెప్పినా తండ్రి ఉద్ధరింపబడేవాడు కాడు. తండ్రికి తన మీద కోపం పోగొడితే చాలు. పోగొడితే తన తండ్రిని ఉద్ధారణ మార్గంలో నిలబెట్టవచ్చు. నాన్న పద్ధతిలో ఇది తప్పు. ఉన్నవాటిలో విలువైనవి దానం చేయాలి తప్ప, విలువలేనివి దానం చేయకూడదు. గోవు విలువ తెలిసినవాళ్ళు పుచ్చు కుంటారు. దానిని పుచ్చుకొని సంరక్షించుకునే వాడికి ఎలాగూ ఆశీర్వచనం ఉంటుంది. కాబట్టి తండ్రికొరకు, తండ్రి ప్రీతిని పొందటానికి, నచికేతుడు యముని వరం కోరాడు. అపుడు యమదేవుడు సంతసించి ఇలా అన్నాడు.

“నీవు యమలోకానికి వెళ్ళినప్పుడు ఇలా ఎందుకన్నానా? అని దుఃఖపడినాడు నీ తండ్రి. తాను పొరబాటుగా అన్నానేమో అని బాధ పడుతున్నాడు. నీ తండ్రి బాగుపడతాడు. నీకేం భయం

లేదు. నీ తండ్రి నిన్ను ఆప్యాయంగా ఆదుకొంటాడు. అలా శాంత మనస్కుడు అవుతాడు. సుమనస్కుడు అవుతాడు. అన్ని కలవర ములు తీరి రాత్రులందు హాయిగా నిద్రిస్తాడు." అని యముడు వరమిస్తాడు.

మొదటివరం పొందిన నచికేతుడు రెండవ వరం కోర నుపక్రమిస్తాడు. **"ఓ యమదేవా! స్వర్గలోకంలో ఏ భయమూ లేదు. వృద్ధాప్యము కూడ లేదు. రోగాలు, రోష్టులు లేవు. ఎప్పుడూ సుఖ సంతోషాలే ఉంటాయి. నీవు స్వర్గలోకంలో ఉండవు కాబట్టి వారికి మృత్యుభయము కూడ ఉండదు. వారికి ఆకలిదప్పుల బాధ లుండవు.**

**యమదేవా! నీకు స్వర్గం చేరే మార్గాలు తెలుసు. యజ్ఞాలు తెలుసు. కార్యాలు తెలుసు. స్వర్గం చేర్చే అగ్నికార్యం నీకు తెలుసును. నేను శ్రద్ధగా నీ వద్ద ఆ అగ్ని విద్యను నేర్చగలను. నాకు దయతో ఆ విద్యను ఉపదేశింపుము. ఇది నేను కోరే రెండవ వరం"** అని నచికేతుడు పలికాడు.

దానికి యమదేవుడు ఇలా సమాధానం తెలిపాడు.

# 5. నచికేతాగ్ని

"**మా**నవులంతా బాగా సుఖ సంతోషాలతో ఉండాలని అనుకుంటారు. ఇది సహజమైన కోరిక. ఏం చేసినా సుఖం కోసమేగా. అది ఉన్నట్టుగాను, లేనట్టుగానూ ఉంటుంది. దివ్య సంపదలన్నీ అనుభవిస్తూ స్వర్గానికి చేరుకొనే మార్గాలున్నాయి. అమరులు ఆ విధంగా అనుభూతి చెందుతూ ఉంటారు. అందుచేత ఈ నరులు అమరులు కావాలంటే ఏమి చేయాలి? అని అడుగుతారు. స్వర్గంలో ఉండేది దేవతలు కదా! దేవతలను ఆరాధించడం ఒక పద్ధతి. ఈ దేవతలందరికీ మూలం అగ్ని. అన్నిటికీ మూలం అగ్ని. ఆ అగ్నిని ఆరాధించాలి."

అగ్ని ఆరాధన ప్రాచీనంగా ప్రతి నాగరికతలో కూడా ఉండేది. చేతనైనవాళ్ళు చేస్తుంటారు. మిగతావాళ్ళు దర్శిస్తూ పాల్గొంటారు. అందుచేత అగ్ని ఆరాధన ఒకటి యముడు యిచ్చి దాని రహస్యాలు అన్నీ చెబుతాడు. అగ్ని ఆరాధన అంటే అది బహిర్యాగంగాను, అంతర్యాగంగానూ చేయవచ్చు. బహిర్యాగంగా చేస్తే బయట సంపదలు ఏర్పడతాయి. అంతర్యాగంగా చేస్తే లోపల

పవిత్రత ఏర్పడుతుంది. అగ్ని ఎంతో పవిత్రీకరిస్తుంది. అందుచేత అగ్ని ఆరాధనా విధానాన్ని చెబుతాడు. ఆ అగ్ని ఆరాధన ఏవిధంగా చేసుకోవాలో కూడా చెబుతాడు. దానిని రోజూ మూడుసార్లు చేసుకోమంటాడు. అందుకనే మనకి 'త్రికాల సంధ్య' నియమం పెట్టారు.


అసలు రహస్యమేమిటంటే ఇరవై నాలుగు గంటలతో కూడిన ఒకరోజులో ప్రతి ఎనిమిది గంటల కొకసారి ఆరాధన చేయాలి. అంతర్యాగం కాని, బహిర్యాగం కాని మూడుసార్లు చేయాలి. అలా చేస్తే సత్ఫలితాలు వస్తాయి. అంతర్యాగం అంటే లోపల వెలుగును దర్శనం చేస్తూ, ఆరాధన చేయాలి. హృదయంలోకాని, భ్రూమధ్యంలోకాని జ్యోతి దర్శనం చేస్తూ ఆరాధించాలి. ధ్యానం చేయాలి. బహిర్యాగం అంటే అదే వెలుగును ఎదుట దర్శనం చేస్తూ ఆరాధన చేయటం. ఈ ప్రయత్నం చేయాలంటే ఎనిమిది గంటల విభజన చేసుకోవాలి. తెలిసినవారు ఏమి చెబుతారంటే తెల్లవారుజామున నాలుగు గంటలకు ఒకసారి, మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఒకసారి, తరువాత రాత్రి ఎనిమిది గంటలకు ఒకసారి చేసుకోమని. ఇది చాలా ఉత్తమోత్తమమైనది. దినచర్యకు ఏ మాత్రమూ అంతరాయము కలిగించనటువంటిది. కాని దానికి చాలా శ్రద్ధ కావాలి. దానిని

బట్టి మన జీవితాన్నంతా మార్చుకోవచ్చు. మనకు సి.వి.వి.గారు ఉదయం ఆరు గంటలు, మధ్యాహ్నం పన్నెండు గంటలు, సాయంత్రం ఆరు గంటలుగా ప్రార్థన ఇచ్చారు. ఉదయం ఆరు గంటలకు లేవలేము. సాయంత్రం ఆరు గంటలకు ఎప్పుడూ బిజీగా ఉంటాము. మధ్యాహ్నం పన్నెండు ఎప్పుడూ కుదరదు. కాబట్టి సాధ్యపడదు. అది కానప్పుడు పవిత్రత లోపల ఏర్పడటం కష్టం.


నచికేతాగ్నిలో 'ఇష్టికా' అనే ఒక పదం ఉంది. ఇష్టికా అంటే ఇటుక. ఇటుకలు ఎన్ని ఉండాలి? ఇరవై నాలుగు ఇటుకలు ఉండాలి. ఆ ఇరవై నాలుగు ఇటుకలు మూడు వరుసల్లో ఎనిమిది చొప్పున పేర్చుకోవడం ఒక పద్ధతి. అది చతురస్రంగానే ఏర్పరచు కోవాలి. వృత్తాకారంగా ఏర్పరచకూడదు. వృత్తాకారంగా అగ్ని కార్యం చేయకూడదు. ఉన్నది తీసేయడానికి, సున్నా చుట్టేయ డానికి వృత్తం. అవతరణం జరగాలంటే చతురస్రం కావాలి. అవతరణం చెందిన దానిని మళ్ళీ అదృశ్యం చేయాలంటే వృత్తం కావాలి. To manifest it is Square. To demanifest it is Circle. To keep manifesting it is the Triangle over Square.

చతురస్రం ఏర్పాటుచేసి దేవతలను ఆవాహనం చేయటం భౌగోళికంగా అన్ని సంప్రదాయాలలోను వుంది. ఊర్ధ్వగతులు

చేరటానికి వృత్తం వాడటం కూడా సర్వదా పరిపాటి. ఊర్ధ్వముఖ త్రిభుజము కూడా ఊర్ధ్వమును చేరుటకు వాడతారు. అధోముఖ త్రిభుజము అవతరణమునకు వాడతారు.




ఊర్ధ్వ, అధోముఖముల రాకపోకలకు



రెంటిని గూర్చి ఆరాధన చేస్తారు. అలాగే దేవాలయాలను నిర్మించే టపుడు ఎగువన త్రిభుజము, దిగువన చతురస్రం వాడతారు. ఇది అంతా యంత్ర, తంత్ర, మంత్ర శాస్త్రము.

ప్రస్తుతం మనకు 'ఇష్టి' లేక ఇటుక తెలుపబడింది. యమదేవుడు ఇటుకలను అగ్నికార్యానికి ఎలా ఏర్పాటు చేసు కోవాలో తెలుపుతాడు. ఇటుక అంటే అది నిర్మాణానికి ఉపయోగ పడే వస్తువు. ఒక దేవాలయంగాని, ఒక గృహంగాని నిర్మాణం చేయాలంటే ఇటుకలు కావాలి. ఇటుకలకు లంబకోణం, దీర్ఘ

చతురస్రం, ఎదురు బదురుల సమానత్వం అవసరం. అంటే మన ప్రవర్తనలో సత్వగుణం, సమభావం, నిజాయితి, నీతి అవసరం. అలాంటివి 24 ఇటుకలు ఏర్పరుచుకోవాలి. 8



ఇటుకలు చొప్పున 3 అంతస్తులుగా పేర్చాలి. అంటే మనో వాక్కాయ కర్మలయందు పై తెలిపిన నాలుగు గుణాలు భాసించాలి. అలాంటి ప్రవర్తన గలవారే ఆరాధనకు అర్హులు.

ఇటుకలు అలా పేర్చుకొని మూడుసార్లు, మూడు కాలాల్లోనూ త్రేతాగ్నులు చేస్తుండేవారు. ఇది బాహ్యం. అంతరంగంలో కూడా అగ్ని ఆరాధన ఉంది. అది లోపల చేయాలి. లోపల కనీసం ఇరవై నాలుగు నిముషాలు చేయాలి. ఇరవై నాలుగు గంటలకు ఇరవై నాలుగు నిముషాలు. ఇరవై నాలుగు ఒక ప్రతీక. ఇష్టి అంటే రెండూ కలిపితే వచ్చే చప్పుడు, Cling అనిపించే శబ్దం. బాగా గట్టిగా ఉండే ఇటుకను Clinker అంటారు. దానిని Hard Brick అంటారు. బయట ఇల్లు కట్టుకోవాలంటే ఇటుకలు

కావాలి. అలాగే లోపల ఇల్లు కట్టాలంటే కూడా ఇటుకలు కావాలి. కాని లోపలి ఇంటికి కావలసిన ఇటుకలు శబ్దంతో, అంటే ఉచ్చారణను బట్టి ఉద్ధరించే అగ్ని పుడుతుంది. కాల్చే అగ్ని పుడుతుంది. అగ్ని రెండు కార్యాలు చేస్తుంది. అగ్ని పవిత్రీకరిస్తుంది, అలాగే ఒళ్ళంతా కాల్చేస్తుంది. శబ్దాన్ని చక్కగా ఉచ్చరించి నీలోపల నిర్మాణం చేసుకోవడానికి గురుముఖంగా ఒక శబ్దం తీసుకోవాలి. త్రికాలాలలోను దీనిని నిర్వహించడం వలన నీలోపల సంపద ఏర్పడుతుంది. ఆ లోపలి సంపదనే ధనం అంటారు. అది రూపాయలు, డాలర్లు కాదు.

వేదంలో ధనం అంటే *"ధనం అగ్ని, ధనం వాయుః, ధనం సూర్యో, ధనం వసుః"* అన్నారు. లోపల అగ్ని, వాయువు ఒకరికొకరు తోడుగా ఉంటారు. అనల, అనిల తోడుగా పనిచేస్తారు. అందుకని *'అగ్నయే నమః, వాయవే నమః'* అంటారు. అగ్ని తరువాత వెంటనే తలచుకొనేది వాయువునే. ఎందుకంటే *'ధనం అగ్ని, ధనం వాయుః'* కదా! హనుమంతుడు పవమాన (వాయు) పుత్రుడు. అది పవిత్రీకరించే వాయువు. ముంచేసే వాయువు, పడగొట్టే వాయువు, అన్నిటినీ లేపేసే వాయువు కూడా ఉంటుంది. వాయువు చాలా బలమైనది. అందుచేత నీలోపల వాయువు పవిత్రం. వాయువు పవిత్రమైతే ప్రాణం పవిత్ర మవుతుంది. నీ

ప్రాణము, అగ్ని రెండూ కలిస్తే వెలుగు వస్తుంది. అది సూర్యుడు. ఆ వెలుగు లోపల కనిపిస్తుంది. 'నాలోన వెలుగు' అంటాము కదా! లోపల పవిత్రత పెరిగితే ఆ వెలుగు కనిపిస్తుంది. ఆ పవిత్రత పెంచాలంటే అగ్ని, వాయువు కావాలి. వాయువు వలననే అగ్ని ప్రజ్వలిస్తుంది. నీ లోపల పవిత్రీకరణ జరుగుతున్నకొద్దీ నీవు కన్నులు మూసుకొని, ఒకసారి చక్కగా 'ఓం'ను ఉచ్చారణ చేయగానే వెలుగును చూస్తావు. కనిపించడం మానేస్తే మళ్ళీ 'ఓం' ఉచ్చరించాలి. అలాగే శ్రీం, క్లీం, హ్రీం అని చాలా శబ్దా లున్నాయి. నిర్ణీత సమయంలో మూడుసార్లు చేసుకుంటే పవిత్రీ కరణ జరుగుతుంది. ఈ ధనం ఏర్పడితే, నిజమైన సుఖం ఉంటుంది. బయట లభించే ధనం సుఖము నివ్వవచ్చు, ఇవ్వక పోవచ్చు. కాని ఈ లోధనం ఎపుడూ సుఖాన్నిస్తూ వుంటుంది. బయట ధనానికి కాపలా, కట్టుదిట్టాలు వుంటాయి. ఈ లోధనం పదిలంగా వుంటుంది. శ్వాస ద్వారా దానిని పొందవచ్చు. అనుసంధానం చెంది వెలుగు ననుభవించవచ్చు.

సంతానం సంపద, గృహసౌఖ్యం సంపద, కుటుంబ సౌఖ్యం సంపద, దేహంలో హాయిగా ఉండటం సంపద. ఎప్పుడూ దేహంలో ఏదో బాధ ఉంటే, తెలిసినవాడు ఈ బాధ నాకు కాదు, దేహానికి అనుకుంటాడు. తెలియనివాడు రోగచింతన చేస్తూ

దాని చుట్టూ తిరుగుతుంటాడు. **రోగచింతన బదులు దైవచింతన చేస్తే రోగం నిన్ను ఏమీ చేయదు.** జబ్బులు మీదపడి నీ కర్తవ్యాన్ని ధ్వంసం చేయవు. ఎప్పుడూ ఆనందంగా ఉండటం అనేది సంపద. *"సంతుష్టుడీ ఏడు జగముల పూజ్యుండు, సంతోషికి ఎప్పుడు కలుగు శుభము"* అన్నారు. ఎంత ఉంటే మాత్రం దుఃఖపడే వారులేరు? అలాగే ఏమీ లేకపోయినా ఆనందంగా ఉండేవారు కూడా ఉన్నారు.

శుకమహర్షి వస్తే పరీక్షిత్తు ఒంటి స్తంభం మేడలో మంచి మంచి పరుపులు ఏర్పాటు చేశాడు. *"కమనీయంబగు భూమి భాగముల్ లేకున్నవే పడి ఉండుటకు, దూది పరుపులేలా"* అని శుకుడు అన్నాడు. నిద్రకు పరుపుకూ సంబంధం లేదు. కలత చెందిన మనసు నిద్ర పోనిస్తుందా? అందుచేత 'నిద్ర' అమ్మ అనుగ్రహమే. నీ ప్రవర్తన బాగుంటే అమ్మ అనుగ్రహముంటుంది. కొంతమందికి ఎటు పొర్లినా నిద్రపట్టదు.

గురుముఖంగా నేర్చుకున్న మంత్రాన్ని త్రికరణశుద్ధిగా ప్రతిరోజూ నిర్వర్తించు. అప్పుడు కన్నులు మూసుకుంటే లోపల తపోయజ్ఞము జరుగుతుంది. లోపల శబ్దం వినిపిస్తుంది. కన్నులు మూసుకోగానే నీవు ఎప్పుడూ చేసే మంత్రం వినిపిస్తూ ఉంటుంది. లోపల అలా తయారైన వారికి భయం వుండదు. రామమంత్రం

అలాంటిదే. కనులు మూసుకున్నవాడికి ‘ఓం’కారం అలా విని పిస్తుంది. బాగా వినగలవాడే అనగలడు. అందుకనే కనులు మూసుకోగానే ధ్వనితో అనుసంధానం చెందితే క్రమంగా అలా ఆ శబ్దం పవిత్రీకరణ చేస్తుంటుంది. అంతే అలా ఇరవై నాలుగు నిముషాలు చేయండి. లోపల చేయటానికి చాలా శ్రద్ధ కావాలి. అందుకే యముడు బహిర్యాగం కంటే అంతర్యాగం ముఖ్యమని చెబుతాడు. బయట అగ్ని ఆరాధన చేస్తే ఊరంతా తెలిసేటట్లుగా చేయటం ఒక పద్ధతి. లోపల అగ్ని ఆరాధన నీకు, నీలోని దైవానికి తప్ప తెలియకుండా చేసుకోవాలి. పవిత్రమైన విషయాన్ని బజారుపాలు చేయకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలి కదా!

యమునికి స్వర్గలోకానికి కొనిపోయే యజ్ఞం బాగా తెలుసు. నచికేతునకు ఆ యజ్ఞం, ఆ విద్య, ఆ అగ్నిని నేర్పుతాడు. దానివలన శాశ్వత స్వర్గ నివాసం ఏర్పడుతుందని తెలుపుతాడు. ఇక్కడ ఈ యజ్ఞము అంతర్ముఖమని, అది హృదయంలో నిర్వర్తింప బడవలసినది అని, కనుక నచికేతునికి నేర్పిన అగ్నియాగం అంతర్యాగమని తెలియాలి. **గురుముఖముగా నేర్చిన మంత్రాన్ని 8 గంటల కొకమారు, 24 నిమిషములపాటు అంతరంగమందు స్పందనలో చేర్చి వినటం ఇందలి రహస్యం.** స్పందనలో చేర్చబడి వినడం చేత మంత్రము బుద్ధిలోకమును ప్రచోదనం గావించి

వెలుగు దర్శనానికి దారి చూపుతుంది. బుద్ధి ప్రచోదనం జరుగగా క్రమంగా బుద్ధిలోకవాసం పరిచయ మవుతుంది. అదియే స్వర్గ లోకవాసం. అలాంటి సాధకునకు క్షరత్వము నుండి అక్షరత్వము లోనికి ప్రవేశం లభిస్తుంది. అక్షరత్వ ప్రవేశము శాశ్వతత్వము కలిగిస్తుంది. ప్రథమ వల్లిలోని 14వ శ్లోకంలో ఈ వివరాలన్నీ లభిస్తాయి.

*"త్వమేతం విద్ధి నిహితమ్ గుహాయామ్"* హృదయ గుహ యందు నిహితమై యున్నదని నీవు తెలుసుకో అని యమదేవుడు సూచిస్తాడు. కనుక స్వర్గలోకప్రాప్తికి అంతర్యాగము ప్రధానము. లోక రక్షణకు, పవిత్రీకరణకు బహిర్లోకయాగము చేయాలి. ఇది సూచన.

రెండవ వరంగా నచికేతుడు, **"యమధర్మరాజా! స్వర్గములో జీవించేవారు అమరత్వాన్ని సంతరించుకొంటారు. అక్కడికి తీసుకు పోగల యాగం గురించి నీకు తెలుసు. ఆ యాగం గురించి తెలియ జేయి"** అని కోరాడు. ఈ లోకంలో అందరికీ స్వర్గానికి వెళ్ళాలని ఉందా? అన్నట్లుగా మాట్లాడతాడు యముడు. అక్కడ భయ ముండదు. మృత్యుదేవత ఉండడు. అక్కడ వృద్ధాప్యము వలన భయపడరు. వారికి ఆకలి దప్పులు రెండూ లేవు. వారు శోక రహితులై, ఆనందంలో మునిగి ఉంటారు.

వాళ్ళంతా పుణ్యాత్ములు. సుఖము, సౌఖ్యము, స్వర్గానుభూతి, సువర్గానుభూతి మానవుడికి సహజం. కాని 'భగవద్గీత' అనే మరొక ఉపనిషత్తులో "పుణ్యం ఉన్నంతకాలము స్వర్గంలో ఉంటావు" అని చెప్పారు. శాశ్వతంగా అక్కడ ఉండాలనుకుంటే ఇక్కడ హరిశ్చంద్రాది చక్రవర్తులు నిర్వర్తించినట్లుగా త్యాగనిరతి చూపించాలి.

దానినే 'పురుషమేధ యజ్ఞము' లేక 'సర్వహుత యజ్ఞము' అంటారు. ఆ యజ్ఞములో నీకున్నదే కాక నిన్ను కూడా యిచ్చి వేయటం ఆత్మ త్యాగము. అలా చేసినవాళ్ళు స్వర్గంలో చేరతారు. మానవుడికి జన్మ పరంపర లున్నాయి. అది గొలుసుకట్టు కథ. ఆ తల్లికే, ఆ తండ్రికే, ఆ కుటుంబములోనే, ఆ రాష్ట్రంలోనే, ఆ దేశంలోనే ఎందుకు పుట్టాలి? దానికో కథ ఉంటుంది. వెనుకటి కథ తెలిస్తే అన్నీ తెలుస్తాయి. అది జరగాలంటే 'నచికేత విద్య' కావాలి.

ఈ విద్యను నచికేతుడు అడిగాడు కాబట్టి దానికి నీ పేరే పెడతానని 'నచికేత విద్య' అని యముడే పేరు పెట్టాడు. 'నేను దానిని నిర్వర్తించి ఇప్పుడు సృష్టి ధర్మాలలో యమ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను' అన్నాడు. 'అగ్నిక్రతువు' అని ఒకటి ఉంది. ఆ క్రతువును నిర్వర్తిస్తే జీవులకు సకల సంపదలు కలుగుతాయి.

అది నీకు వివరిస్తా నన్నాడు. స్వర్గాన్ని అందించేది, ప్రపంచానికి ఆధారమైన అగ్ని హృదయగుహలో ఉన్నది. ఆ అగ్నినే 'నచికేతాగ్ని' అంటారు. హృదయ గుహలోకి ప్రవేశిస్తే ఆ అగ్ని దొరుకుతుంది. స్వర్గానికి తీసుకెళ్ళే యాగం గురించి అడిగావు, అది నాకు తెలుసు, దానిని నీకు చెబుతాను. హృదయం చేరగల వారికి స్వర్గం చేరడానికి ఎక్కువ అవకాశం వుంది. అలా ఆదిలో ఉద్భవించిన ఆ యాగం గురించి యమధర్మరాజు నచికేతునికి చెప్పాడు. ఆ యాగానికి ఎటువంటి ఇటుకలు కావాలో, ఎన్ని కావాలో, ఏ విధంగా యాగకుండాన్ని అమర్చాలో విపులంగా చెప్పాడు. నచికేతుడు వాటిని అర్థం చేసుకోవడం చూసి సంతోషించాడు. ఇకపై ఈ యాగం నీ పేరిట ప్రసిద్ధ మవుతుంది. ఇంకా ఎన్నో రంగులు గల మాలను కూడా ఇచ్చాడు. ఈ నచికేత యాగాన్ని మూడుసార్లు చేసినవాడు ముగ్గురిని ఆశ్రయించి, మూడు విధు లను నిర్వర్తించినప్పుడు జనన, మరణాల్ని అతిక్రమిస్తాడు. బ్రహ్మ నుండి ఉద్భవించినవాడు, ఆరాధనీయుడు అయిన భగవంతుని తెలుసుకొని అనుభూతి చెందిన అతడు పరమ శాంతిని పొందు తాడు అని చెప్పాడు.

ఆయన చెప్పాడట, ఈయనకు అర్థమయిందట. మనకేమి అర్థమయింది? అప్పుడేమిటంటే ఒకచోట ఆగి, అదేమిటో తెలుసు

కోవడానికి ప్రయత్నం చేయాలి. ముగ్గురిని ఆశ్రయించి, మూడు చోట్ల, మూడు విధాలుగా చేయాలని చెప్పాడు. మూడు రకాలుగా ఉందంటే అది అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశాలను దాటి 'నీవు' వున్నావు. అలాగే నీవు చేయవలసిన తపస్సులు కూడా మూడు వున్నాయి. అవి వాఙ్మయ తపస్సు, మనోమయ తపస్సు, క్రియా తపస్సులు. మనోవాక్కాయకర్మలు శుద్ధిపరచు కోవాలి. నీవు భావించేది, ప్రసంగించేది, ఆచరించేది ఒకటిగానే ఉండాలి. దానినే అలైన్‌మెంట్ అంటారు.

ఇంకో మూడు *:* తల్లి ఋణం, తండ్రి ఋణం, గురువు ఋణం. ఈ మూడు తీర్చుకోవాలి. నీవల్ల తల్లి సంతోషించాలి, తండ్రి సంతోషించాలి, గురువు సంతోషించాలి. *'యద్యదాచరతి శ్రేష్ఠః'* అన్నారు కదా! పెద్దలు నడిచిన దారిని నడవరా! అని కృష్ణుడన్నాడు. పెద్దవాళ్ళు ఏ విధంగా మాట్లాడారో, ఆలోచించారో, ఎలా కార్యాలు చేశారో అవన్నీ గ్రంథస్థం చేశారు. అవన్నీ అమృతత్త్వం పొందిన గ్రంథాలు. మనకు అన్నీ తెలియాలంటే చాలా తపన కావాలి. అందుకు అంతఃకరణశుద్ధి కావాలి. మనసు, శరీరం, ఇంద్రియములు- ఈ మూడు త్రికరణములు శుద్ధి కావాలంటే మనోవాక్కాయ శుద్ధి కావాలి. తల్లి, తండ్రి, గురువు ఎట్టి పరిస్థితులలోనూ మనవల్ల దుఃఖపడకూడదు. తల్లి ఆశించి

నవి నీవు చేయడం వలన తల్లి మనసు సంతోషిస్తే నీకది పెద్ద వరం. ఆమె సంతోషిస్తే జగన్మాత మనస్సు సంతోషిస్తుంది.

తల్లిదండ్రులు భారమని కాక, బాధ్యతగా భావించాలి. తల్లి, భార్య, సోదరి, కుమార్తె– ఈ నలుగురినీ ఎవరు బాగా చూసుకుంటారో వారికి ప్రకృతియొక్క ఆశీర్వచనం పరిపూర్ణంగా ఉంటుంది. నీకు మొదట పరిచయ మయ్యేది తల్లే. తరువాత సోదరి. ఆ సోదరి నీవల్ల సంతోషంగా ఉండాలి. ఆ తరువాత భార్య. భార్యను దుఃఖపెట్టిన వాళ్ళెవరూ ఎంతో దూరం పోలేరు. ఆ తరువాత కుమార్తె. అక్కచెల్లెళ్ళను మోసం చేసినవాళ్ళు ప్రకృతి చేత హింసింప బడతారు. ఇది శాస్త్రం. అలాగే స్త్రీలు కూడా. నీ వల్ల ఇంటాయన బాధపడితే నీకూ అదే గతి. వివాహిత స్త్రీలకు తల్లిదండ్రులంటే భర్తయొక్క తల్లిదండ్రులే. ఎందుకంటే తన తల్లితండ్రులను, తన సోదరులను చూసుకోవడంలో కర్తవ్యం లేదు. ఆడపిల్ల కాని ఈడపిల్ల కాదు. వాళ్ళకు సంబంధించిన పిల్ల మనింట్లో పెరుగుతోంది. స్త్రీకి తను ఎవరింటికి వెళ్తుందో తెలిసి ఉంటుంది. అలా వెళ్ళిన చోట భర్తకు సహకరించడమే. భర్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్నప్పుడు, ఆ ధర్మానికి నీవు కూడా సహక రించాలి. అందుకే సహధర్మచారిణి అన్నారు. ఆయన చేసే మంచి పనికి నిరుత్సాహ పరచకూడదు. ఇద్దరూ కలిసి యజ్ఞార్థ జీవనం గడపాలి.

మూడు విధాలుగా అగ్నికార్యం చేయటమంటే అది నీలోని త్రేతాగ్నులు. అప్పుడు నీలో ఒక అగ్ని జ్వలిస్తుంది. హృదయ గుహలో ఉందంటే హృదయ చక్రం, హృదయ పద్మంగా మారు తుంది. చక్రం వేరు, పద్మం వేరు.

పై తెలిపిన మూడు తపస్సులు, పై తెలిపిన క్రమంలో నిర్వర్తిస్తే అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములు శుద్ధిచెంది హృదయ కేంద్రము వికసిస్తుంది. హృదయ చక్రం హృదయ పద్మమైనపుడు, అంతర్వికాసము కలుగుతుంది. ఆ వికాసము వలన అంతర్ముఖ జ్ఞానము అనంతంగా లభిస్తూ వుంటుంది. ఋషులందరూ అలా జ్ఞానం పొందినవారే. సత్యకాములు కూడ అలాగే పొందారు.

ఈ విషయాలన్నీ చాలా అమూల్య మైనవి. అందుకే బయట పెట్టరు. బంగారు, వజ్రాల వ్యాపారంలో అన్నీ బయట పెట్టరు. మనం కావాలన్న దానిని, మనలను కూర్చోపెట్టి ఎక్కడికో వెళ్ళి తీసుకొస్తాడు. మామూలు విషయాలే యిలా ఉంటే ఆత్మ పరమైన విషయాలు తెలియాలంటే సద్గురువు లభించాలి. అందు కోసం ప్రార్థన చేయాలి. సద్గురువు లభించడమే ఒక పెద్ద వరమని ఆచార్య శంకరులు చెబుతారు. నీలోని సత్ప్రవర్తన, తీవ్ర ఆకాంక్ష మూలంగానే సద్గురువు లభిస్తాడు. అప్పుడు *'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా, ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన తత్త్వదర్శినః'*

అని చెప్పినట్లుగా, బాగా శుశ్రూష చేసి వారి అనుగ్రహం పొంది, వీడు తగినవాడని అనిపించుకోవాలి. గురువు ఎవరిని పడితే వారిని అనుగ్రహించడు. ఎందుకంటే వీడు సరిగా చేయకపోతే తాను కూడ వెనకాల రావలసి ఉంటుంది.

మాస్టర్ ఇ.కె.గారితో 'మీకు శిష్యులు బోలెడుమంది' అంటే, ఆయన 'నాకు శిష్యులు ఎవరూ లేరు. అందరూ పేషెంట్లే!' అనేవారు. అందరూ హోమియో మందుకోసమో, ప్రమోషన్ కోసమో, పెళ్ళికోసమో– ఇలా వారి వారి ప్రయోజనాలు నిర్వర్తించు కోవటానికే వచ్చేవారు. మాస్టరుగారు చేసిపెట్టేవారు. కారణం గురువు తల్లి–తండ్రి కూడా కదా! ఆచార్య శంకరులు 'వివేక చూడామణి' అనే గ్రంథంలో "సంస్కారవంతమైన తల్లి దండ్రులకు పుట్టటం ఒక వరం. అలా సంస్కారవంతమైన తల్లి దండ్రులకు పుట్టిన తరువాత నీకు దివ్యశక్తి పట్ల ఆసక్తి ఉంటే అది రెండో వరం. గురువు దొరికితే అది మూడవ వరం" అన్నారు. దానితో వృద్ధి చెందుతాము. ఎందుకంటే పుట్టగానే ఇలాంటి సంస్కారం వుండి (దివ్య సంస్కారం), అటుపైన నీకు సహజంగా ఆసక్తి ఉంది. నీకు సద్గురువు దొరికాడు. అలాంటి వాడికి సిద్ధి చాలా సులభమని శంకరాచార్యులవారు వ్రాశారు. అలాంటి గురువు దొరికినప్పుడు ఆయన మనసెరిగి సేవ

చేయాలి. అలా చేస్తే ఆయన బోధిస్తాడు. అదొక పేర్పు. ఇటుకల పేర్పు. అలా పేరిస్తే మనకు తొమ్మిది పోతాయి. **ఆశ** అనే ఇటుకను పగుల కొట్టేస్తుంది. ఆశ ఉంటే ఒక ఇటుక విరిగి పోతుంది.

**రెండవది ధనాశ. భౌతికదేహ సుఖము.** కర్తవ్య మున్నప్పుడు ఆలోచించు, కర్తవ్యము లేనప్పుడు ఆలోచించకు. ఋతువులన్నీ తట్టుకోవాలి. శరీరానికి చెమట పట్టాలి. అప్పుడు ఆరోగ్యంగా ఉంటాము. లోపల ఎప్పటికప్పుడు అగ్నికార్యం జరుగుతుంది. అందువల్ల మాలిన్యాలు ఏర్పడుతుంటాయి. ఆ మాలిన్యాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పరిసరాలను పవిత్రంగా ఉంచుకోవాలి. ధనాశ వద్దు. కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటే ధనం నీ దగ్గరకు చేరుతుంది. అలా చేరిన ధనాన్ని సద్వినియోగం చేస్తే ఆనందాన్నిస్తుంది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నారు.

**మూడవది సుఖాశ.** కామవాంఛ. స్త్రీ పురుషులకు వివాహం వలన కామవాంఛ తీరిపోవాలి. ఈ మూడు తీరిపోతే మూడు ఇటుకలు ద్రవ్యమై పోతాయి. ఆశ ఉంటే భయముంటుంది. "Fear is the major energy totally submerging the mankind." అంటారు పరమగురువులు. మనకు అన్నిటికీ భయమే. కాని సత్య మున్నచోట భయ ముండదు. నీవు సత్యవంతుడవైతే నీకు

భయ మక్కరలేదు. భయము, కోపము, అనుమానం ఇవన్నీ ఒక కోవలోకి వస్తాయి. అలాగే **గర్వము**. నీలో గర్వముంటే దురభి ప్రాయము వెంటనే చేరుతుంది. “Where there is pride, there is prejudice.” నీకు అహంకారముంటే, గర్వంగా ఉంటే ఎదుటి వారిపై **దురభిప్రాయము** ఏర్పడుతుంది. దురభిప్రాయము, దురభిమానములకు పరస్పర సంబంధముంది. వీటివల్లనే కదా దుర్యోధనుడు పాడైపోయాడు. ద్రౌపది నవ్వినందుకు దుర్యోధను డికి కోపం వచ్చింది. దానితో కురుక్షేత్ర యుద్ధం జరిగింది. కురువంశము పతనమైంది. ఇతరులను గురించిన అభిప్రాయము లుండకూడదు. ఆ తరువాత **అసూయ**. అసూయ ఉన్నవాడు ఏమీ చేయలేడు. అందుకే కృష్ణుడు గీత పద్దెనిమిదవ అధ్యాయంలో అర్జునునితో ‘శ్రద్ధావాన్ అనసూయవాన్’ అంటూ నీకు శ్రద్ధ ఉండి, అసూయ లేకపోవటంచేత ఒక పరమ రహస్యం చెబుతా నంటాడు. **ఇలా ధనాశ, దేహ సౌఖ్యం, కామవాంఛ ఈ మూడు ఇటుకలు అంతరాయం కలిగించే దుండగులు. ఆ పైన భయం, అనుమానం, ద్వేషం, ఆ తరువాత గర్వము, దురభిప్రాయము, అసూయ– ఇలా మూడు, మూడుగా ఉంటాయి. ఈ తొమ్మిదింటినీ విసర్జించాలి.** అవి కేవలం ఆచరణ ద్వారానే పోతాయి. అప్పుడు మూడు, మూడు చొప్పున ఉండే పొరలుదాటి హృదయాన్ని మనం చేరిన వాళ్ళ మవుతాము.

నాల్గవ పొర ఉంటుంది. అలాంటి వాడికి సద్వచనం, సద్భాషణ. ఒక ప్రవచనం నిజంగా పనికివస్తుంది. అలాంటివాడికి స్వాధ్యాయం పనికివస్తుంది. అతడు ఋషుల దృష్టిలో, సద్గురువుల దృష్టిలో శుచియైనవాడు. శుచి, శౌచము కలిగినవాడికి 'స్వాధ్యాయము' సహజంగా ఉంటుంది. స్వ–అధ్యాయమంటే తనను గురించి తెలుసుకోవాలన్న తపన. నే నెవరు? రమణ మహర్షి బోధ అంతా అదే కదా! స్వాధ్యాయమంటే ఏమిటి? నే నెవరు? నే నెక్కడున్నాను? నేను ఏమి చేయుటకు పుట్టాను? Who am I ? Where am I ? What am I to do ? అంటే బాహ్యంలో ఉన్నానా లేక దేహబద్ధుడనై వున్నానా? లేక కోరికలకు బద్ధుడనై ఉన్నానా? భావనలో లుంగలు చుట్టుకొని ఉన్నానా? అంతకు మించి ఏవైనా ఉన్నాయా ? ఏ పొరలో ఉన్నాను ? నేను ఎక్కడున్నాను? అన్నమయ పొరలోనా? ప్రాణమయ పొరలోనా? మనోమయ పొరలోనా? విజ్ఞానమయ పొరలో ఉన్నానా? పరులకు ఉపయోగపడుతున్నావా? లేక వాళ్ళను నీకోసం వాడుకుంటున్నావా? నిన్ను నీవు పరిశీలించుకోవాలి. "If you can govern yourself you are good governor to govern others, If you are not a governor of yourself you can not govern others." నిన్ను నీవు పరిపాలించుకోలేని వాడివి పదిమందిని ఏమి

పరిపాలిస్తావు? దానికోసం అడ్డదారులు తొక్కుతూ అందలాలు ఎక్కుతున్న వారు పరిపాలించ గలుగుతున్నారా? ఎప్పటికీ పరిపాలించలేరు. అలాంటివారు 'కనకపు సింహాసనమున శునకమును కూర్చుండ బెట్టిన వెనుకటి గుణము మానదు' అన్నట్లుగా– ఏదైనా మనం చేస్తున్నామంటే అది మన అదృష్టం, భగవంతుని అనుగ్రహం అనుకోవాలి. అందుకు వినయం ఉండాలి. భక్తి ఉండాలి. ఇవి లేకుండా చేస్తే ఉపయోగం లేదు. ఇలా స్వాధ్యాయము చేసుకునే వాడికి తనయందు, అందరి యందు భగవద్దర్శనం చేసుకోవటానికి ఒక ప్రయత్నం. దానినే ఈశ్వర ప్రణిధానం అంటారు.

*'విశ్వం విష్ణుః వషట్కారః'* అనే మూడు మూడు పేర్ల చొప్పున ఇటుకలు పేర్చాలి. స్వాధ్యాయం రెండు రకాలు అంటే రెండు ఇటుకలు. సత్పురుషులు వ్రాసిన భారత, భాగవత, రామాయణ గ్రంథాలు, ఉపనిషత్తులు శ్రద్ధతో నిరంతరం చదువుకోవాలి. అప్పుడు తెలిసే విషయాలు వేరుగా ఉంటాయి. అప్పుడు చేసే బోధలు వేరుగా ఉంటాయి. అవగాహన వేరుగా ఉంటుంది. స్వాధ్యాయంలో రెండవది నిన్ను గురించిన అధ్యయనం కూడా ఉండాలి. నీ దినచర్యలో మనోభావాలు, ఇంద్రియ పటుత్వం, నీ శరీరం దేనికి ఉపయోగపడుతున్నాయో తెలుసు

కోవాలి. లోపల, బైట ఉన్నది దైవమే అన్న భావనను ఒక ప్రయోగంగా అమలుపరచాలి. “May the light in me, be the light before me” అన్న మాటలు చిలుక పలుకులు కాకుండా చూసుకోవాలి. అప్పుడు హృదయంలో ప్రవేశించటానికి అవకాశ ముంటుంది. గురువు అందించిన సన్మార్గంలో సాధన చేయగలడు అని యముడు నచికేతునితో చెబుతున్నాడు. యమములు చాలా ఉన్నాయి. యమ నియమాలను పాటిస్తేనే ద్వారాలు తెరుచు కుంటాయి. మూడు ద్వారాలు దాటి నాల్గవ ద్వారం తెరుచుకుంటే ఆ లోపల గుహలో ఏం కనిపిస్తుందో! లోపల దర్శనం చేయాలి. అంతవరకూ దర్శనం చేయడానికి అవకాశం లేదు. సూదిబెజ్జం నుంచి జీవుడొక్కడే వెళ్ళగలిగేలా ఆ ద్వారం ఉంటుంది. హృదయ గుహ చేరడానికి మన పెద్దలు రకరకాల మార్గాలు ఇచ్చారు. ఎవరికి నచ్చిన మార్గంలో వారు వెళ్ళవచ్చు. వీటన్నిటికీ ప్రాతిపదిక స్వాధ్యాయమే. దానికి ద్వాదశాక్షర మంత్రముంది.

నచికేతుడు మూడవ వరం మరణం గురించి ఇలా అడిగాడు. **“అసలు నీవు మరణానికి అధి దేవతవు కదా! ఈ మరణించినవాడు ఉంటాడా, ఉండడా? ఉంటే ఏమవుతుంది? వాడికి ఏం జరుగుతుంది? వాడు మాటి మాటికీ మరణించకుండా ఏం చేయాలి?”** అని అడుగుతాడు. దానికి యముడు ఒక పట్టాన

సమాధానం చెప్పడు. ఇంకా నీకు అది ఇస్తాను, ఇది ఇస్తాను తీసుకో అంటాడు. రకరకాలుగ ఆశ పెడతాడు. కాని నచికేతుడు 'అవన్నీ నాకు వద్దు' అంటాడు.

పరమగురువులు అందరూ ఏమంటారంటే మరణం గురించే నేర్పు, ఇక మిగతావి ఏవీ నేర్పక్కరలేదు అని చెబుతారు. అది నేర్పితే మిగతావన్నీ వాడే నేర్చుకుంటాడు. 'అది నేర్పగలిగిన వాడే సద్గురువు'. అందుచేత యముడు ఎన్ని ఆశలు చూపినా నచికేతుడు ఒప్పుకోడు. వాళ్ళిద్దరి సంవాదం బాగుంటుంది.

తరువాత యముడు ఆ రహస్యం చెబుతాడు. యముడు రెండవ వరం ఇచ్చిన తరువాత నచికేతుడి యొక్క శ్రద్ధకు ముచ్చట పడి, అతనిలో అప్పటికే పవిత్రత ఉన్నదని గమనించి, యముడు చిట్టచివరికి మరణ రహస్యం కూడ చెబుతాడు.

అది తెలిసినట్టే ఉంటుంది కాని తెలియదు. మామిడిపండు గూర్చి రాసిన వ్యాఖ్యలు వేరు, తిన్నవాడి అనుభూతి వేరు. ఎంతో తెలిసినా ఉపయోగం లేదు. అందు కొంత ఆచరిస్తే, ఆ తరువాత ఆచరించవలసిన దానికి నీవు సంసిద్ధుడవుతావు. ఆచరించక కేవలం వింటే పురాణ కాలక్షేపం అలవాటు అవుతుంది. వినటం మారడం కోసమే కదా! ఏమీ మారకుండా ఎంత వింటే ఏం లాభం? అలా మారటానికి సంసిద్ధత ఉంటే శ్రద్ధ వున్నదనే అర్థం.

తెలిసినదానిని ఎంత శ్రద్ధగా ఆచరిస్తే అంత పవిత్రత పెరుగుతుంది. కఠోపనిషత్తు శ్రద్ధతోనే మొదలవుతుంది. ఈ ఉపాఖ్యానము మనలో సిద్ధంచడానికి ప్రధానమైనది, ప్రాథమికమైనది గణపతి పూజ.

**గణపతి పూజ ప్రాముఖ్యత :**

గణపతి లౌకిక విద్యలకు, అలౌకిక విద్యలకు అధిపతియైన ప్రధాన దేవత. అతడు మూలాధారములో ఉపస్థితుడై ఉంటాడు. 'త్వం మూలాధార స్థితోసి నిత్యం'– మూలాధారమైన గణపతి కారణంగా మనం దేహమునందు నిలిచి ఉన్నాము. జీవుడు దేహము నందు వసించలేడు. దేహమునందు వసించటానికి, దేహమునందు సుఖంగా ఉండాలి. ఈ భావన ప్రతిజీవికీ ఉంటుంది. దేహమునందు స్థిరంగా, సుఖంగా ఉండాలనుకొనే వారందరూ గణపతి ప్రార్థన చేసుకోవాలి. దేహమునందు సుఖము లేనప్పుడు మనసునందు సుఖము ఉండదు కూడా. దేహములో సుఖమున్నా లేకపోయినా, మనస్సు స్థిరంగా ఉండటమనేది యోగసిద్ధి ఉన్నవారికే సాధ్యం. ఇతరులకు సాధ్యం కాదు. ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి జీవుడు దేహాన్ని ధరించాడో, ఆ ప్రయోజనం నిర్వర్తింపబడేవరకు కూడ దేహం పదిలంగా ఉండాలంటే గణపతి కావాలి. అందుచేతనే 'అవిఘ్న మటంచు ధూర్జటి

నందన నీకు మ్రొక్కెదన్, ఫలితము నీయవయ్యా' అన్నారు. గణపతి అనుగ్రహము చాలా సులభంగా లభిస్తుంది. అలా సులభంగా అనుగ్రహించే దేవతలు నలుగురు ఉన్నారు. అందులో గణపతి మూలాధారంలో నాలుగు దళములలో పశ్చిమ దళమందు ఉపస్థితుడై ఉంటాడు. 'అవ పశ్చాత్తాత్' అక్కడి నుండే మొత్తం శరీరమంతా వ్యాపించగలడు. అందుకనే మూలాధారంలో గణపతిని పెట్టినట్లు, నైఋతిభాగం బరువుగా ఉంటే బాగుంటుం దని వాస్తు శాస్త్రము చెబుతూ ఉంటుంది. ఆ బరువును గణపతి ఇస్తాడు. అతడు దేహమునందు దేహప్రజ్ఞ ఇస్తాడు. అతడు యోగ విద్యయందు సిద్ధుడు. అందుచేత యోగవిద్యయందు సిద్ధిని ఇస్తాడు. లౌకిక విద్యలలో విఘ్నాలు తొలగిస్తాడు. అలౌకిక విద్యలకు కూడా ఆయనే గురువు.

ఏ సత్కార్యమును సంకల్పించినా, దానిని నిర్వర్తించటానికి గణపతి అనుగ్రహం కావాలి. గణపతి మొదట దేహము యొక్క సౌకర్యమును ఇచ్చి, రెండవది- చేస్తున్న పనులకు విఘ్నము కలుగకుండా సరియైన ఆలోచన ఇస్తాడు. సకాలములో, సరియైన సంకల్పం కలిగితే అది సవ్యంగా నడిచి వెళ్ళిపోతుంది. సంకల్పం మంచిదైనా కాలం కలిసిరాకపోతే ఏమీ జరుగదు. అస్తవ్యస్తం అవుతుంది. అందుకే పెద్దలు గణపతి లఘుపూజ నిర్దేశించారు. పదహారు నామాలతో గణపతిని పూజించవచ్చు.

'గం' అనే శబ్దం గణపతి బీజమంత్రం. 'గం' శబ్దాన్ని అన్ని దళముల మీద ఆపాదిస్తూ, అనాహత పద్మము కర్ణికలో ప్రవేశించే విధానము ఒకటి గణపతి ఆరాధకులు తెలుపుతారు. ఆ విషయం మరికొంచెం వివరముగా తర్వాత తెలుపుతాను.

దేహమందు స్థిరముగను, సుఖముగను ఉండటానికి గణపతి ఆరాధన ముఖ్యం. సర్వతో అభివృద్ధికి గణపతి ఆరాధన, సకల విద్యల సిద్ధికి గణపతి ఆరాధన, జీవన పరిపుష్టికి గణపతి ఆరాధన. అంతేకాక, అన్నిటికన్న ముఖ్యమగు విశిష్ట దేహప్రాప్తికి, దేహము నుండి విముక్తికి కూడ గణపతి ఆరాధన మహారాష్ట్రలో ప్రాచుర్యంలో వుంది. గణపతి సర్వదేవతా స్వరూపుడు. సర్వము నకు అతీతుడు. యోగవిద్యయందు మరియు సర్వ సిద్ధి యందు గణపతి అవశ్యకత మెండు.

నచికేతుడు తండ్రి వాక్ ప్రభావం వల్ల వెళ్ళాడని కొందరు వ్యాఖ్యానాలు వ్రాశారు. నచికేతుడి తండ్రికి వాక్ ప్రభావం ఉండే అవకాశం తక్కువ. ఎందుకంటే అతడు స్వర్గం ఆశించి దానం చేస్తున్నాడు. యముడి నుండి ఈ విద్యను మనకివ్వటానికే నచికేతుడు దిగివచ్చా డంటారు. నచికేతుడు స్వయంగా సిద్ధుడు అయివుండటం చేత తండ్రికోసం అలా యమలోకం స్వచ్ఛందంగా వెళ్ళిపోయాడు.

# 6. దర్శన జ్ఞానము

**ఇం**తవరకు చెప్పుకున్నదానిని ఒకసారి పునశ్చరణ చేసుకుని విషయంలోకి ప్రవేశిద్దాం...

నచికేతుడు యముని అడిగిన రెండవ వరానికి సమాధానంగా యమదేవుడు నచికేతాగ్నిని, ఆ అగ్ని ఆరాధనకు ఇటుకలను ఎన్నింటిని, ఎలా పేర్చుకోవాలి, అగ్నిని ఎన్నిసార్లు ఆరాధించాలి అని తెలుపుతూ ఆ అగ్ని ఆరాధనలో భాగంగా మూడురకాల విధులు, మూడు విధాలుగా చేయటాన్ని గురించి తెలుపడం జరిగింది. ఇలా నిర్వర్తించుకొనే వారు మొదటి మూడు పొరలను దాటి నాల్గవ పొరవరకూ ఎలా చేరుతారో వివరించటం జరిగింది.

అగ్ని ఆరాధనకు మాతృ ఋణము, పితృ ఋణము, గురువు ఋణము, దేవ ఋణము, కుటుంబ ఋణము, సమాజ ఋణము, వృత్తిపరమైన ఋణము తీర్చుకోవాలి. తమలో జరుగుతున్న సాధనకు ప్రమాణంగా ఆచరణ, దేహసౌకర్యాలను, కామవాంఛను దాటటం– ఇలా దాటటం చేత, మొదటి మూడు దళములతో కలిసినటువంటి హృదయము యొక్క పొరను దాటి రెండవపొరలో

తండ్రి, తల్లి, సోదరీమణి, భార్య ఆశించినవి నిర్వర్తించుకోవటం. అలాగే గురువు కొన్ని ఆశయాలతో కొన్ని కార్యక్రమాలను ప్రారంభించినప్పుడు, వాటిని పరిపూర్తి గావించడం. ఇలా చేసినప్పుడు తనలోని భయము, అనుమానము తొలగుతాయి. మూడవదైన కోపము దూరం కావటం కూడా జరుగుతుంది. మనలో మరికొంత పరిణత సంభవిస్తుంది. ఆ పైన విశేష కార్యక్రమములను చేసి, వారు ఏ లోకంలో ఉన్నా సరే తల్లిదండ్రులు, వారి తల్లిదండ్రులు, వారి తల్లిదండ్రులు మనలను ఆశీర్వదించినప్పుడు మూడవ పొర కూడా దాటటం. అలాగే గురువు గారు, ఆ గురువు గారి గురువుగారు, ఆ గురువుగారి గురువుగారు– ఇలా గురువు, పరమగురువు, పరమేష్ఠి గురువుగారి దృష్టి సాధకుల మీద పడుతుంది. గురువును ఆశ్రయించి హృదయంలో ధ్యానం చేయి అంటే అసలు హృదయం ఎక్కడుంది? కొట్టుకునేది గుండె. ఆ గుండె కూడా హృదయం ఆధారంగానే కొట్టుకుంటుంది. మన శరీరంలో గుండె ఎడమప్రక్కన ఉంటే, హృదయ స్పందన సరిగ్గా మధ్యలో ఉంటుంది. ఈ స్పందన కారణంగానే గుండె పనిచేస్తుంది కానీ గుండె వలన స్పందన ముండదు.

అలాంటి స్పందన లభించాలంటే మూడు పొరలలో ఉన్న 3, 3, 3 దళములు చొప్పున 9 దళములు విచ్చుకుంటాయి. అటుపైన నాలుగవ పొర. అక్కడికి వెడితే హృదయ గుహలోనికి వెళ్ళగలుగుతాం.

అందుచేత ప్రతి నిత్యం తనను గూర్చి బాగా ఆత్మవిచారం చేయాలి. చేస్తే మనలో ఉండే మాలిన్యాలన్నీ నిష్కర్షగా కనిపిస్తాయి. ఎందుకంటే మన గురించి మనకే బాగా తెలుసు కదా! మన లోపల ఆశ ఉందా? భయముందా? ఎవరి మీదైనా అనుమానా లున్నాయా? కోపముందా? వాంఛలు, కామవాంఛలు ఉన్నాయా? అసూయ ఉందా? ఎదుటివాడి లోపములను గురించి చర్చ లున్నాయా? ఇలాంటి ఇటుకలన్నీ పేర్చుకొని అగ్ని ఆరాధన చేయాలి. అలాకాక బయట ఇటుకలు ఏర్పరచుకొని నెయ్యిపోస్తే అది కేవలం డంబాచారం.

నీ ప్రవర్తన బట్టే అగ్ని నీకు సహకరిస్తాడు. అపవిత్రుని పవిత్రుని చేస్తాడు. పవిత్రత కావాలన్న ఉద్దేశం నీలో ఉండాలి. నేను ఈ రోజు నుండి త్రికరణశుద్ధిగా పవిత్రతకోసం ప్రయత్నం చేస్తాను అన్న కృతనిశ్చయం ఉండాలి. మనస్సు, వాక్కు, శరీరంతో చేసే పనులు– మూడు తిన్నగా ఉన్నవా లేదా చూడాలి. తిన్నగా ఉన్నవారిని ఎవరూ ముట్టుకోలేరు కదా! లేకపోతేనే ఇబ్బంది. మరి ఇవన్నీ చేసుకొని అగ్ని ఆరాధన చేయాలని యముడు అంటాడు. యముడు యమనియమాలు చెబుతాడు. 'ఇటుక' అంటే గురువు ఇచ్చే శబ్దము అని కూడా అర్థముంది. ఆ ఇటుకలు జాగ్రత్తగా పెట్టుకోవాలి. షిర్డీ సాయి చరిత్రలో ఇటుక ఆయనకు తలగడగా ఉంటుంది. ఆ ఇటుక పగులగానే మనం ఈ శరీరంలో ఉండనక్కరలేదు. 'ఇష్టికం' అంటే గురువు అందించే మంత్రం.

మాస్టర్ సి.వి.వి.గారు రెండుసార్లు ప్రేయరు చేయండిరా అన్నారు. మనం అవన్నీ చేయలేము కదా! మనకు ఆశ లేదా, భయం లేదా, కోపం లేదా, అనుమానం లేదా, అసూయ లేదా, దురభిప్రాయం లేదా, అహంకారం లేదా– ఇవన్నీ ఉన్నప్పుడు ఆ ప్రేయరు ఎందుకులే అని ఆయనే మాన్పించేస్తాడు. ప్రేయరు చేయకుండా చేసినట్లు, శివ పూజ చేయకుండా విభూతి పూసుకున్నా అది రెండు, మూడు రోజుల్లో తెలిసిపోతుంది. అంటే దినచర్యలో సహజంగా కనిపిస్తుంది.

*పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ హా*
*స నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత*
*శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతస్వాద సం*
*ధానుండై మరచెన్ సురారిసుతుడే తద్విశ్వమున్.*

ఏం చేస్తున్నా అది గుర్తున్నవాడు ఉంటాడు. అది గుర్తులేక సమయానికి తట్టుకొనే వాడుంటాడు. మనం ఏదో చేస్తామంటే అది కుదరదు. Mind is a manager అంటే manipulator అని అర్థం. ఏదైనా నేను manage చేస్తానని అంటే, అది Manipulation. When you manipulate, work might have happened, but you are manipulated. నీవు పాడైపోయి అది బాగుపడితే సంతోషించే వాడు సద్గురువు కాడు. దుఃఖపడతాడు. అసత్యభాషణలచే పనులు కానిస్తే సంతోషించడు. సద్గురువుకు పనులు అయిపోవడం

ముఖ్యం కాదు. నీ పని కావాలి. ఏదైనా పని చెబితే దాని ద్వారా నిన్ను బాగుచేయడానికే తప్ప ఆయనకు పని ఏమిటి? “నేను ఈ మూడు లోకాలలో ఏ పనీ లేనివాడిని, నన్ను ఎవరూ ఏ పనీ చేయమని అడగటానికి వీలులేదు. నేను ఎవరికీ బాకీ లేను” అన్నాడు శ్రీకృష్ణుడు.

మన బాకీలు వసూలు చేయడానికి మనతో పనులు చేయిస్తాడు. సద్గురువుకు నీవు కావాలి కాని, పనియొక్క పరిణామాలు అక్కరలేదు. అతడు నీ యోగక్షేమం చూస్తాడు తప్ప, బాగా అబద్ధాలు ఆడి, అడ్డగోలుగా బాగా సంపాదించి, తనకు తెచ్చిస్తాడని ఆశించడు. మనం ఇచ్చినా తీసుకోడు. సద్గురువు ఒక యజ్ఞార్థం చేసే కార్యాలకు ఒనరులు కూడా యజ్ఞార్థమే. పదిమంది దగ్గర చేయిచాచి, అడిగి చేయటం ఆయనకు ఇష్టం ఉండదు. బయటి మెప్పు కాదు, లోకేశ్వరుడి లోపలి మెప్పు కావాలి. నీవు ప్రపంచం నుంచి ఆశించి చేయకూడదు. ప్రపంచం యొక్క విమర్శ మనకు వద్దు. మనం చేసిన మంచి పనికి, చెడ్డ పనికి రికార్డ్ ఉంటుంది. దానినే ‘ఆకాశిక్ రికార్డ్’ అంటారు. ఆ లేఖకులందరికీ అధికారి చిత్రగుప్తుడు. చాలా చిత్రంగా, గుప్తంగా అకౌంట్ అవుతుంది. అక్కడ మంచిపనికి, చెడ్డపనికి కూడా అకౌంట్ ఉంటుంది.

మాస్టర్ ఇ.కె. గారు ఎప్పుడూ “bring your instrument to

'0' error on daily basis" అనేవారు. అలా నెమరువేసుకొని ఎక్కడ చచ్చులు, పుచ్చులు వున్నాయో చూసుకొని మరునాడు మరికొంత కృతనిశ్చయముతో అడుగుపెట్టాలి. ఈ ప్రపంచమనే ప్రయోగ శాలలో నా ప్రవర్తన ఎలావుంది? మన ప్రవర్తన ఉత్తరోత్తర లోకా లకు తీసుకెళ్ళేదిగా ఉంటుంది. కొన్ని జీవితాలు 'ఎక్కడ వేసిన గొంగళి' అన్నట్లుగా వుంటుంది. పుట్టినప్పుడు ఏ స్వభావంతో పుట్టాడో, చనిపోయేటప్పుడు కూడా అదే స్వభావం ఉంటుంది. కాని నీలో తపన ఉంటే సద్గురువు తన బలాన్ని ఇస్తాడు. తపన లేకపోతే ఇవ్వడు. అతడు అగ్ని స్వరూపుడు. తపన చెందేవాడికి సహకారం తప్ప, తన గురించి తానే చెప్పుకొని, తానే వ్రాసుకొనే వాడికి, తనను తానే ప్రచారం చేసుకొనేవాడికి ఉండదు. ప్రతి నిత్యం "మాస్టారూ! నాకేమీ అవలేదు. మీరు ఆశించిన దాంట్లో అణుమాత్రం కూడా. నేనేమీ చేయలేక పోయాను. నన్ను మీరే బాగుచేసుకోండి" అని చెప్పుకోవాలి. ఆత్మచింతన, ఆత్మవిమర్శ కావాలి. కాని మనలను మనం మోసం చేసుకోకూడదు.

ఆత్మ ఉన్నతికోసం అధ్యయనం చేయాలి. శాశ్వతంగా మార్గదర్శకులుగా నిలబడిన వాళ్ళందరూ ఎలా చేశారో చదవటం వలన స్ఫూర్తి వస్తుంది. అందుకనే చదువుకొని, వ్రాసుకొని, అందులో మనకు పనికొచ్చేవి ఏవైనా ఉంటే ఆచరించడానికి ప్రయత్నం చేస్తే అది స్వాధ్యయనం. ఈ స్వాధ్యయనం రెండు

రకాలు. విమర్శ, ఆత్మవిమర్శ. ఈ ఆత్మవిమర్శ ద్వారా నాల్గవ పొర క్రమంగా కొంచెం పలుచన అవుతూ ఉంటుంది. అందుకే 'హృదయ స్పందనను గమనించు' అన్నాడు. అది శాస్త్రంలోను, భాగవతంలోను, భగవద్గీతలోను, యోగశాస్త్రంలోనూ 'ప్రాణాయామం' పేరిట ఉంది. హృదయ స్పందన అన్ని చోట్ల ఉంటుంది. ఒకసారి గట్టిగా శ్వాస పీలిస్తే చాలు, స్పందన ప్రస్ఫుటంగా తెలుస్తుంది. ఆ స్పందనకు దగ్గరగా ఉండాలి.

**మూడు సార్లు గట్టిగా శ్వాసపీల్చి, వదలి కొంత విరామం యిస్తే విరామంలో స్పందన తెలుస్తుంది. 3 సార్లు శ్వాస పీల్చి, వదలి, విరామం ఇస్తే ఆ విరామంలో స్పందన, హృదయం మధ్యలో ఒక శబ్దంతో వినిపిస్తుంది. అదే సోహం.** ఇది మనం అనటం కాదు, వినటం. అలా వింటూ ఉంటే మనసుకు ప్రశాంతత, సుఖము లభిస్తుంది. దానియందు అనురక్తి పెరుగుతుంది. ఎంత సేపు చేయాలి? స్పందన ప్రజ్ఞ కూడి వున్నపుడు శ్వాస తీసుకుందా మని కూడా అనిపించదు. అలా సాధన పెరిగితే ఒకసారి 'ఓం' అని ఉచ్చరిస్తేనే వినిపిస్తుంది. ఆ స్పందన వినబడనట్టుగా, ఆగిపోయినట్టుగా ఉంటే ఒకసారి శ్వాస పీల్చుకోవాలి. అలా ఆ స్పందనను ఎంతసేపు వినగలవో చూడు. అప్పుడేం జరుగు తుందంటే ఉచ్ఛ్వాస, నిశ్వాస యొక్క కార్యకలాపాలు తక్కువై స్పందనను వినే కార్యక్రమము పెరుగుతుంది. అప్పుడు ఖచ్చితంగా

ఇరవై నాలుగు నిముషాలకు తక్కువ కాకుండా సాగుతూ ఉంటుంది. అలా మూడుసార్లు జరుగుతుంది. దీనినే పరమ గురువు జ్వాల్‌కూల్ మహర్షి తూర్పు దేశాల వాళ్ళు మూడు సార్లు, పశ్చిమదేశాల వాళ్ళు ఐదు సార్లు చేసుకోవాలి అన్నారు. అందుకనే వాళ్ళు ఐదు సార్లు 'నమాజ్' చేస్తుంటారు. అలా చేస్తుంటే క్రమక్రమంగా ఆ స్పందన చిట్టచివరి ద్వారాన్ని తట్టు తున్నట్లుగా వుంటుంది. ఈ స్పందననే మన వాళ్ళు 'హంస', 'గరుత్మంతుడు', 'చిలుక' అంటారు. ఈ చిలుక, గరుత్మంతుడు, హంస 'సోహం' అనే శబ్దాన్ని నిత్యగానం చేస్తుంటాయి. దీనికోసం 'హంసగాయత్రి' తయారుచేశారు.

**శ్వాసను పీల్చడం, వదలడం, స్పందనను వినడం. ఇది ఒక దీక్షగా సాగాలి.** స్పందన వినపడటం ఆగితే మరల శ్వాస పీల్చి, వదలాలి. ఇలా సాగాలి ప్రాణాయామ సాధన. అలా రోజుకు మూడుసార్లు ఒకే నిర్ణీత సమయంలో సాగాలి. ఒక ప్రయత్నానికి, మరొక ప్రయత్నానికి నడుమ విరామం సమంగా ఉండాలి. అలా ప్రతి ప్రయత్నంలోను 24 శ్వాసల వరకు స్పందనలు విని, చేరివుండే ప్రయత్నం చేయాలి. అలా రోజుకు మూడుసార్లు చేయాలి. క్రమంగా 24 శ్వాసల నుండి 48 శ్వాసలకు ప్రయత్నం పెంచుకోవాలి. 72 శ్వాసల వరకు కూడ పెంచుకోవచ్చు ప్రతి ప్రయత్నాన్ని.

'స్పిరిచ్యువల్ అస్ట్రాలజీ' గ్రంథంలో మాస్టర్ ఇ.కె. గారు 72 సార్లు చేయాలన్నారు. 3 × 72 = 216 శ్వాసల వరకు స్పందన వింటూ ఉంటే నీ మనసు మారుతుంది. మనసు నెమ్మదిగా విజ్ఞానమయ కోశంలో కరగి, ఆనందమయ కోశంలో ప్రవేశించటానికి ఆతురత పడుతూ ఉంటుంది. చాలామంది ప్రాణాయామము చేస్తుంటారు. కాని **ప్రాణాయామము చేసేది కాదు, జరిగేది. శ్వాసపీల్చి, వదలి జరిగేదానిని గమనించడం ప్రాణాయామము. శ్వాసపీల్చి వదలిన తరువాత జరిగే స్పందనను గమనించుట ప్రాణాయామము అంటారు. యమింపబడిన ప్రాణమంటే 'Prana regulated' అని అర్థం**. అలా జరుగుతున్న దాన్ని గమనించుకుంటూ పోతే మనసు ఒక వెలుగు వలయము దగ్గర ఉంటుంది. ఆ వలయము దగ్గర ఉన్నప్పుడు చాలా ప్రశాంతంగా ఉంటుంది. అంతకన్న లోపలికి వెళ్ళటం యోగం. ఈ స్పందన సూక్ష్మ స్పందన అయి లోపలికి వెళ్తుంది. అక్కడి నుంచి నీకు ఊర్ధ్వగతి ఉంటుంది.

# 7. దర్శన జ్ఞానము - 2

**భ**గవద్గీత కర్మయోగంలో కర్మ నిర్వహణ, సాంఖ్య యోగంలో విచక్షణతో జీవితంలో చేయవలసినవి, చేయదలచినవి, అశాశ్వతమైనవి, శాశ్వతమైనవి మొదలగునవి తెలుస్తాయి. మూడవ అధ్యాయంలో నీకోసం బ్రతకకుండా లోకహితంకోసం బ్రతకాలి అని తెలుస్తుంది. దానివలన నీలో చాలా మార్పు వస్తుంది. అప్పుడు నీ దగ్గరకు చాలా ఒనరులు వస్తాయి. ఇప్పటికే నీ దగ్గర చాలా ఒనరులున్నాయి. శరీరము, ఇంద్రియాలు, మనస్సు వీటన్నిటినీ ఇతరులకోసమే వినియోగించాలి.

ఆ తరువాత యజ్ఞాలు పన్నెండు ఉన్నాయి. 1. అన్న యజ్ఞము, 2. ప్రాణాయామ యజ్ఞము, 3. ద్రవ్య యజ్ఞము, 4. ఇంద్రియ యజ్ఞము, 5. విషయ పరిత్యాగ యజ్ఞము, 6. మనో యజ్ఞము, 7. స్వాధ్యాయ యజ్ఞము, 8. జ్ఞాన యజ్ఞము, 9. దైవ యజ్ఞము, 10. తపో యజ్ఞము. 11. యోగ యజ్ఞము, 12. బ్రహ్మ యజ్ఞము. యజ్ఞార్థం అంటే లోకహితం కోసం నీ దగ్గర ఉండే ఒనరులను వాడటమే. ఇష్టాయిష్టాలు దాటి 'న కాంక్షతి,

న ద్వేష్టి' అన్నట్లు ఒకరకమైన సన్యాసంలో వుంటావు. అటుపైన ఆత్మ సంయమ యోగంలో శ్వాసద్వారా లోపలికి వెళ్ళి జ్యోతి దర్శనం చేయాలని చెబుతారు. పతంజలి మహర్షి కూడా యమ, నియమ, ఆసన, ప్రాణాయామము అనే నాలుగు- సాంఖ్య, కర్మ, జ్ఞాన, సన్న్యాసయోగం అన్నీ ఒకటిగా ఉంటాయి. పతంజలి అహింస, సత్యం, బ్రహ్మచర్యం, ఆస్తేయం, అపరిగ్రహం, శుచి, శౌచము, సంతోషం, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అని చెప్పారు.

ఇలా ఆరాధన చేస్తూ ఉంటే లోపల మనస్సుకు, శ్వాసకు సంధి జరిగి, అగ్ని ప్రజ్వలింపబడి ప్రజ్ఞ ఊర్ధ్వముఖమై హృదయం దగ్గర కేంద్రీకృత మవుతుంది. మొదటిపొర దాటితే మూలాధారం దాటినట్లు, రెండవ పొర దాటితే స్వాధిష్ఠానం దాటినట్లు, మూడవ పొర దాటితే మణిపూరకం దాటినట్లు, నాల్గవ పొర దగ్గర ఉంటే హృదయం దగ్గర ఉన్నట్లు, ఐదవ పొర హృదయంలో చేరినట్లే. ఆ స్పందనకు గురువు అనుగ్రహం చేత చాలా బలం తోడవుతుంది. నీవు చేసే సత్కార్యానికి గాని, సత్సంకల్ప నిర్వహణకు గాని, నీ కర్తవ్య నిర్వహణలో వీటన్నిటిలో నీ చేతికి, తన అదృశ్యహస్తం తోడై కార్యక్రమాలన్నీ అయిపోతూ ఉంటాయి. అవి, ఇవి అనుకోకుండా అన్నీ చేసిపెడతాడు. ఆ అదృశ్య హస్తం

ఎప్పుడూ నీతో ఉంటుంది. నీవు అలా సాధన చేసుకుంటూ వెళ్తే నీలో రుచి పెరిగి సాధన సమయం పెంచుకుంటావు.

సి.వి.వి. గారు ఉదయం, సాయంత్రం ప్రార్థనతో బాటు, మూడవదిగా మెరీడియన్ ప్రార్థన కూడా చేయమన్నారు. దానికి ఇంకో పద్ధతి కూడా ఉంది. తెల్లవారుజామున నాలుగింటికి, మధ్యాహ్నం పన్నెండింటికి, రాత్రి ఎనిమిది గంటలకు చేయవచ్చు. మనకున్న పరిస్థితులలో బండివాని జీవిక చెడకూడదు కదా! అందుకే ఉదయం, సాయంత్రం ప్రార్థన. రాత్రి పడుకోబోయే అరగంట ముందు ప్రార్థన చేసి పడుకుంటే అది నిద్రలో కూడా జరుగుతుంది. అలా మూడు సార్లుగా 24 నిముషాలు చేస్తే- 72 నిముషాలపాటు చేయవచ్చు. ఎప్పుడో ఈక్వినాక్స్‌కో లేదా సొలిస్టిస్‌కో కాదు, రోజూ చేస్తేనే అది నచికేతవిద్య.

ఇంకో రకం ఏమిటంటే 'క' నుండి 'ఠ' వరకూ పన్నెండు అక్షరాలు పన్నెండు దళాలు. కఠ ఉపనిషత్తు అంటే ద్వాదశ దళ పద్మములకు సంబంధించిన సాధనపరమైన ఉపనిషత్తు.

క, ఖ, గ, ఘ, ఙ ; చ, ఛ, జ, ఝ, ఞ; ట, ఠ - 12 అక్షరాలు. 'క' నుండి 'ఠ' వరకు గల 12 అక్షరముల విద్య కఠ విద్య. ఈ 12 అక్షరములు 12 దళములుగా, 4 అరలలో ఏర్పడి వున్నాయి. ఆ దళములు ఆ శబ్దములతో ఏర్పడి వున్నాయి. అదియే

అనాహత పద్మము - హృదయ పద్మము. ఇందు 'క' శబ్దము మొదటి హల్లు. అది పద్మమందలి చివరి దళము. మొదటి దళ శబ్దము 'ఠ'. 'ఠ' నుండి 'క' వరకు పొరలో పొరగా, కోశములో కోశముగా నాలుగు కోశములతో నాలుగవది అయిన అనాహత పద్మమున్నది.

మొదటి పొర మూడు దళములు - ఠ, ట, ఞ.

రెండవ పొర మూడు దళములు - ఝ, జ, ఛ.

మూడవ పొర మూడు దళములు - చ, ఙ, ఘ

నాలుగవ పొర మూడు దళములు - గ, ఖ, క.

నాలుగవ పొరలోని మూడు దళములు హృదయాకాశము నకు ద్వారములు. దానినే దహరాకాశ మంటారు. ఆకాశ శబ్దము 'ఖం'. 'ఖం'కు సరళములే క, గ లు. వానితో ఏర్పడిన 'కృష్ణ' శబ్దముగాని, 'గణపతి' శబ్దముగాని మనలను సులభముగా ఆకాశమును చేర్చగలవు.

అనాహతము వాయు ప్రధాన కేంద్రము. వాయువు నాలుగవ భూతము (పృథివి, జలము, అగ్ని, వాయువు). యిందలి చివరి కోశము (నాలుగవ కోశము లేక పొర) 5వ భూతమగు ఆకాశానికి ప్రజ్ఞను చేర్చగలదు. విశుద్ధి మనలో ఆకాశ కేంద్రము.

"ఓం నమో భగవతే వాసుదేవాయ" అను ద్వాదశాక్షరీ మంత్రము కూడ ఈ విధంగానే వినియోగపడుతుంది. కాకపోతే వెనుక నుండి ముందుకు అక్షరాలు పద్మదళములపై ఆరోపించు కొని అనుసంధానం చేసుకోవాలి. ఆ విధంగా దర్శించాలి.

| | | |
|---|---|---|
| దేవాయ | – | మొదటి పొర |
| తేవాసు | – | రెండవ పొర |
| భగవ | – | మూడవ పొర |
| ఓం నమో | – | నాలుగవ పొర |

యిలా పై పొర నుండి లో పొరకు, లో పొర నుండి మూడవ పొరలోనికి, మూడు నుండి నాలుగవ పొరలోనికి పయనిస్తూ ఓంకారములో, నాలుగవ పొర కర్ణిక నుండి లోపలి ఆకాశంలోనికి పయనించాలి. అలా చేరుకుంటే అక్కడి నుండి ఊర్ధ్వముఖ ప్రయాణమే వుంటుంది. అవన్నీ నీలో వికసిస్తే నీవు కూడా అక్షరుడవుతావు. అవి ముదురుకొని ఉంటే నీవు క్షరుడవే. దీనినే మన పెద్దలు 'అక్షరవిద్య' అన్నారు.

ఈ అక్షరవిద్యను హృదయకేంద్రం వరకు పన్నెండు అక్షరాలలో చివరి మూడక్షరాలు క, ఖ, గ అని చెప్పారు. ఆ తరువాత ఉండేవి అచ్చులు. తెలుగు భాషకు అచ్చులు ప్రాణమైతే

హల్లులు దేహములై వుండటం చేత అచ్చులు పదహారు కళలు అని చెప్పబడ్డాయి. క, ఖ, గ వీటి మధ్య అక్షరం 'ఖం' అనేది. 'ఖం' అంటే ఆకాశం. దానికి సరళమే 'కం'. ఇంకొంచెం సరళమే 'గం'. అందుచేత 'గం' మంత్ర మైనది. ఈ అక్షరాలన్నీ మంత్రాలే. బృహస్పతికి 'ఖం' అనేది మంత్రమైతే, శనికి 'శం' అన్నది మంత్రము. శివుని 'శజ్గాయచ' అంటారు. అంటే యమమును వ్యాప్తి చేయువాడు. శం గం శం ఇవన్నీ ఎక్కడుంటాయి. 'శం' మూలాధారంలో ఉంటుంది. మూలాధారంలో శ ష స హ (4). ఇలా మనలో నిర్మాణంలో ఉండే శబ్దాలు తెలిస్తే చాలా రహస్యాలు తెలుస్తాయి. ఇవి తెలిసేకొద్దీ అన్నీ లోపలినుండి ఎవరో చెప్పినట్టు తెలుస్తుంది. అదే దర్శన జ్ఞానం. లోపల దర్శింపబడుతూ, తెలియబడుతూ వుంటుంది.

హృదయ పద్మానికి మరో అక్షరం 'గం' పట్టుకొంటారు. గం పట్టుకొనే "గం, గం, గం, గం, ఓం" ఇది ఒక మంత్రం. అదొక రహస్యం. "గంగం గంగం ఓం" అనేది శ్వాసలేని సమయంలో స్పందన ఆధారంగా ఒక్కొక్క స్పందనానికి ఒక గం చేరుస్తారు. అంటే నాలుగు 'గం'లలో నాలుగు పొరలు దాటి గమిస్తారు. *'గణానాం త్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనామ్'* అది బ్రహ్మణస్పత అంటే బృహ్మణం చేసేవాడు

బ్రహ్మము. అలా బృహ్మణం చేసేవాళ్ళందరికి అధిపతి (జూపిటర్) గణపతి పూజచేసి "గంగం గంగం ఓం, గంగం గంగం ఓం" అని స్పందన జరుగుతున్న సమయంలో పలకాలట. అలా ఎన్నిసార్లు అంటే 3×4=12 సార్లు. అలా నాలుగుపొరలు దాటి గుహలోకి వెళ్తావు.

గణపతి, గురువు, పెద్దల అనుగ్రహం చేత, నీకు వచ్చిన బలంతో ప్రయత్నం చేస్తుంటావు. స్పందనంలో ఉన్న సమయంలో అలా మూడు సార్లు అంటే ఎన్ని మహత్తర మాత్రలు అయ్యాయి. 'గం' అంటే ఒక మాత్ర, నాలుగు మాత్రలు ఓం అయితే, మరో నాలుగు మాత్రలు ఓం, మరో నాలుగు మాత్రలు ఓం. ఇలా మొత్తం పన్నెండు మాత్రలు పన్నెండు శబ్దాలు స్పందనాలయ్యాయి. ఈ ఓం ముందే కాక చివరలో కూడా చేరుస్తారు. గాలి పీల్చి పదహారు సార్లు లెక్కపెట్టి వదిలేసి, పన్నెండు సార్లు ఆపేసి లెక్కపెట్టాలి. 'గం' అనేది గురుపరంపరగా ఉంటుంది. ఇదే గణేశవిద్యగా అందిస్తారు. అనాహతం చక్రం కాదు కదా! అది పద్మం. అలా మూడు, మూడు, మూడుగా తలక్రిందులుగా ఉంటుంది. ఒక పూవులోనే ఇన్ని మడతలు ఉంటాయి కదా! అది తెలియని వాడికి ఎలా తెలుస్తుంది. ఇవన్నీ శ్రద్ధ గలవాడికే చెప్పాలి. మూడుసార్లు అగ్నిహోత్రం అంటే నీలో నీవు మూడుసార్లు అగ్ని ప్రజ్వలనం చేసి గుహలోకి ప్రవేశిస్తున్నావు.



ధ్రువునికి నారదుడు భాగవతంలో *'ఓం నమో భగవతే వాసుదేవాయ'* అనే మంత్రం చెప్పి, దీనిని ఉపాసిస్తే స్వర్గలోకప్రాప్తి కలుగుతుందని తెలుపుతాడు. ఈ కనబడుతున్నదంతా విష్ణువుగా చూడు. పచ్చని చెట్టు కనిపిస్తే పచ్చనివాడుగా, నీలంగా కనిపిస్తే నీలంగా, సూర్యకాంతిలా ఎర్రగా కనిపిస్తే ఎర్రగా విష్ణువుని చూడు. కాని గురువు అనుగ్రహం ఉంటే మాత్రమే ఇవన్నీ తెలుస్తాయి. చదువుతూ ప్రార్థన చేస్తూ ఉంటే ఎన్నో తెలుస్తాయి.

*'ఓం నమో భగవతే వాసుదేవాయ'* అనే మంత్రం కూడా పన్నెండు దళాలలో వెనుకనుంచి వేసుకుంటూ రావాలి. అలా చివరికి మూడు దళాలు మిగులుతాయి. ఆ మూడు ఏవంటే *'ఓం నమో'* అంటే *'ఓం నమః'* అనే మంత్రం. ఉదయపు ప్రార్థన 'ఓం నమః' తోనే మొదలవుతుంది. 'అక్షర విద్య' అలాంటిది. పిల్లలకు రాయించే ఓనమాలు కూడా ఆచరించి రాయించాలి.

*'ఓం నమః శివాయ'* అని రాయిస్తాము. శివ అంటే శుభంకరము అని అర్థము. అన్ని మంత్రాలకు ముందుగా 'ఓం' ఉంటుంది. 'ఓం నమః' అంటే నేను లేను 'ఓం' ఉంది. నీవు లేకపోతే అది ఉంటుంది.

జొనాథన్ లివింగ్ స్టోన్ వ్రాసిన 'సీ గల్' అన్న పుస్తకంలో ఒక పక్షి తిండి ఎప్పుడూ తినేదే కదా అని ఎగిరి, ఎగిరి, ఎవరూ ఎగరనంత ఎత్తుకు ఎగురుతుంది. ఆ తరువాత ఇక పడిపోతాను అన్నప్పుడు ఇంకో రెండు పక్షులు వచ్చి ధైర్యం చెబుతాయి. వాటితో పాటు ఎగురుతూ ఉంటే మళ్ళీ బంగారు రెక్కలు, బంగారు కాంతి వస్తాయి. "No bird can fly with its own wing. No bird can fly too high with its own wing at one point of time, some divine will join you." అందుచేత *'మహిమ వేరు కలదు మనతోడు ఉన్నదా'* అన్నాడు వేమన. అందుచేత *'ఓం నమః'* అనేది ప్రాతిపదికగా ధ్రువుడు సాధన చేస్తే లోపల ప్రవేశం కలిగి, అక్కడ దర్శన మవుతుంది. అక్కడ జీవలక్షణం బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా దర్శనాలు లభిస్తాయి. అలా లోపలికి వెళ్తే అక్కడ 'అంగుష్ఠమాత్రంలో పురుషుడు' కనిపిస్తాడు. అతడు పూజ్యుడై నీలాగే ఉంటాడట. 'అది నువ్వే'. సాధకుడు యోగంలో స్పందన వరకు వెళ్ళి, సూక్ష్మ స్పందనలోకి ప్రవేశిస్తాడు. దానినే

కృష్ణుడు *"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"*– నీకు ఏమీ తెలియకపోతే నన్ను పట్టుకో, నేను చేసిపెడతాను అన్నాడు.

సద్గురువును ఆశ్రయించి అతను చెప్పినట్లుగా చేయాలి. హృదయపద్మం చేరటానికి అర్హత సంపాదించుకోవాలి. ఎన్నో సార్లు పుట్టాము, తిన్నాము. ప్రకృతికి దగ్గరగా ఉన్నాము. అప్పటి వాళ్ళు శుభ్రమైన వాతావరణం, తాజా కూరలు, స్వచ్ఛమైన నీళ్ళతో జీవితం గడిపారు. ఈనాటి జీవితంలో పాలు, నీళ్ళు, కూరలు అంతా అసహజమే. ఇక అన్నం విషయం

*"బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।*
*బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥"*

అంటే బ్రహ్మభావన చేతనే ఆహారాన్ని పవిత్రీకరించుకోవాలి. అలా బ్రహ్మభావన చేతనే హృదయంలోకి ప్రవేశిస్తే సద్గురు దర్శనం అవుతుంది. ఆయన బయట నీవు చూసే గురువు కాదు. ఆయన మొదటి స్వరూపాన్ని ఆవిష్కరించి వచ్చి కూర్చుంటాడు. ఆసీను డవుతాడు. అప్పటినుంచి సాధన చేయాలి. మూడవ వరం ప్రకారం అక్కడ నీకు రకరకాల దర్శనాలు అవుతాయి. ఇలా జీవించితే ఋణ విముక్తుడై స్వర్గప్రాప్తి కలుగుతుంది.

నచికేతుడు తనకోసం ఏదీ అడగలేదు. మొదటి వరం

తండ్రి కోసం, రెండవ వరం లోకులకోసం అడిగాడు. మూడవ వరం బ్రహ్మమును, బ్రహ్మస్వరూపాన్ని చెంది బ్రహ్మఋషియై జీవించటానికి అడుగుతాడు. మార్కండేయుడు తన జీవితం గురించి, సావిత్రి తన పతి జీవితం గురించి, నచికేతుడు అందరి గురించి అడిగారు. నచికేతుడు యమదేవునితో స్వర్గంలో లాగ కించిత్తు కూడా భయము లేక ఉంటాడు. అక్కడ ఎవరూ భయ పడరు. వారికి ఆకలిదప్పులు రెండూ ఉండవు. వారు శోక రహితులై ఆనందంలో మునిగి ఉంటారు. ఎందుకంటే అది ఆనందమయ కోశం.

ఆనందమయకోశంలో ఉన్నవాడికి చావు భయముండదు. వయస్సు కూడా పెరగదు. శ్రీకృష్ణుడు 126 సంవత్సరాలు బ్రతికి ఉన్నప్పటికీ ఎప్పుడూ 16 ఏళ్ళ కుర్రాడిలా ఉంటాడు. సెయింట్ జెర్మయిన్ కౌంట్ 5 వేల సంవత్సరాలుగా 49 ఏళ్ళ వయస్సు వాడిలాగే ఉంటాడు. పరమగురువు లందరూ వారికి నచ్చిన ఒక వయస్సు, దేహం ఎన్నుకొని అలాగే ఉండిపోతారు. ఎన్ని జన్మలెత్తినా ఏ మార్పు లేక అలా ఉండిపోతారు.

యమధర్మరాజా! స్వర్గంలో జీవించేవారు అమరత్వాన్ని సంతరించుకొంటారు. ఈ హృదయగుహలోకి వెళ్ళేవాడికి మృత్యు వుండదు. అక్కడికి తీసుకుపోగల యాగం నీకు తెలుసు. శ్రద్ధా

వంతుడనైన నాకు ఆ యాగం గురించి తెలియచేయి అని అడిగాడు. దానికి యమధర్మరాజు నచికేతా! స్వర్గానికి తీసుకెళ్ళే యాగం గురించి అడిగావు. సావధానంగా విను. దానిని అందించేది, ప్రపంచానికి ఆధారమైన అగ్ని హృదయగుహలో ఉన్నది కాబట్టి ఆ అగ్నిని నీవు చేరుకుంటే నీకు స్వర్గప్రాప్తి ఉన్నది. అమిత ఆనందం ఉంది. అందులో జీవిస్తుంటావు. ఈ యాగం ఆది నుంచి ఉంది. జీవి పుట్టిన దగ్గర నుంచి ఉన్నది. అంటే యోగమార్గం, యోగ పరంపర. గురుపరంపరవల్ల సృష్టి మొదటి నుంచి ఉంది. సనక సనందనాదులతో ఏర్పడింది. అదే సప్త ఋషులు చెప్పేది (యాగం, ఇటుకలు అయిపోయింది). హృదయంలో అగ్నిప్రచోదనమ్, దాన్ని సోలార్ ఫైర్ అంటారు. అది సూర్యజ్యోతి వలె లోపల ఉంటుంది. సూర్యకాంతి మొదట్లో బంగారు రంగులో ఉంటుంది. క్రమంగా వజ్రకాంతి అవుతుంది అని చెప్పాడు. అంతేకాక రంగు రంగుల మాల ఇచ్చాడు. ఆకాశంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్ని రకాల రంగులు ఏర్పడతాయో ఆ రంగులు, వాటియొక్క తత్త్వం నీకు అర్థమైపోయి, దాన్ని వినియోగించుకొనే శక్తి నీకు వస్తుంది. దానినే ఒక మాలగా నచికేతుడికి యిచ్చాడు.

పరమగురువులు కూడా సదాచార సంపన్నుడైన శిష్యుడు దొరకలేదని బాధపడుతుంటారు. మాస్టర్ సి.వి.వి.గారు కూడ

"అందరికీ అమరత్వం, అందరికీ బ్రహ్మత్వం" అన్నారు. అవి రెండూ చాలా కష్టం. దీనిని పొందగలవారు నాలుగు రకాలుగా ఉంటారు.

మొదట వచ్చి మధ్యలో వెళ్ళేవారు,
మధ్యలో వచ్చి మధ్యలో వెళ్ళేవారు,
మధ్యలో వచ్చి చివరలో వెళ్ళేవారు,
మొదట వచ్చి చివరలో వెళ్ళేవారు.

వీరిలో నాలుగవ రకం వారికి కొంత మిగులుతుంది. ఏ కార్యక్రమమైనా ఆది నుంచి అంతం వరకు సాగితే పరిపూర్ణ ఫలం లభిస్తుంది. అందుకే ఫలశ్రుతి ఇచ్చారు.

యమధర్మరాజు చెప్పిన విషయాలను నచికేతుడు అలాగే తిరిగి చెప్పాడు. నచికేతుడు చెప్పినదానికి సంతృప్తి చెందిన యమధర్మరాజు 'నీకు ఇంకో వరం ఇస్తానన్నాడు'. నచికేతుడు మరో ప్రశ్న వేశాడు. ఆయనకు మరణభయం లేదు. ఎందుకంటే ఆనందమయకోశం చేరిన వాడికి ఇక మరణభయం లేదు. చచ్చిపోతామనే భ్రాంతి ఎప్పుడూ ఉంటుంది. ఈ ప్రపంచంతో మనం ముడి వేసుకున్నంత కాలం ఉంటుంది. వదిలించుకుంటే వదిలేది కాదు. అది ఒక వ్యామోహం. అలాగే ధన వ్యామోహం, స్త్రీ వ్యామోహం, కీర్తి వ్యామోహం, పదవీ వ్యామోహం– ఇలా

ఏదో ఒక వ్యామోహం ఉంటుంది. గుర్తింపని వ్యామోహాన్ని దాటటం చాలా కష్టం.

కఠోపనిషత్తులో ముఖ్యంగా మనం తెలుసుకోవలసింది 'హృదయ కమలం'. అక్కడికి చేరాలంటే నాలుగు పొరలు దాటి లోపలకు వెళ్ళి ఐదవ పొరలోకి చేరాలి. అన్నమయ, ప్రాణమయ మంతా ఇంద్రియలోక వ్యాపారంతో కూడి ఉంటుంది. అది భౌతికానికి ఆధారం. భౌతిక శరీరానికి ముసలితనం, ఆకలి, దప్పిక ఉంటుంది. ఆ తరువాత ఇంద్రియలోకం. నీవు దేహానికి, ఇంద్రియాలకు బానిసవు. "Slave of your body or slave of your senses. Slave of your mind." ఆ తరువాత "Slave of hunger of your knowledge." **పుస్తకాలు చదివి తెలుసుకొని, దానితో తృప్తి పొందుతూ ఆచరించనివాడు పండితుడు.** Street children మీద, స్త్రీ శక్తిమీద పుస్తకాలు రాయటం కంటే వారికి చేతనైన సహాయం చేయటం ఉత్తమం. "Never gather around intellectuals and don't allow intellectuals to gather around you, because they don't do anything to the society."

పరిధినుండి కేంద్రానికి చేరినవాడికి ఆత్మసాధన, ఆధ్యాత్మిక జీవితము. నచికేతుడి తపన అంతా ఆత్మను తెలియటానికే. పాశ్చాత్య దేశాలలో దీనిని reaching heaven, reaching paradise

అంటారు. అక్కడ సమస్త భోగాలు, ఆనందం ఉంటాయి. **అమరత్వం సగం ప్రయాణమే. మిగతా సగం బ్రహ్మత్వం. ప్రాణాయామం పూర్తి అయితే అమరత్వ స్థితి వస్తుంది. ఆ తరువాత ప్రత్యాహారం, ధారణ, ధ్యాన, సమాధి నాలుగు మెట్లు ఉన్నాయి.** ఇవన్నీ భగవద్గీతలోని ఆరు అధ్యాయాలు. మిగిలిన పన్నెండు అధ్యాయాలు ఉత్తరభాగం. అంటే ఊర్ధ్వముఖంగా తీసుకెళ్ళేది. ఆ తరువాత సూక్ష్మము, సూక్ష్మతరము, సూక్ష్మ తమము అన్న విషయాలలోకి ప్రవేశిస్తావు.

తూర్పు నుండి ఉత్తరానికి వెళ్ళాలంటే ముందుగా తూర్పు చేరి ఉత్తరానికి వెళ్ళాలి. తూర్పుకు అధిపతి ఇంద్రుడు, ఉత్తరానికి అధిపతి పరమశివుడు. తూర్పులో వైభవం, వెలుగు ఉంటాయి. కేంద్రం చేరి సమాంతరరేఖ ఎక్కడ చేరి లంబరేఖ అవుతుందో అక్కడికి చేరగలము. అందుకనే 'Horizontals meet Verticles' అంటారు మాస్టర్ సి.వి.వి. గారు. Verticles meet Horizontals అంటే తిరిగివచ్చే దారి.

నచికేతుడు స్వయంగా యముడి దగ్గరకు వెళ్ళాడు. అతనికి ఆకలి లేదు, దప్పిక లేదు. 'నేను' తెలిసిన తరువాత 'పరం' తెలుస్తుందట. మరి 'నేను' తెలియనివాడికి 'పర'మేమి తెలుస్తుంది. యముడు నచికేతునికి అంగుష్ఠమాత్ర పురుషుడు, విరాట్

పురుషుడు ఆ తరువాత పరతత్త్వం అన్నీ చెబుతాడు. నచికేతుడికి యముడు చాలా అందంగా, స్నేహితుడిలా కనిపించాడు. **దాక్షిణ్య మున్న వాడికి యముడు స్నేహితుడిలాగే కనిపిస్తాడు.** అందుకే కన్యాకుమారిలో ఒక arch కట్టారు. అక్కడ దక్షిణామూర్తి విగ్రహం పెట్టారు. ఆ విగ్రహం వస్తావా, తీసుకెళ్తాను అంటున్నట్లుగా ఉంటుంది. ఆయన మృత్యుంజయుడు కదా! ఆయన మృత్యుం జయుడు కావటం చేత వెళ్దామని అంటాడు. ఆయనతో వెళ్ళి అటువైపు ఏముందో చూద్దామని ఎవరికీ అనిపించదు. దానిని ఎవరూ చూడరు.

స్వర్గము, స్వర్గ సుఖములు కోరేవారే ఎక్కువ. బ్రహ్మత్వము కోరేవారు అరుదు. హృదయ కర్ణికను చేరి అటుపై సూక్ష్మ స్పందనతో లోపలికి ప్రవేశిస్తే అచట నుండి ఊర్ధ్వగతి ఉంటుంది. ఆ కథకు సంబంధించినదే మూడవ ప్రశ్న. అనాహతమున వినబడే ఓంకారము ననుసరిస్తూ అక్షరము, పరము అగు బ్రహ్మమును చేరటం!

# 8. శిష్య పరీక్ష

**మ**రణం దాటినవాడికి మృత్యుభయము, ఆకలిదప్పులు, వృద్ధాప్యాల బాధలేదు. నచికేతుడి ప్రశ్న ఏమిటంటే **"మరణించిన వాడికి జీవితం ఉందా?"** అన్నదే. ఇది నచికేతుడు అడిగిన చివరి ప్రశ్న. మరణానంతరం మనిషి జీవిస్తున్నాడని కొందరు, లేదని కొందరు అంటున్నారు. ఈ సందేహాన్ని నిన్ను అడిగి నివృత్తి చేసుకో కోరుతున్నాను. నేను కోరే మూడవ (చివరి) వరం ఇదే.

దానికి యముడు నచికేతా! ఈ విషయాలలో దేవతలకు సహితం సందేహముంది. 'పరం' ఎవరికీ తెలియదు. మంచి పనులు చేస్తూ ప్రపంచానికి కావలసినవన్నీ చేసేవాళ్ళకు కూడ దేవుడు తెలియదు. దేవుడు తెలియనివారు దేవతలలోనూ ఉన్నారు, అసురులలోనూ ఉన్నారు. మానవులలో ఇక చెప్ప నక్కరలేదు. కాని యోగి ఇక్కడితో ఆగడు. తనను గురించి తెలియాలి. తన మూలం గురించి తెలియాలి. ఆత్మమూలం గురించి కూడా తెలియాలి. అందుకే కృష్ణుడు *'యోగీభవ అర్జునా!'* అన్నాడు.

*"ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై*
*యెవ్వనియందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం*
*బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు సర్వము దానయైనవా*
*డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్."*

అయితే వాడెవడు? వాడికి దండం పెడతాను. మిగతా వాళ్ళు నాకొద్దు అన్నాడు. మనకొచ్చిన కష్టానికి మూలంలో ఉండేవాడు రాడు. ఎవరినైనా పంపిస్తాడు.

నచికేతుడు "యమధర్మరాజా! దీనిని సులభంగా అర్థం చేసుకోవటం సాధ్యం కాదని నీవే చెబుతున్నావు. కాని దీనిని ఉపదేశించటానికి నీవంటి వేరొకరు లభించరు. వేరే ఏ వరం కూడా దీనికి సమాధానం కాదు" అన్నాడు.

చెబితే యముడే చెప్పాలి. యముడే గురువంటే అంతకన్నా ఏం కావాలి? యముడి నుంచి రక్షించిన కథలు విన్నాము. కాని అక్కడ యముడు గురువు కాదు. యముని గురువుగా స్వీకరించే వారు దక్షిణం వైపు చూసి ప్రార్థనలు చేస్తారు. "I am willing for the very discipline you impose on me but let me have your grace." అది దక్షిణం. అందుచేత దక్షిణామూర్తి ఎంత భయంకరంగా కనిపిస్తాడో అంత దాక్షిణ్యమూర్తి.

యముడు నచికేతునితో "నూరేళ్ళు ఆయుష్షుగల కొడుకు

లను, మనుమలను కోరుకో. వంశాభివృద్ధి కావాలి కదా! పుష్కలంగా పశువులు, ఏనుగులు, బలగాన్ని, గుఱ్ఱాలు వంటి వాటిని కోరుకో. భూమ్మీద విశాలమైన సామ్రాజ్యాన్ని కోరుకో. అశ్వమేధం చేస్తే నీ గుఱ్ఱాన్ని ఎవరూ ముట్టుకోలేరు, పట్టుకోలేరు. నీ కన్నా వీరుడు భూమ్మీద ఎవడూ లేడు. నీ ఇష్టం వచ్చినంత కాలము జీవించు, లేదా దీనికి సమానమైన వరం ఏదైనా ఉంటే దాన్ని కోరుకో లేదా నీకు ఏది తోస్తే అది కోరుకో" అన్నాడు.

చాలామంది చక్రవర్తులయ్యారు. దశరథుడు చక్రవర్తి. అశోకుడు చక్రవర్తి. అక్బర్ చక్రవర్తి. వీరు తిరుగులేని సామ్రాజ్యం ఏలారు. చెట్టుకు, జంతువులకు ఆయుష్షు ప్రమాణం ఉంటుంది. కాని గుండ్రాయి, తిరగలి, రోకలిబండ ఇవి శాశ్వతంగా ఉంటాయి కాని వాటికి చేతన అంతంతమాత్రమే. శాశ్వతంగా చేతన లేక ఉన్నవారు లేక చేతన కలిగి శాశ్వతముగా లేనివారు ఉంటారు. నచికేతుడు కోరేది శాశ్వతముగా పూర్ణ చేతస్కులై ఉండే విధానం! అలాంటి చేతనతో ఉండటం కావాలి కదా! సంపూర్ణ జ్ఞానంతో అలా శాశ్వతంగా ఉండేవాళ్ళు యోగులు. ఇలా తపస్సు చేసినవారికి వరాలు ఇచ్చేవారు. నరుడికి వరం కాని మనిషికి కాదు. రాక్షసులు కూడా తపస్సు చేసి 'ఇంద్రపదవి' అడిగే వారు.

యముడు "నచికేతా! మానవలోకంలో తీర్చుకోవడానికి దుర్లభమైనవి ఏ యే కోరికలు ఉన్నాయో వాటన్నిటినీ నీ ఇష్ట ప్రకారం కోరుకో. సారథులతో కూడుకున్న రథాలను ప్రసాదిస్తాను. సంగీత వాద్యాలు, నిష్ణాతులైన కళాకారులను యిస్తాను. పురుషులను మోహంలో ముంచెత్తే దేవతా స్త్రీలను అనుగ్రహిస్తాను. ఇటువంటి స్త్రీలు మానవులకు లభించరు. నేను ప్రసాదించే ఈ దేవలోక స్త్రీలచే నీవు కావలసిన పరిచర్యలు పొందు కాని, మరణం గురించి మాత్రం అడగవద్దు" అన్నాడు.

విశ్వామిత్రుని కూడా యిలాగే ఇబ్బంది పెట్టేశారు. భయంకరమైన స్థిరసంకల్పం కలిగిన ఆయనను కూడా మేనకను పంపించి కదిలించారు. కొన్నాళ్ళ తరువాత విశ్వామిత్రుడు పొరబాటు అయిపోయిందని మళ్లీ మొదలు పెట్టాడు. చివరికి సాధించాడు.

నచికేతుడు "మృత్యుదేవా! నీవు చెబుతున్న సుఖాలన్నీ అశాశ్వతాలు. నీవు చెప్పినవన్నీ కూడా స్వర్గంలో లభిస్తాయి. కాని అవన్నీ అశాశ్వతం. అవి మనిషి ఇంద్రియశక్తిని వృథా చేసేవే. జీవితమే స్వల్పమైనది. నీవు యిస్తానని చెప్పిన అన్నింటినీ నీవే ఉంచుకో. నరుడు ధనంతో తృప్తిచెందేవాడు కాడు. నిన్ను దర్శిస్తే కావలసిన సంపద లభించడం సత్యం. ఇంద్రియాలుంటే

నిన్ను చూసేవారికి కరువేమిటి? ఏ విషయానికీ లోటుండదు. నీవు పాలించే వరకు నా ఆయుష్షుకు కొరతలేదు. నీవు అనుగ్రహించి వరాలు ఇస్తున్నావంటే నేనంటే నీకు ఇష్టం. నాకు ఇక భయాలు లేవు కనుక ఆయుష్షు, సంపద ఏదీ నాకు వద్దు. నేను కోరుకునే వరం అదొక్కటే. వార్ధక్యం లేనివారు, అమరులు అయిన మిమ్ము లను పొంది నేను నిజాన్ని తెలుసుకున్నాను. వృద్ధాప్యము, మరణము ఉన్న అధోలోక వాసిని. ఆట – పాటలు, శారీరక సుఖాలు మొదలైన వాటిలో కలిగే సుఖం ఏముంది? చింతన చేసి పరిగ్రహించాను. కనుక జీవితం, ఆయుష్షు యిచ్చినప్పటికీ ఆ జీవితం ఆశిస్తానా!" అని చెప్పాడు.

యమధర్మరాజును నచికేతుడు ఏ విషయంలో సందేహం వుందో, దేనిని తెలుసుకుంటే గొప్ప ఫలం లభిస్తుందో, ఏ నిజం అతి గోప్యంగా దాచబడివుందో, దానిని తెలుసుకోవడమన్నదే మూడవ వరంగా అడిగాడు. మనకు శ్రేయస్కరమైనది వేరు, ప్రేయస్కరమైనది వేరు. సుఖం వేరు. జీవుడికి శాశ్వతమైన శ్రేయస్సు కలిగించేది వేరు. శ్రేయస్కరమైనదానిని స్వీకరించిన వారికి శ్రేయస్సు పెరుగుతుంది. సుఖకరం, ప్రీతికరమైనదానిని కోరుకునే వాడు క్షీణించి పతనము చెందుతాడు. అందుకని సుఖమును ఎప్పుడూ కోరుకోకూడదు. సుఖకరమైనది, శ్రేయస్కర

మైనది ఇవి రెండూ మనిషిని సమీపిస్తాయి. బుద్ధిమంతుడు వాటిని విచారణ చేసి శ్రేయస్కరమైనదానిని ఎన్నుకుంటే, బుద్ధిహీనుడు శారీరక వృద్ధి, రక్షణ మొదలైనవి ఎంచుకొని సుఖకరమైన దాన్ని ఎన్నుకొంటాడు. ఉదయం నాలుగింటికి అంటే బ్రహ్మ ముహూర్తానికి లేస్తే శ్రేయస్కరము. దానికి ఎంత దూరంలో ఉన్నావో, నీవు నీ దేహానికి అంత బద్ధమై ఉన్నావని గుర్తుంచు కోవాలి. ఎందుకంటే నీ శరీరము నీకన్నా బలమైనది. నిన్ను పతనం కావిస్తుంది. యోగులు రెండు నుంచి నాలుగింటివరకు నిద్రకాని నిద్రలో, ఆశ్రమాల్లో ఉండి, నాలుగింటికి లేచి స్నానాదులు మొదలు పెడతారు. నీవు బాగుండటం వేరు, నీ శరీరం బాగుండటం వేరు. ఇవాళ రోగం గురించిన చర్చలే ఎక్కువ. ఎప్పుడూ రోగధ్యానం చేస్తుంటే జీవుడు త్వరగా మృత్యు ముఖంలోకి వెళ్ళిపోతూ ఉంటాడు.

యముడు "నచికేతా! నీవే చక్కగా ఆలోచించి సంపదలను, అందమైన స్త్రీలను త్రోసిరాజన్నావు." ఏ మార్గంలో ఎందరు మనుషులు మునిగిపోతారో అది సంపదగా లక్ష్యంగా పెట్టుకొని ఆ మార్గాన్ని ఎంచుకోలేదు. తిరస్కార భావం కాక సమన్వయం ఉండాలి.

విప్రనారాయణుడు స్త్రీ ని బాగా తిరస్కరించాడు. అందుచేత

ఒకసారి ఆయనకు స్త్రీ చేత అవమానం పాలు చేసి మరల బయట పడేశారు. మళ్ళీ వెనక్కి, మార్గంలోకి వచ్చినప్పుడు నీవు స్త్రీని తిరస్కరించావు అన్నారు. ఈ ప్రపంచం పనికిరాదు అని చెప్పే స్వామీజీలందరూ చాలా తెలియనివాళ్ళు. రామకృష్ణ పరమహంస దగ్గర ఒక విద్యావేత్త గంటసేపు అలా మాట్లాడి తరువాత 'స్వామీ! మీకేమి అనిపిస్తోంది?' అని అడిగాడు. దానికి ఆయన "ఇంతకూ నీవు చెప్పిందేమీ నాకు కనిపించలేదు. నాకంతా అమ్మే కని పిస్తోంది" అన్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడున్నారో పరిణామములో కూడా అక్కడే ఉంటారు. తిరస్కారభావమే అహంకారం. ప్రేమగా మాట్లాడు, స్నేహపూర్వకంగా ఉండు. నచికేతుడు తిరస్కరించటం లేదు. అవన్నీ అశాశ్వతములని, తనకు వాటియందు రుచి లేదని అంటున్నాడు. భగవద్భక్తుడికి ఎక్కడ రుచి వుందో భగవంతుడు అందులోకి తోసేస్తుంటాడు. రావణాసురునికి ఎన్నిసార్లు ప్రత్యక్షమైనా ఏవేవో అడిగాడు. సాధనలో కొంతదూరం వెళ్ళాక వ్యామోహం వచ్చి ప్రజాధిపత్యం, ధనాధిపత్యం, సామ్రాజ్యస్థాపనం వచ్చాయంటే వశిష్ఠుడు, అగస్త్యుడు, ఏ ఋషియైనా సామ్రాజ్యాలు పెట్టారా? యోగులెవరూ సామ్రాజ్యాలు పెట్టలేదు. వాళ్ళు అను కుంటే మహా సామ్రాజ్యాలు నిర్మాణం చేయగలరు. ప్రలోభం లేక శ్రేయో మార్గంలో ఉన్నవాడిని ఎవరూ వైదొలగించలేరు. "It cannot deviate you from the path. Let there be deviation but

what ever you have done will bring you back to path again." యోగి కొంత వైదొలగినా మళ్ళీ యోగంలోకి వచ్చేస్తాడు. అందుకే కృష్ణుడు యోగమార్గాన్నే పట్టుకోమన్నాడు.

యముడు "నచికేతా! నీవు భగవన్మార్గంలో ఆసక్తిగల వాడవని నేను భావిస్తున్నాను." భగవన్మార్గంలో ఆసక్తి అంటే అది గొప్ప విషయమని తెలిస్తే అది దొరకదు. ఎందుకంటే నీకు తీరనివి లోపల ఉండగా నీవు అందుకునే యోగానికి ఆటంకం కలిగిస్తుంది. 'కామి గానివాడు మోక్షగామి కాడు' అన్నారు. కావలసినవి తట్టెడు పెట్టుకొని యోగంలో దిగావనుకో. అవన్నీ పూర్తి అయ్యేదాక కరుణామయి ప్రకృతి జన్మ ఇస్తూనే ఉంటుంది. మనకు భగవంతుడు 21 లక్షల మానవజన్మలు అనుగ్రహించాడు. అనుకున్నవన్నీ పూర్తయ్యే దాకా మళ్ళీ మళ్ళీ యిస్తూనే ఉంటాడు. ఇల్లు, మంచి కారు, పదవి, పుష్కలంగా డబ్బు కావాలంటే, నన్ను అడిగితే నేనే ఇచ్చేస్తాను. వీటిని కాదని వచ్చి మళ్ళీ ఇవి కావాలంటే అటు-ఇటు కాకుండా అవుతుంది. ఇక్కడ ఏది కావాలో స్పష్టత ఉండాలి. ఒకసారి బయటకు వచ్చేస్తే మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేస్తుంటాడు. అలాగే యోగమార్గంలో అదొక రాజమార్గం. యోగమార్గం అంటే దైవమార్గమే. ఆ మార్గంలో ఒకటి, రెండు అడుగులు వేసి పక్కకు వెళ్ళినా ఫరవా లేదు, మళ్ళీ వస్తాడు.

యముడికి ఈ నచికేతుడు ఎన్ని దారులు కనిపించినా అందులోకి వెళ్ళక ఆ విధంగా నిలబడిపోయాడని నిర్ణయమై పోయింది. "నీవు భగవన్మార్గంలో ఆసక్తిగలవాడ వని భావిస్తున్నాను. ప్రాపంచికత నడుమ జీవించే మూర్ఖులు తమను బుద్ధిశాలురుగా, విద్వాంసులుగా భావించి అడ్డదారిన నడుస్తారు."

గురువుల్లో కూడా చాలా రకాలుంటారని ప్రహ్లాదుడు చెబుతాడు.

*"గురువులు దమకును లోఁబడు*
*తెరువులు సెప్పెదరు విష్ణు దివ్యపదవికిం*
*దెరువులు సెప్పరు చీఁకటిఁ*
*బరువులు పెట్టంగ నేల బాలకులారా!"* అన్నాడు.

అంతేకాక *'కుంభినీధవుడు చెప్పు గురువు గురువు'* అన్నాడు. అసుర బాలకులంటే జ్ఞానము లేనివాళ్ళని అర్థం. అందుకే వాళ్ళు ఏదో చెబుతుంటారు. గొఱ్ఱెలను కాక గొఱ్ఱెల కాపరులను తయారు చేసుకోవాలి. గొఱ్ఱెలకాపరి చచ్చిపోతే అవి దిక్కులేకుండా అయిపోతాయి. బాగుపడే మార్గాలు మనకెన్ని లేవు. "Every duplicate is an assurance also for a original. A duplicate affirms an original." అందుచేత అడ్డదారిలో వెళ్ళి ధనాశచే తెలివి కోల్పోయిన, మనోపక్వము లేనివారికి పరలోక నిజాలు అర్థం

కావు. ఇహలోకములో అందించే సుఖాలు సమస్తమని, వాటిని అనుభవించడమే లక్ష్యమని భావిస్తారు. అంతరంగిక పురోగతి ఉన్నత లక్ష్యమును స్వీకరించటం లేదు. దేనిని గురించి వినడానికి అనేకులకు సాధ్యపడదో, విన్నప్పటికీ ఎందరు దీనిని అర్థం చేసుకోలేదో ఆ ఆత్మను గురించి ఉపదేశించువాడు అరుదు, వినేవాడు కూడా అరుదు. అంతటి అరుదైన వ్యక్తి ఉపదేశాలను అర్థం చేసుకొని, పాటించేవారు కూడా అరుదే.

శ్రీకృష్ణుడు గీతలో 'మనుష్యాణాం సహస్రేషు' అంటాడు. వెయ్యిమందిలో ఒకడికి నిజమైన ఆసక్తి కలుగుతుంది. ఆ ఒక్కడు హృదయం చేరుతాడు. వెయ్యిమందిలో ఎవడు ఆత్మను చింత చేస్తారో అంటే 1%. ఇలా చూస్తే చివరికి ఒక్కడు మిగులుతాడు. అదెవరో దొరకటం లేదు. దుర్భిణీ వేసి వెదకినా ఎవరూ కనబడటం లేదట. అందుకని యముడు ఎప్పుడో చెప్పాడు. ఇవన్నీ కలియుగానికి ముందు కథలు. అనుభూతి పొందినవారి ఉపదేశాలను పాటిస్తే గందరగోళం ఉండదు. ఈ ఆత్మ అణువు కన్నా సూక్ష్మమైనది. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అన్నారు కదా! అవిజ్ఞేయం అంటే తెలియదు. దానిని తెలియా లంటే తపస్సే ప్రధానం. సత్యాన్ని గ్రహించిన వ్యక్తి ఉపదేశించి, దానిని పాటించినప్పుడు అది శ్రేష్ఠమైన జ్ఞానస్థితికి తీసు

కెళ్తుంది. ఎందుకంటే నీకున్న వస్తు సంపత్తితో తెలియలేవు. అది నీ తర్కానికి అందదు. నీవు ఎంత లోపలికి వెళ్ళినా, హృదయాన్ని చేరుకున్నా దాన్ని తెలుసుకొనేంత ప్రజ్ఞ నీ దగ్గర ఉండదు. వెలిగే దీపంతో ఇంకొక దీపం వెలిగించినట్లు ఇంకొకడు వెలిగిస్తే వెలుగు తుంది.

రోజూ వెలుగుతున్న దీపం చూస్తాము. దానిని ఎవరు వెలిగించారు? నేను అన్నది సమాధానమైతే, 'నేను' అంటే ఎవరు? నీ చేయా? నీ మెదడా? నీ మెదడు లోపలి ప్రజ్ఞా? అవన్నీ పనిముట్లే. ఇలా ప్రతి దానికి మూలంలోకి వెళ్తుంటే మనకు తెలియనిదేదో ఉందని తెలుస్తుంది. దేనివలన స్పందన జరుగుతుంది? అది లేకపోతే స్పందన ఉండదు. శ్వాస మరియు కదలికలు ఉండవు. మరి అదెలా ఉంటుంది? అది తెలియదు కాని అదయిపోవచ్చని చెబుతారు. అదయిపోయిన వాడు తోడుంటేనే అది తెలుస్తుంది. ఆత్మదర్శనం చేసినవాడే ఇంకొకడికి తోడ్పడగలడు. పాలు తనకు తానే పెరుగు కాదు. కాస్త పెరుగు తోడుపెడితే అది పెరుగు అవుతుంది. అందుకే గురువు తోడ్పడతాడు. దానికి శిష్యుని శ్రద్ధ, నిష్ఠ ప్రధానము.

కాని మనం అనిష్ట ఆచారాలను పాటిస్తుంటాము. చచ్చిన వాడికి కోడిమాంసం ఇష్టమని కోడిని చంపి కట్టి పంపిస్తుంటాము.

అసలు ప్రేతం ఏమీ తినదు. దానికి మంచినీళ్ళే ఆహారం. ఇలా పక్కదారులు పట్టకుండా గురువు తోడ్పడతాడు. “నీవు పొందిన జ్ఞానం తర్కం వలన లభించేది కాదు. ‘అప్రతర్క్యం’. అది వదిలేసి నన్ను అనుసరించు” అంటాడు సద్గురువు. ఒకసారి మాస్టర్ ఇ.కె.గారితో “నేను చిన్నప్పటి నుంచి ఆత్మసాక్షాత్కారం కోసం పనిచేసుకుంటున్నాను, అది లభిస్తుందా?” అని అడిగితే దాని కాయన “నీవు నాతో ఉన్నావు కదా! నాకు లభిస్తే నీకూ లభిస్తుంది. కలిసి పోదాం. అదే లభిస్తుంది” అన్నారు. మనకు దొరికిన సన్మార్గంలో వెళ్తూ ఉంటే జ్ఞానస్థితికి తోడ్కొని పోతుంది.

“నచికేతా! నీవు సత్యనిష్ఠుడవు. దృఢంగా తెలుసుకున్నావు. నెలకొని ఉన్నావు. నీలాంటి విద్యార్థి మాకు లభించుగాక!” అని యముడు తనను తాను ఆశీర్వదించుకున్నాడు! “కర్మఫలములు అశాశ్వతములు అని నాకు తెలుసు. వాటితో ఆత్మను పొంద లేము.” అందుకనే అంటారు సూది బెజ్జంలో నుంచి నీవు ఏమీ పట్టుకెళ్ళలేవు అని. అందుచేత “ఆ అశాశ్వత వస్తువులచే నచికేత యజ్ఞాన్ని నిర్వర్తించి నేను యమధర్మరాజు పదవిని పొందాను.” **అశాశ్వతమైన వస్తువులతో శాశ్వత విషయాన్ని సాధించుకోవచ్చు. అదే తెలివి.** అశాశ్వతమగు మనస్సు, ఇంద్రియములు, శరీరంతో శాశ్వతమగు బ్రహ్మత్వం పొందవచ్చు! ఇది సత్యం.

నచికేతుడిలాంటి విద్యార్థి మళ్ళీ ఒక్కడు కూడా యమునికి దొరకలేదు. నచికేతుడికి ముందు కూడా ఎవడూ లేడు. ఆ గురువుకు ఆ విద్యార్థి ఒక్కడే! అలాంటి పాఠశాలలో విద్యార్థులు ఉండరు. యముడు చెప్పినట్లుగా ఈ శరీరం శాశ్వతం కాదు. కాని ఇది వుండగానే శాశ్వతమైన సత్యాన్ని మనం పొందవచ్చు. అందుకే *'శరీరమిదం ఖలు ధర్మసాధనం'* అన్నారు. ఖలుధర్మాలు అంటే అన్ని ధర్మాలు అని అర్థం. ఈ శరీరంతో అఖిలం పొంద వచ్చు. ఈ శరీరంలో ఉండగానే ఆత్మ సాక్షాత్కారం పొందిన వారున్నారు. మళ్ళీ శరీరం తీసుకొని అమరత్వం పొందితే అప్పుడు దివ్య శరీరంతో అయినా సరే ఆత్మసాక్షాత్కారం చేసుకోవచ్చు. దివ్య శరీరానికి ఆయుర్దాయం ఎక్కువ. అది పదిహేనువందల ఏళ్ళు ఉంటుంది.

సూక్ష్మశరీరంలో ఇంకో గ్రేడ్ ఉంది. అది వజ్ర శరీరం. అది తయారు చేసుకుంటే వేల సంవత్సరాలు అందులో ఉండి పోవచ్చు కాని ఆత్మ సాక్షాత్కారం కాకపోవచ్చు. ఆత్మసాక్షాత్కారం పొందిన వాడికి సంకల్ప మాత్రంచేత వజ్ర శరీరము, బంగారు శరీరము, భౌతిక శరీరము– ఇలా మూడు శరీరాలు ఏర్పడతాయి. అలాగే సంకల్పమాత్రం చేత వాటిని విసర్జిస్తాడు కూడా. అలాంటి వాడిని పరమగురువు అంటారు. పరమగురువుకు మూడు శరీరా లున్నాయి. ఆయన మూడు లోకాలలోను పనిచేస్తుంటాడు.

వాళ్ళకు మూడు లోకాలలోనూ గురు పరంపర, శిష్య పరంపర ఉంటుంది. వారి గురు పరంపరలో నారదుడు, కుమారాదులు, సప్తర్షులు, పరబ్రహ్మము ఉంటారు. అనాదిగా, సనాతనంగా గురుపరంపరను యీ క్రమంలో స్మరించాలి.

గురుభ్యో నమః – నీ గురువు.

పరమ గురుభ్యో నమః – నీ గురువుగారి గురువు.

పరమేష్ఠి గురుభ్యో నమః – గురువుగారి, గురువుగారి, గురువు గారు.

గోత్ర ఋషిభ్యో నమః । (తెలిస్తే?)

సప్త ఋషిభ్యో నమః ।

ధృవాయ నమః ।

సనకాయ నమః ।

సనందనాయ నమః ।

సనత్కుమారాయ నమః ।

మైత్రేయాయ నమః ।

శుకాయ నమః ।

వ్యాసాయ నమః ।

నారదాయ నమః ।

పరబ్రహ్మణే నమః ।

ప్రతి శిష్యుడు, తన గురువు ఒక పరంపరకు ప్రతినిధి అని తెలియాలి. అందరూ సప్త ఋషులకు, అటుపైన కుమారులకు, నారదునకు, పరబ్రహ్మమునకు తమ గురువు ద్వారా సంధింపబడి వున్నారని తెలియాలి.

"నచికేతా! స్వర్గలోకం కోరికలు తీర్చుకునే చోటు. లోకం యొక్క ఆధారం. ఆ యాగాల ఫలంగా లభించే చెప్ప సాధ్యం కాని స్వప్నసుఖాలకు ఆలవాలం. మహత్వము గలది, ఆరాధనీయమైనది. సుదీర్ఘకాలం నెలకొని ఉండేది. శ్రేయస్కరమైనది. బుద్ధిశాలివైన నీవు దానిని దృఢనిశ్చయంతో తిరస్కరించావు. నీ తండ్రి స్వర్గఫలాలను ఆశించి చేస్తున్నాడు. అది కూడ సరిగ్గా చేయటం లేదు. నీవు అడిగిన 'ఆత్మ' ఎంతో శ్రమతో పొందదగినది. గోప్యమైనచోట, చీకటిలో నెలకొని ఉన్నది. హృద్గుహాలో ప్రకాశించేది. నీవు దానిని కోరుకున్నావు. అది చాలా గొప్ప విషయం" అంటాడు యముడు.

'*ఆదిత్య వర్ణమ్ తమసః పరస్తాత్*' అంటారు. సనాతనమైనది. బుద్ధివికాసం పొందినవాడు ధీశాలి, జ్యోతిర్మయమైన ఆ ఆత్మను, ఆధ్యాత్మయోగం ద్వారా దర్శించి సుఖదుఃఖాలకు అతీతుడు అవుతాడు. అంటే తపస్సు హృదయం చేరినప్పుడు స్వర్గం దొరుకుతుంది. హృదయకర్ణిక నుండి ఊర్ధ్వముఖముగ విశుద్ధి, భ్రూమధ్యం, ఆజ్ఞా కేంద్రములు చేరినపుడు, సాధకునకు

తన నిజస్వరూపం అవగతమవుతుంది. అటుపైన సహస్రార ప్రజ్ఞ చేరినపుడు, పరమగు బ్రహ్మములో లీనమవటం తటస్థపడుతుంది. ఆజ్ఞా కేంద్రం చేరిన సాధకునకు, తాను మరణానంతరము కూడ వుంటాడని తెలుస్తుంది. ఇదీ చేరవలసిన గమ్యం. సద్గురువు మన నుండి ఆశించేది.

కాని, బయటి కర్మలు పీకేస్తుంటే ఆత్మజ్ఞాన మేమిటి? పరమగురువులు చెప్పేదేమిటంటే "మేము ఆత్మజ్ఞానం మిమ్మలను ఏమీ ఆశించటం లేదు. ఆ ఆశ ఎప్పుడో పోయింది. అమరత్వం సంపాదించండి. నిర్ణయం చేసుకోండి." అమరత్వం తరువాత గమ్య మేమిటని నచికేతునికి చూపిస్తున్నాడు యముడు. అమరత్వంతో తృప్తి చెందిన కథలు చాలా ఉన్నాయి. కాని నచికేతుడు స్వర్గప్రాప్తి అనంతరం కథ అడగడంతో యముడు సంతోషించాడు.

హరిశ్చంద్రుడి లాంటి వాళ్ళు ఇతర లోకములలో ఉన్నారు. అందుకు కృష్ణుడు అర్జునునితో "నీవు హరిశ్చంద్రుడవైనా నాకు పెద్ద తృప్తి కలగదు. నీవు యోగివైతేనే నాకు తృప్తి" అన్నాడు. అర్జునుడికి ఏమీ అర్థం కాలేదు. కృష్ణుడికి యుద్ధం గెలిచినా, ఓడినా ఒకటే. ధర్మరక్షణ ఎలాగూ తాను చేయగలడు. ఆ కీర్తి అర్జునుడికి ఇవ్వాలని ప్రయత్నిస్తాడు. యుధిష్ఠిరుడు స్వర్గానికి

వెళ్ళటం ఖాయం. ఆయనను ఎవరూ ఆపలేరు. అందుకే యుధిష్ఠిరుడి రథంలో కాక అర్జునుడి రథంలో కూర్చుంటాడు. రాజసూయం ద్వారా యుధిష్ఠిరుడిలోని మోహాన్ని తొలగిస్తాడు. **నరుడు మనిషై, పశువులా అవుతుంటాడు. అలాకాక పశువు నుంచి మనిషై, మనిషి నుంచి నరుడు అయితేనే ఆత్మజ్ఞానానికి అర్హత ఉంది.** సాధన మార్గముద్వారా లోపల ప్రవేశించినవాడు ఆనందమయలోకంలో స్థిరంగా ఉంటాడు. అమిత స్వర్గభోగాలు లభిస్తాయి. ఇవి కాదని ముందుకెళ్ళే విధానం యోగము.

ఈ భోగాలన్నిటినీ కాదనటానికి మనిషికి స్పష్టమైన ఆలోచన ఉండాలి. అక్కడి నుండి ఎన్ని భోగాలనైనా అనుభవించవచ్చు. ఎంత స్వామిత్వమైనా పొందవచ్చు. అనారోగ్యం, ముసలితనం లేక దీర్ఘకాలం ఉండవచ్చు. మరణ భయం ఉండదు. ఈ అమర స్థితినే అందరూ కోరుకుంటారు. మానవుడు నరుడై, నరుడు అమరుడైనట్లుగా కథ ఉంది. అలా అమరుడైన మానవుడు విశ్రాంతి చెందక తనకు ఇవ్వబడిన ఈ ప్రత్యేకమైన మానవశరీరం ఆధారంగా ఆత్మజ్ఞానాన్ని పొంది, ఆత్మానుభూతి పొందటం ఒక మార్గం. అందిన దీర్ఘ స్వర్గ సుఖాలను అనుభవించడం మరొక మార్గం.

హరిశ్చంద్రుడు, పాండురాజు, దశరథుడు స్వర్గలోకవాసులై

భూమిమీద వారి కథ మరచిపోయాక మళ్ళీ పుడతారు. స్వర్గాన్ని కోరుకునేవాళ్ళు ఎక్కువమంది. సాధకునికి అప్పుడప్పుడు స్వర్గసుఖ ఆకర్షణలు తగులుతాయి. కారణమేమంటే అతని అంతఃక్షేత్రంలో వాటిపైన ఉన్న కోరికయే. వేమనయోగి ఆ జన్మలో పూర్వభాగ మంతా కూడా రసికతను అనుభవించి, ఆ తరువాత అకస్మాత్తుగా మహాయోగిగా మారిపోయాడు. పుండరీకుడు, తులసీదాసు కూడ అలాగే స్త్రీలోలురై పూర్వ భాగమంతా గడిపారు. ఆ తరువాత అన్నీ మరచి పరిపూర్ణమైన శుద్ధతత్త్వాన్ని చేరుకొని అలా ఆత్మ జ్ఞానము పొందారు. దీనిద్వారా మనకు తెలిసేదేమంటే స్వర్గసుఖం పరిమితమని భావించి ముందుకు వెళ్ళేవాడికి అంతశ్చేతనలో ఆ అనుభూతి పరిపూర్ణం కాకపోవటంచేత, అంతకు మించిన సన్నివేశములు వచ్చినప్పుడు లొంగిపోయిన వాళ్ళున్నారు. అందుకే యముడు చాలా హెచ్చరికతో చెబుతున్నాడు.

“నచికేతా! స్వర్గం కోరికలు తీర్చుకునే చోటు. లోకం యొక్క ఆధారం, యాగాల పరంగా లభించే చెప్పరానంత సుఖాలకు ఆలవాలము.” నీవు ఏమి కాదనుకుంటున్నావో ఒక్కసారి వివేకించు. అది వీరోచితం కాదు. దానికి సమదృష్టి, సమభావం, తన పరిస్థితి ఏమిటని తెలుసుకోవాలి. కొన్నింటిని కాదని, కొన్నింటిని విసర్జించి, వాటి అనుభూతి పరిపూర్ణంగా లేకుండా ముందుకు

వెళ్ళిన వాడు ఏదో ఒక సమయంలో అక్కడ ఆగి వెనక్కి వెళ్ళి, మళ్ళీదాన్ని పూర్తి చేసుకోవాలి.

ఇప్పటి మన విద్యావిధానంలో కూడా ఒకటో రెండో సబ్జక్టులు మిగిలిపోయినా ముందుక్లాసుకు వెళ్ళి చదువుకుంటూ, మిగిలిన పరీక్షలు రాస్తుంటాడు. అలా ఏయే అనుభూతులు పూర్తి కాకుండా నీవు ముందుకు వెళ్తుంటావో ఆ అనుభూతులు నిన్ను ఏడిపించటానికి నీ వెంటబడి వస్తుంటాయి. నీవు వద్దన్నావు. నిజంగా వద్దన్నావో, గొప్పకోసం వద్దన్నావో తెలుస్తుంది. తపస్సు చేస్తుంటే విపరీతంగా బంగారం, మాణిక్యాలు, వజ్ర వైడూర్యాలు అన్నీ చూపించేస్తారు.

లహరీ మహాశయుడు మహాయోగి. ఆయనకు కూడా అలాంటిది ఒకటి మిగిలిపోయింది. ఆయన తపస్సు చేస్తుంటే ప్రజ్ఞ అక్కడికి వెళ్ళిపోయింది. హిమాలయాలలోని నిధి చూపించి 'ఇదంతా నీదే' తీసుకోమన్నారు. ఆయనకు విపరీతమైన యావ వస్తుంది. మహాత్ములు తాము ఎక్కడ పొరబాటు పడ్డారో చెబుతారు. ఆయన బాగా ఆలోచించుకొని వద్దనుకున్నాడు. ఎందుకంటే అది శాశ్వతం కాదు కదా! ఆ తరువాత స్వయంగా భౌతికంగా గురువుగారు కనబడి ఇంత సంపద ఎవరికి ఉంటుంది? ఎందుకు కాదన్నావు? అంటే వద్దు గురువుగారు అని ముందుకు

వెళ్ళిపోతాడు. విశ్వామిత్రుడు కూడా ఇలాంటి పొరబాటు చేసి కొన్నాళ్ళు కాలక్షేపం చేసి 'భరత సంతతి'ని పట్టుకొస్తాడు. ఆ తరువాత హృదయగుహలోకి వెళ్ళి బాగా తపస్సు చేసి స్వర్గలోకాన్ని కాదన్నాడు. అప్పుడు ఇంద్రుడు ఒకసారి కుదిపి చూస్తాడు. అంతేకాని పాడుచేయాలని ఉద్దేశం లేదు. నీలో వెదకి వెదకి నీవు 'శుద్ధ స్ఫటిక సంకాశం' అనిపిస్తే అప్పుడు వదిలేస్తాడు. **లోకదృష్టి ఉన్నవాడికి ఆత్మదృష్టి కష్టం.** ఆత్మదృష్టి ఉండేవాడు లోకంలో తగుమాత్రంగా వుంటాడు. ఎక్కువ దూరం వెళ్ళడు. ఇది చాలా ముఖ్యమైన హెచ్చరిక.

భారతీయ జీవన విధానంలో కుటుంబము, సంతానప్రాప్తి, సంఘము, దానియందు వృత్తి నిర్వహణ, అందులో కొంత ధన సముపార్జన అందులో ఉన్న రుచి కొంత మాత్రమే తెలిసి, గృహస్థ ధర్మంలోని రుచులను పరిపూర్ణంగా అనుభవించిన తరువాత ఇంతకు మించిన సుఖము గృహస్థాశ్రమంలో లేదని, పైన కూడా ఇదే సుఖము ఉందని తెలిసిన తరువాత వ్యామోహానికి అవకాశము తక్కువ. **గురుస్థానంలో కూర్చుని ధన సంపాదన, కీర్తి సంపాదన, సామ్రాజ్య స్థాపన ఇవన్నీ ఋషుల మార్గాలు కావు.** ఋషులు సామ్రాజ్య అధిపతులకు కూడ అవసరమైతే సలహాలిచ్చారు. కాని ధనం జోలికి పోలేదు. ఈ రోజుల్లో

సన్యాసాశ్రమము స్వీకరించి సామ్రాజ్యాలు ఏర్పరుచుకొనే సన్యాసులు చాలామంది ఉన్నారు! కలియుగం! “వారు సన్యాసులు కాదోయ్! సన్నాసులు” అని అన్నారు మాస్టర్ ఇ.కె.

నిజమైన ఆధ్యాత్మిక సంస్థ డబ్బుతో ముడిలేకుండా పని చేస్తుంది. డబ్బుతో నడిచే ఆధ్యాత్మిక సంస్థలు ఆత్మసాధనకు సంబంధించినవి కావు. It is some activity other than spiritual. స్వచ్ఛమైన ఆధ్యాత్మిక సంస్థలోని మూలపురుషుడు ఎవరి దగ్గరి నుంచీ దేనినీ ఆశించడు. ఎవరినీ వాడుకోడు. అలాంటి చోట చేరి నేర్చుకోవచ్చు. పైగా అక్కడ సుదీర్ఘకాలం ఉండవచ్చు. త్యాగరాజస్వామి కూడ తంజావూరు రాజునుంచి అమిత సంపద లభించే సమయంలో ఒకసారి లోపల కూర్చుని ఆత్మవిమర్శ చేసుకుంటూ *“నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా, నిజముగ తెలుపుము మనసా!”* అని అడిగాడు. నీకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవాలి. ఎందుకంటే ఆత్మసాధన, ఆత్మోన్నతి మార్గంలో మనలను మనం మోసం చేసుకోకూడదు.

అసత్యమే ప్రధానంగా ఒక మతం ఏర్పడితే ఆ మతానికి సత్యబలం ఎక్కడి నుంచి వస్తుంది? ఖడ్గం చేత, ధనం చేత, అధికారంచేత గెలువబడిన మతాలు ఎప్పటికీ నిలవవు. సత్యం ఎప్పటికీ చావదు. ఏదైనా చక్కగా అనుభూతి చెంది వెళ్తూ

ఉంటే, ఒక సమగ్రమైన పెరుగుదల వస్తుంది. కాదని ముందుకెళ్తే ఆ కాదన్నవన్నీ మరల అక్కడి నుంచి వస్తాయి. దీనిని భగవద్గీత ఐదవ అధ్యాయంలో కృష్ణుడు ఎప్పుడో చెప్పాడు. భగవద్గీతలో, పతంజలి యోగ శాస్త్రంలో, మహాభారతంలోనూ లేనిది ఈ సృష్టిలో ఎక్కడా చెప్పబడలేదు. క్రమంగా పెరగడానికి, ఆవేశంలో పెరగ డానికి చాలా తేడా ఉంది. ఆకర్షణను దాటటం సులభం కాదు. చాలా కథలలో ఇంద్రుడు చాలా ఇబ్బంది పెట్టినట్టుగా ఉంటుంది. దేవతలు నీ మంచికోసమే అడ్డు పడతారు. భగవంతుని నుంచి దారి మళ్ళకుండా అలా చేస్తారు.

ఆత్మసాధన అంటే అది క్రమబద్ధమైన జీవితం. కట్టు బాటుతో కూడిన జీవితం. ఎలా పడితే అలా ప్రవర్తిస్తూ నాది ఆత్మసాధన అనే భ్రమలో ఉండటం అతి భయంకరం. Let your life be rhythmic, orderly transparent. Why can't it be transparent ? జీవితంలో పారదర్శకత ఉండాలి. యముడు జీవలక్షణములలో మహా లోతుల్లోకి వెళ్ళి చూడగలవాడు. అందుకే చూచి 'వీడు పనికొస్తాడు' అని నిర్ధారణ చేసుకొంటాడు. అందుకే సంతోషంగా నచికేతునితో "నీలాంటి శిష్యుడు మాకు ఎక్కడా దొరకడు" అని చెబుతాడు.

# 9. యమ బోధ

“నచికేతా! నీవు అడిగిన ఆత్మదర్శనం ఎంతో శ్రమతో కూడినది. మరణించిన తరువాత జీవితం ఉందా, లేదా అన్నది నీ ప్రశ్న. ఆత్మ గోప్యమైన చోట నెలకొన్నది. హృద్గుహలో ప్రకాశించేది. దాని ప్రకాశం హృద్గుహలో ఉంటుంది.” గుహ లోతులో దూరంలో ఉంటుంది. గుహ మూలం ఇంకెక్కడో ఉంటుంది.

ఆత్మప్రకాశము హృదయంలో, గుహలో దర్శనం అవుతుంది. ప్రకాశమునకు మూలమైన ఆత్మ మరింత లోతుల్లో వుంటుంది. సద్గురువు ఆశీర్వచనంతో హృదయం చేరి, అటుపైన గుహామూలం చేరి, సమాన, ఉదాన ప్రాణ స్పందన మాధారంగా వ్యాన ప్రాణ స్పందనను చేరితే, ఆత్మదర్శనం అవుతుంది. అంతర్ముఖ ధ్యానం ద్వారానే, ఆత్మ ప్రకాశమున శిష్యుడు స్థిరపడతాడు. అక్కడే సమస్త విద్యలు గురువు అనుగ్రహంతో పొందుతాడు.

ఆత్మ స్వయం ప్రకాశము. లోపల ప్రకాశ మున్నవాడు లోపలే చాలా చదువుకుంటాడు. లోపల చదువుకోవటం వలన,

లోపలికి వెళ్ళిపోవటం వలన లోపలి మనుష్యులు కనిపిస్తారు. వాళ్ళెవరంటే ఇదివరకే ఇంతకు ముందు లోపలికి వెళ్ళిపోయిన వారు. వాళ్ళు మహర్లోకం అవతల జనోలోకంలో ఉంటారు. *'ఓం మహః ఓం జనః'* అంటాము కదా! ఎవరు ఈ జనాలు? మనం కాదు. వాళ్ళు తపస్సులో ఉంటారు. *'ఓగ్ం సత్యం'* అంటే ఏమైంది? నీవు సువర్లోకంలో ఉంటే ఇంకో మహర్లోకం ఉంది. అన్నీ మహత్తులే. దానికి నీవు దొరుకుతావా? నీకు అవి దొరుకుతాయా? అందుకే అది సుదీర్ఘ మైన ప్రయాణం. తరువాత మహర్లోకం నుంచి మనకు బోధలు జరుగుతాయి.

*ఈ సందర్భంలో ఒక ఉదాహరణ :* మనందరికీ ఏదో ఒకసారైనా స్వప్నం వచ్చే ఉంటుంది కదా! స్వప్నంలో ఉన్నట్లు స్వప్నం నిజంలా గోచరిస్తుంది. స్వప్నం నుండి మెలకువ రాగానే "ఆహా! అది స్వప్నమా!" అని భావిస్తాము. స్వప్నంలో ఉన్నప్పుడు స్వప్నమని తెలియదు. మెలకువ వచ్చినప్పుడు స్వప్నం అని మెలకువలో తెలుస్తుంది. ఇక్కడొక ప్రశ్న. ఈ మెలకువ కూడ స్వప్నం ఎందుకు కాకూడదు? నిద్రలో ఈ మెలకువ జీవితం లేదు కదా! పుట్టక ముందు, మరణించిన తరువాత ఈ సంబంధము లేమీ వుండవు కదా! **స్వప్నం ఒక చిన్న కల, ఈ మెలకువ జీవితం ఒక పెద్ద కల.** కాని ఇది కూడా కలే! మరణానంతరం ఈ కల సమాప్తమై అంతకుముందు స్థితి తెలుస్తుంది.

పుట్టక ముందు మనం వుండటంచేతనే తండ్రి ద్వారా తల్లి గర్భంలో ప్రవేశించి, శరీరం కట్టుకొని బయటపడి, మరింత పెరిగి ఈ ప్రపంచంలో సంబంధ బాంధవ్యాలు పెంచుకొని ఇది నిజం అనుకుంటున్నాము. ఇలా పుట్టకముందు కూడ మనం ఉండబట్టే యిలా పుట్టుకొచ్చాము. **పుట్టకముందు ఎలా వున్నాము? ఎక్కడ వున్నాము? ఇప్పుడు యిక్కడికి ఎందుకు వచ్చాము? ఎందుకు వచ్చామో ఆ పనే చేస్తున్నామా? ఈ ప్రశ్నలు ఎప్పుడైనా పుట్టాయా?** *"కశ్చత్వం వా? కుత ఆయాతః, తత్త్వం చింతయ వారం వారః"* అని ఆదిశంకరులు హెచ్చరించారు.

రాబోయే మరణం ద్వారా ఈ నిజం అనుకొనే మెలకువ కూడ స్వప్నమే అని, మరో మెలకువ కారణముగా తెలుస్తుంది. ఆ మెలకువలో జన్మ జన్మల మన కథ తెలుస్తుంది. అది గుర్తు వుంటే పుట్టిన తరువాత ఆ కథనే కొనసాగిస్తావు. లేకపోతే దారి తప్పి ఎక్కడెక్కడో తిరిగి, ఏదేదో చేసి మరల వెనుకకు వస్తావు. అలా జన్మ జన్మల కథ తెలిస్తే అది ఒక ఉత్తమ స్థితి. కాని అది మాత్రము కల కాదని ఎలా చెప్పగలవు? ఏడు లోకాల్లోను ఏడు రకాల కలలు. ఆపైన సత్యం! అదే బ్రహ్మము! అది తెలిస్తేకాని సృష్టి కల, మాయ ఇత్యాదివి తేలవు. అది తెల్చుకోవటమే నచికేతుని ఉద్దేశ్యము. అతి చిన్న కల నుండి ఒక సర్గం (సృష్టి

కాలం) అంతా కలగా దర్శించి, ఆ కలలో తమ పాత్రను పోషించే వారు బ్రహ్మ, ఋషులు. యమధర్మరాజు కూడ ఆ కోవకు చెందినవాడే!

మాస్టర్ సి.వి.వి.గారు లోపల బోధలు చేస్తుంటే మాస్టర్ ఇ.కె.గారు బయటికి రాసేశారు. ఆ రెండు పుస్తకాలు "స్పిరిచ్యువల్ అస్ట్రాలజీ, స్పిరిచ్యువల్ సైకాలజీ". అవి మానవ మేధస్సులో పుట్టిన పుస్తకాలు కావు. అందుకే ఆయన రాసేశారు అక్కడే, "These are from those whom I follow to those who follow me" అని ఒకటి రాశారు. మరొకటి "These are from higher circle" అని రాశారు. ఆ తరువాత ఆయన మాట్లాడలేదు. మాస్టర్ ఇ.కె.గారి ఫొటోలు ఎక్కడ పడితే అక్కడ పెడతారు కాని ఆయనను అనుసరిస్తున్నారా? "If you are follower of Master E.K., follow the path that he follows. Then you are a follower. If not, you are not." ఆ దీపం తెచ్చి మన ఇంట్లో పెట్టుకొని మన పనులన్నీ చేసుకుంటున్నాము. అప్పుడప్పుడూ మాస్టర్ అంటూ ఉంటాము.

సత్యానికి అర్హుడైన గురువు నుండి విని, విచారణ చేసి సత్యం తెలుసుకోవాలి. అప్పుడు ఆయన లోపల కనిపిస్తాడు. నీవు లోపలికి వస్తే చెబుతాడు. నీవు లోపలికి రావాలి కాని, ఆయన బయటికి వచ్చి చెప్పడు. నీవు గుహలోకి వచ్చి కూర్చున్న తరువాత ఆయన వస్తాడు. టీచర్ రావడానికి ముందే విద్యార్థి

వచ్చి కూర్చోవాలి. అది నీలోని శ్రద్ధ. అది సంప్రదాయం. ఆయన వచ్చి ఆశీర్వచనం చేసి, కుశల ప్రశ్నలు వేసి కొంత పాఠం చెప్పి వెళ్ళిపోతాడు. నీవేం మాట్లాడటానికి వీల్లేదు. ఆయన చెప్పింది వినటం, గుర్తుంటే గుర్తు పెట్టుకోవడం. అంతే కాని మళ్ళీ ఎప్పుడు వస్తారు అనటానికి వీలులేదు. అక్కడి కథ వేరుగా ఉంటుంది. వినగానే అందరికీ చెప్పకూడదు. విని, విచారణ చేసి, ఆ తరువాత ఆచరించి తెలుసుకోవాలి. ఆ బోధనలు శరీరానికి సంబంధించి నవి కావు. విదేహస్థితిలో వినబడే విషయాలు. అవి ఈ లోకానికి సంబంధించినవి కూడా కావు. దేవతలుకాని, అమ్మవారు కాని, సద్గురువు కాని ఆ హిరణ్యప్రాకారం దాటి రారు. నీవు అక్కడికి వెళ్తే వాళ్ళు కనిపిస్తారు. దిగి రాగల అవకాశం సద్గురువుకు వుంది. బ్రహ్మము దగ్గరనుండి మనదాకా తిరగగలడు.

"నచికేతా! ఆ మార్గం నీకు తెరువబడినట్లు భావిస్తున్నాను. నీకు కనిపిస్తోందా?" అంటే కనిపిస్తోంది గురువుగారూ! అన్నాడు. అక్కడ నుంచి ఏదో కాంతి ఇక్కడ పడుతుంటే ఇదంతా బంగారు రంగుగా కనిపిస్తుంది. ఆ కాంతి ఎక్కడి నుండి వస్తోంది? అని దానిని వెంబడిస్తూ ఉంటాడు. అది అన్వేషకుడు. ఆత్మ చేతనే ఆత్మ ఆకర్షింపబడుతుందని, లోపలికి వెళ్ళిన తరువాత నీకుండే తపన వలన ఒక ఆకర్షణ పుడుతుంది. వెలుగుదారిని 'చిత్రిణి'

అన్నారు. ఆ బంగారుకాంతి మనలోని సుషుమ్నలో ఉంటుంది. అది మనకు లోపల దర్శనమిస్తుంది. భారతంలో ఒక కథ వుంది. ఒక శిష్యుడు పుల్లలు ఏరుకుంటూ బావిలో పడిపోతాడు. రాత్రి అయినా ఇంటికి రాడు. గురువు ఉదయం వెళ్ళి అడవిలో వెదకితే బావిలో ఉంటాడు. పనిచేస్తూ ఉంటే జిల్లేడు పాలు కంట్లో పడినాయని చెబుతాడు. ఆ గురువు 'సరే పైకి రా!' అన్నాడు. గురువాక్యం పట్టుకొని పైకి వస్తాడు. అదే యోగం!

ఈ యోగమే ఉపమన్యుని కథగా, అశ్వినీ దేవతల స్తోత్రంగా, వేదవ్యాస మహర్షిచే అద్భుతంగా భారతంలో అందించ బడింది. యోగోపదేశం చేసినవాడు ధౌమ్యుడనే మహర్షి. అందుకనే "గురువుకన్నా అధికుడైనవాడు భూమిపై లేడు, దేవతా లోకంలో కూడ లేడు" అని పరాశర మహర్షి మైత్రేయునికి బోధిస్తాడు. గురువందించే అమూల్యమగు విషయం దైవం కూడ యివ్వలేడని తెలియాలి. గురువు ఆగ్రహిస్తే దైవం కూడ మిన్నక వుంటాడు. దైవం ఆగ్రహిస్తే గురువు నిగ్రహించగలడు. *(మాస్టర్ కె.పి.కె. గారి 'అశ్వినీ దేవతా స్తోత్ర వివరణ' కూడ త్వరలో ఒక పుస్తకంగా వెలువడనున్నది.)*

ఒక శిష్యుడు బుద్ధుని చూద్దామని బయలుదేరితే వాడికి దారిలో ఒక బంగారపు తీగ పైకి పాకుతున్నట్లుగా కనిపిస్తుంది.

అడవిలో వెళ్తుంటే సాలెగూడు దారాలమీద సూర్యకాంతి పడి రకరకాల కాంతిలో కనిపిస్తాయి. వాడు ముట్టుకుని చూస్తాడు. ముట్టుకుంటే చేతికంటదు. బుద్ధునితో మహిమ చూపిస్తే నమ్మితా నంటాడు. అందుకు బుద్ధుడు “నీకు దారిలో బంగారు తీగ కనిపించింది  కదా? దాని గురించి ఏమనుకుంటున్నావు?” అని అడిగినపుడు శిష్యుడికి ఆశ్చర్యం కలుగుతుంది. బుద్ధుడు ‘అది నా నుంచి వచ్చిన కాంతి’ అని చెబుతాడు. ఆ శిష్యుడు ‘నేను మీ దగ్గర శిష్యుడిగా చేరతాను’ అంటే  బుద్ధుడు “వద్దు, నీవు నన్ను గురువుగా ఎన్నుకున్నప్పటికీ, నేను నిన్ను శిష్యుడిగా ఎన్ను కోలేదు” అన్నాడు. కారణమేమంటే **మహిమ కోరేవాడికెప్పుడూ మార్గం చూపకూడదు. కేవలం ఆత్మదర్శనమందు ఆసక్తి గలవాడే నన్ను అనుసరించగలడు.**

“ఎందుకోసం అన్ని తపస్సులు అనుష్ఠింపబడుతున్నాయో, ఏది కోరి బ్రహ్మచారివ్రతాన్ని పాటిస్తున్నారో ఆ లక్ష్యాన్ని పొందడానికి మంత్రాన్ని ఉపదేశిస్తున్నాను. అది ‘ఓం’కారం.” అదే యముడి మంత్రోపదేశం.

ఏ మంత్రం ద్వారా ఆత్మదర్శనం పొందగలమో ఆ మంత్రం గురించి మనకు ఏమీ తెలియదు. ఓంకారాన్ని మించిన మంత్రం లేదు. *‘ఓంకార బిందు సంయుక్తం నిత్యం ధ్యాయంతి యోగినః’*

యోగులు కూడ రోజూ ఓంకారాన్ని ధ్యానం చేస్తారు. వాళ్ళు లేవగానే ఓంకారంతో అనుసంధానం చెందుతారు.

**ఓంకారం అనటం కాదు వినటమే!** 'భగవద్గీత' అక్షర పరబ్రహ్మ యోగము'లో కృష్ణుడు 'అనుస్మర' అంటాడు. ఓంకార మును అనుస్మరణము చేయమంటాడు. ఎందుకంటే 'ఓం' అని ఒకసారి ఉచ్చరించి హృదయగుహలో నుండి వింటే అక్కడి నుండి కూడ 'ఓం' అని వినబడుతుంది. నీవు అనకపోయినా నీకు వినబడుతుంది. **దానిని విని అనడం ఋషి సంప్రదాయం, యోగ సంప్రదాయం.** 'అంటూ వినడం' అనేది సాధన. ఓం అన్నప్పుడు చేతన ప్రజ్ఞ మొత్తం లోపల మూతలా వున్న దానిని కొడుతూ వుంటుంది. ఎందుకంటే ఆత్మ లోపల లేదు. అది లోపల, బయట ఉంటుంది. నీవు కూడ లోపలా వున్నావు, బయట కూడా వున్నావు. *'అంతర్ బహిశ్చ'* అన్నారు కదా! ఆత్మలో నీకు కనబడే శరీరమంతా ఉంది. ఓంకారము చేత ధరింపబడియున్న ఈ పొరలతో కూడినటువంటి శరీరమంతా కూడా ఆత్మనే. ఆ ఓంకారమే నిన్ను బ్రహ్మవరకూ తీసుకువెళ్తుంది. క్రమశిక్షణ ద్వారా రావలసిన ఒక్కొక్క మార్పు లోపల వస్తుంటే లోపల ఓంకారము వినబడుతుంది. అది జలపాతంలాగా వినిపిస్తుంది. అది బ్రహ్మ రంధ్రములో ఉండే సుషుమ్న నాడిలో అయ్యే శబ్దము. అనాహత

శబ్దము అంటే అదే. అది హృదయం నుండి వినిపిస్తుంది కాబట్టి ఈ హృదయాన్ని 'అనాహత కేంద్రము' అంటారు.

ఆ అనాహత కేంద్రము దగ్గర వినిపించే ఓంకారాన్ని పట్టుకొని వెళ్ళడమే మార్గం! అది హృదయం చేరేసరికి సూక్ష్మ స్పందనగా ఉంటుంది. సూక్ష్మస్పందనగా ఉండి అది క్రమంగా ఓంకారము చేసినపుడు అలా పక్షిలా పైకి ఎగురుతూ వస్తూ ఉంటుంది. అది క్రమంగా కంఠం దగ్గర, ఆ తరువాత అంగిట్లో చేరి కొండనాలుకపైన వినిపిస్తూ ఉంటుంది. అదేమిటంటే స్పందన. అది సోహంలా కాకుండా ఓంగా వినిపిస్తుంది. అచ్చులు పడిపోతాయి. ఎప్పుడు సూక్ష్మంలోకి వెళ్ళిందో అప్పుడు హల్లు అయిన 'స' పోయి 'ఓ' మిగులుతుంది. 'హం'లో 'హ' పోయి 'మ్' మిగులుతుంది. అది 'ఓమ్' అవుతుంది. ఆ ఓంకారమే తీసుకెళ్తుంది. దీనికే మనకు ఉదానవాయువు అనే ప్రాణవాయువు సహకరిస్తుంది.

**'ఉద్వాహ' అనేది ఒక మరుత్తు, ఉదాన అనేది వాయువు. అంతకు ముందు హృదయగుహ చేరేసరికి సమాన అనే వాయువు అంతకుముందు ప్రాణ, అపాన, ప్రవాహ, నిర్వాహ మరుత్తులు సాయపడి ఆ ప్రజ్ఞ ఆ అనాహత శబ్దం పట్టుకొని మరుత్తు వెళ్తుంది.** *(మాస్టర్ కె.పి.కె.గారు ప్రవచించిన 'సప్తమరుత్తుల' వివరణం,*

*'ప్రాణాయామ' వివరణంలో ఈ విషయాలు సంపూర్ణంగా లభిస్తాయి.)* **ఆ శబ్దం క్రమంగా ముక్కు, లోపల దానికి సంబంధించిన నాళము, ఇందులో నుండి వెళ్ళి, ఈ భ్రూమధ్యంలో ఉంటుంది.** అది ఒక అనిర్వచనీయమైన, స్పందనాత్మకమైన స్పర్శ. జీవుడు దానిని అనుభవిస్తూ తపస్సు పెంచుతాడు. అప్పుడు ఒక 72 నిముషాలుగా వున్న తపస్సు 3 × 72గా అయిపోతుంది. ఆ తరువాత ఎప్పుడు ఖాళీ ఉంటే అప్పుడు ఓంకారాన్ని స్మరిస్తాడు. ఉచ్చరించడు. ఎన్ని పనులు చేసుకుంటున్నా అనుస్మరణ చేస్తుంటాడు. దీనినే కృష్ణుడు 'భగవద్గీత' అక్షర పరబ్రహ్మ యోగంలో చెప్పాడు.

'నీ దగ్గర ఎప్పుడూ భగవద్గీత ఉండాలి' అంటారు పరమ గురువులు. వాళ్ళు ఉదయం లేవగానే నమస్కరించేది భగవద్గీతకే. భూమ్మీద అన్ని పర్వత శ్రేణులలో ఉన్న గుహలలో ఆశ్రమా లున్నాయి. వాటిలో కొన్ని నేను చూశాను. భగవద్గీతకు ప్రచారం అవసరం లేదు. ప్రచారం చేసినప్పటికీ సముద్రం మీద వంతెన కట్టటానికి ఉడుత చేసిన సహాయంలాంటిది. దానికి ఆచరణ కావాలి. గీతను అడ్డం పెట్టుకొని మనం అపచారాలు చేస్తూ ఉంటే విదేశీయులు దానిని మతగ్రంథం అంటున్నారు. భగవద్గీత మానవజాతి నరజాతిగ ఉద్ధరింపబడటానికి, అనుగ్రహింపబడ్డ పరిపూర్ణ యోగశాస్త్రము. అది ఉపనిషత్తుకూడ. బ్రహ్మాముని చేర్చు సూత్రము మరియు మార్గము.

ఓంకారాన్ని అనుస్మరణ చేస్తే అది నీలో ఉన్నట్లు తెలుస్తుంది. లోపల లేని దేవుడు లేడు, దేవత లేదు. మానవ శరీరంలో సృష్టిలో ఉండే సమస్త ప్రజ్ఞలు, దేవతా ప్రజ్ఞలున్నాయి. వాటితోపాటు దైత్య ప్రజ్ఞలు కూడా ఉన్నాయి. దితి సంతతి, అదితి సంతతి, దానవ సంతతి ఉంది. పాములున్నాయి, గరుడుడు కూడా ఉన్నాడు. అందువలన ఓంకారం లేని పూజ, జపం, మంత్రం, క్రతువు వ్యర్థము. అన్నీ ఓంకారముతో ముడిపడి ఉన్నాయి. నీవు లోపల దేనిని ఆరాధిస్తున్నావో కనులు మూసుకోగానే అది స్మరణకు రావాలి. అలా ఎప్పుడూ స్మరిస్తూ ఉంటే ఆ ఓంకారమే నీకు దారి చూపించి ఊర్ధ్వగతికి తీసుకెళ్ళి నిన్ను బయటకు కూడా తీసుకొస్తుంది. వీటికి కొన్ని కూడలిలు ఉంటాయి. నీ సాధనను బట్టి ముందుకెళ్ళటమో, అక్కడే ఉండటమో లేదా క్రిందకు రావటమో జరుగుతుంది. అలా నీలోని తపనను బట్టి తపస్సు పెరుగుతుంది. ధర్మము, అధర్మము, కార్యము, కారణము, భూతకాలం, భవిష్యత్కాలం మొదలగువాటి నుండి భిన్నమైనదిగా నీవు చూస్తున్నది ఓంకారమే ! 'ఓం' అనే ధ్వనియే జీవుల కాలంబనము. ఏకాలంబనము. ఆలంబన మది ఒక్కటే. ఓంకారమే పరమాత్మ – జీవాత్మల అనుబంధం. "అది ఒక్కటే ఆలంబనం, అది ఒక్కటే ఆలంబనం" అని యమదేవుడు నచికేతునికి నొక్కి నొక్కి చెప్తాడు. ఇహ పరములను అనుసంధానం

గావించేది కూడ ఓంకారమే అని తెలుపుతాడు. "ఓం ఇతి ఏతత్" అని అనేకమార్లు నచికేతునికి తెలుపుతాడు. హృదయ గుహలోని వెలుగుదారికి ఆధారం ఆ అనాహత నాదమే అని తెలుపుతాడు. "నచికేతా! అది నీకు కనపడుతోందా? వినబడుతోందా?" అని ఆప్యాయతతో, వాత్సల్యంతో తెలుపుతూనే దాని దర్శనం అనుగ్రహిస్తాడు.

సద్గురువులోని విశేషం ఏమిటంటే, భాషిస్తూనే శిష్యుని యందు వికాసం కల్గిస్తాడు. అతడి భాషణం కేవలం సమాచార ప్రసారం కాదు. భక్తి శ్రద్ధలు గల శిష్యుని యందు గురుబోధ అనేక విధములైన చైతన్యావిష్కరణలు నిర్వర్తిస్తూ వుంటుంది. అతని వచనం, ప్రవచనమే!

ద్వాపరయుగం చివరలో భయంకర యుద్ధం జరిగింది కదా! ఆ అస్త్రాలన్నీ మంత్రాలే. వాళ్ళకు మంత్రాలిస్తే పాడుచేశారు. అట్లాంటిక్ నాగరికతలో కూడ మంత్రాలతో ధ్వంసం చేసుకున్నారు. ఆ తరువాత ఆర్యజాతి. అట్లాంటియన్స్ మనమే. ముందు లెమోరియన్స్‌గా పసిఫిక్ సముద్రంలో ఉండేవాళ్ళం. అప్పుడు అక్కడ భూమి ఉండేది. అది మునిగాక ఇక్కడ తేలాము. అట్లాంటియన్లుగా ఉన్నప్పుడు కూడా కొట్టుకున్నాము. మానవ జాతికి పోట్లాడటంలో అందులోనూ ఆంధ్రజాతిని మించినవారు

లేరు. కలియుగంలో ఓంకారం మాత్రముంచి యితర మంత్రాల లోని బలమంతా తీసేశారు. ఓంకారాన్ని అనుస్మరణ చేస్తూ ఉంటే, తెలుసుకుంటే కోరినది లభిస్తుంది. ఓంకారం చేయలేనిది ఏదీ లేదు. గణపతి పూజ సర్వశుభప్రదము. ఎందుకంటే అది ఓంకారానికి పూజ. శ్రీకృష్ణుడిచ్చిన మంత్రము కూడ 'ఓం'. 'ఓం తత్ సత్' అని తెలిపాడు. అంటే ఓంకారమే. 'అది' – అంటే ఆత్మ. ఓంకారమే సత్యం!

ఆత్మ పుట్టేదీ కాదు, పోయేదీ కాదు. జీవాత్మలు ఎప్పుడూ ఉంటాయి. ప్రళయం అంటే పరమాత్మలో కలిసిపోయి ఉంటాయి. దానినే లయం అంటారు. మళ్ళీ సృష్టిలో పరమాత్మనుంచే జీవులు బయటికి వస్తాయి. జీవుల వలన, జీవుల కొరకు మళ్ళీ సృష్టింప బడతాయి. కొందరు ఈ 'విశ్వ'విద్యాలయంలో కొన్నాళ్ళు చదివి పరమపదాన్ని చేరుకుంటారు. వాళ్ళు తిరిగివచ్చేటప్పుడు మళ్ళీ తెలిసిన వాళ్ళుగా దిగివచ్చి తెలియని వాళ్ళను నేర్చుకోవటానికి ఆయా నిర్ణయాల ప్రకారం గురువులుగా, పాలకులుగా ఏర్పాటై సంరక్షించుకుంటూ వుంటారు. ఈ కల్పాలన్నీ జీవులకొరకే జరుగు తుంటాయి. వాటి సమయం అయిపోయిన తరువాత దాన్ని మూసేస్తారు. మూసినప్పుడు జీవులు లోపలికి వెళ్ళిపోతారు, కాని ఉంటారు. జీవులు కూడా సనాతనులే. 'దేహో దేవాలయః ప్రోక్తో

జీవో దేవ స్సనాతనః' అన్నట్లుగా జీవుడు, దేవుడు ఎప్పుడూ ఉండేవారు. అతడు స్పందనాత్మక చైతన్యం. అందులో చేరవచ్చు, అందులోకి వెళ్ళి మళ్ళీ బయటకు రావచ్చు లేదా అందులోనే ఉండిపోవచ్చు. లేదా ఆ పరమాత్మ సంకల్పిస్తే వచ్చి శ్రేయో దాయకమైన కార్యములకు అనుసంధానం చెంది ముక్తజీవులు కావచ్చు. కొందరికి ప్రచోదనం కలిగించవచ్చు. అలా ఉన్న వాళ్ళు అందరూ సంకల్పమాత్రం చేత మళ్ళీ పరమపదం చేరుకో గలిగి ఉంటారు. ఇదెలా వుంటుందంటే ఒక కాలేజీలో చదివిన విద్యార్థి ఆ కాలేజీలోనే లెక్చరర్ అవడంలా ఉంటుంది.

ఆత్మ జనించడం లేదు, మరణించడమూ లేదు. దీని చుట్టూ ప్రకృతి అల్లిక చేస్తుంటుంది. శరీరం నశించినా ఆత్మ నశించనిది. మరి ఇదే ఆత్మ మనమైనప్పుడు మనకెందుకు ఈ అవస్థలన్నీ? అంటే ఇదే అవిచ్ఛిన్నమైన ఆత్మ ఇన్ని లోకాలలోకి దిగివచ్చి తనను తాను మరచిపోతుంది. అంటే తనకు తానే అజ్ఞానం చేత విచ్ఛిన్నం అవుతాడు. ఈ క్రమం తెలిస్తే మనకు చావు లేదని తెలుస్తుంది.

మృత్యువు లేనప్పుడు నీవు ఇలా అవతరణం చెందుతూ పదార్థం లోకి దిగివచ్చి, పదార్థంతో అనుసంధానం ఏర్పరచు కున్నప్పుడు ఆ పదార్థం నుండి విడిపడ్డప్పుడు నీకు బాధగా అనిపిస్తుంది. ఎందుకంటే పదార్థంతో ఆకర్షింపబడ్డ నీ చేతన

దానితో ముడిపడి ఉంటుంది. అది వికర్షణ కలిగితే వెంటనే దానిలో నుంచి విడిపడి వచ్చేస్తుంటాడు. ప్రకృతికి ఎనిమిది ఆవరణలు ఉంటాయి. అటుపైన తొమ్మిదవది పరాప్రకృతి ఉంటుంది. ఈ ఎనిమిదింటిలో ఎక్కడైనా ఆకర్షింపబడవచ్చు. సత్యమెరిగినవాడు, తన నిజస్వరూపము తెలిసినవాడు అందులోనే ఉంటూ, అంటకుండా 'తామరాకు మీద నీటిబొట్టులా' వుంటాడు. యోగులు అన్ని లోకాలలోనూ అంటి–అంటక ఉంటారు. దీనికి ఉదాహరణ శ్రీకృష్ణుడే. ఆయన చెయ్యని పని లేదు, చేసిన పని లేదు. ఆయుధం పట్టలేదు. ఎవరినీ చంపలేదు, కాని యుద్ధం చేసింది ఆయనే. నా నుండి వచ్చిన త్రిగుణములనుండి వచ్చిన ప్రకృతిలో నేను ఇమడటం లేదంటాడు శ్రీకృష్ణుడు. కాని మనం మన భావాలలోనే ఇమిడి ఉంటాము. నీ చేతన వాటిలో ఉండటం వల్ల వాటికేమైనా అయితే నీకే అని భావిస్తావు. అందుకే కృష్ణుడు *'యోగోనష్ట పరంతపః'* అన్నాడు. నేను సూర్యునికి చెప్పాను. సూర్యుడు మనువుకి చెప్పాడు. ఆ మనువు ఇక్ష్వాకువుకు చెప్పాడు. అక్కడి నుండి యోగం అలా పతనం చెందింది.

శరీరం మనకు ప్రకృతి ఏర్పరచిన సౌకర్యము. దానికి జబ్బు చేస్తే అది శరీరానికే, అది నిన్నేం చెయ్యదు. నీవు నీవుగానే ఉండు. *'యద్భావం తద్భవతి'*. అదెప్పుడు తెలుస్తుందంటే నీవు

వేరు, నీ ప్రకృతి వేరు. You are the major contributor to your sickness. By your own energy relating to thought of sickness. That will entertain in you. ఆ దృష్టిని ఏర్పరచుకోవాలి అన్నట్లుగా ఉంటుంది. ఎప్పటికీ శాశ్వతంగా ఉండేది. శరీరం నుండి విడివడి ప్రజ్ఞా స్వరూపుడే వెళ్ళేది. ఓంకారం పట్టుకొని వెళ్తుంటే ఆ సమయంలో దానిలో ఉన్నామని తెలుస్తుంది. ప్రకృతి ఎన్నాళ్ళు ఉంచితే అన్నాళ్ళుంటావు. పనికొచ్చేదాకా ఉండాలి. ఆ తరువాత ఉండకూడదు.

**ఎవడైనా చచ్చిపోతే వాడు అక్కడే ఆ చుట్టుపక్కల ఉంటాడు. వాడి మీద దృష్టి ఉంచాలి కాని శవం మీద కాదు.** వాడు చచ్చి పోయాడు అనడం కంటే వాడు వెళ్ళిపోయాడంటారు. ఎక్కడికి? ఎక్కడికీ పోడు. తెలిసినచోట్ల తిరుగుతూ ఉంటాడు. ఎవరిని పలకరించినా వారు పలకరు, ఎందుకంటే వాడికి నోరు లేదు. చచ్చిన తరువాత అరుస్తున్నా ఎవరికీ వినబడదు. దస్తావేజులు వెదికే కొడుకును చూసి బాధపడుతుంటాడు. చనిపోయిన తరువాత మొదటి పదిరోజులు అక్కడే ఉంటాడు. మళ్ళీ ఒక సంకల్పం చేసుకొని వీలుంటే ఆ కుటుంబంలోకే వచ్చేద్దా మను కుంటాడు. వాడికుండే పరిపక్వతను బట్టి మళ్ళీ ఎక్కడ పుట్టాలో నిర్ణయించుకుంటాడు.

పరిపూర్ణుడైతే పుట్టే అవసరం లేదు. 'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' అన్నాడు. ప్రసంగాల వలనో, పాండిత్యాల వలనో, అనేక విషయాలు ఆలకించడం వలనో 'ఆత్మను పొందలేము'. ఆత్మ విచారణ చేస్తే, ఆత్మ విచారణే మిగులుతుంది. దానికి మార్గ ముంది. ఆ మార్గంలో పయనించడం ఇచ్చారు. ఆ మార్గంలో పయనిస్తే ఆత్మ స్వరూప స్వభావాలు తెలియటమే కాకుండా 'నేనే ఆత్మను' అని తెలుస్తుంది. అది తెలియటమే ముఖ్యం. ఆ మార్గమే ఓంకార అనుస్మరణము. యముడు చేసిన బోధ, శ్రీకృష్ణుడు చేసిన బోధ ఒక్కటే– 'ఓంకార అనుస్మరణము.'

# 10. అంగుష్ఠమాత్ర పురుషుడు

**క**ఠోపనిషత్తు యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమంటే ఈ క్షరమైనటువంటి శరీరములో అక్షరమైన పురుషుడు ఏర్పడాలి. దానిని నేనే ఏర్పరుస్తానని మాస్టర్ సి.వి.వి.గారు వాగ్దానం చేశారు. ఆ శరీరాన్ని మనమే తయారు చేసుకోవాలి. దాని కోసమే సమస్త సాధనలు. భగవద్గీతలో చెప్పబడిన, శాశ్వతమైన జీవి స్వరూపాన్ని కఠోపనిషత్తులో అంగుష్ఠమాత్ర పురుషుడని చెప్తారు. అందువలన కఠ ఉపనిషత్తు ఆరు భాగాలలో ఉంటుంది. మూడు, మూడు, మూడు భాగాలుగా ఉన్నాయి. వీటన్నిటిని ప్రతి రోజూ వివరించుకోవాలి. 'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' అన్నట్లుగా ఒక్కొక్క శ్లోకం వివరించుకుంటే ఆకళింపు, అవగాహన పెరుగు తుంది. ఉపనిషత్తుకు, వినేవాళ్ళకు మోసం జరగకూడదు. ఎన్ని ప్రవచనాలు విన్నప్పటికీ సాధన చేస్తేనే ఆత్మను పొందగలము. మనం విన్నది మన లోపలికి వెళ్ళి, మార్పు జరగాలంటే సాధన చేయాలి. దానికి తిండి, నిద్ర నీ వశంలో వుండాలి.

అలా శరీరం మన మాట విన నప్పుడు దానిని వదలి

వేయాలి. ఉదయం నాలుగింటికి లేవనివాడు యోగానికి పనికి రాడు అని నిర్ణయించుకోవాలి. యోగం చెయ్యాలని కమిట్ కావాలి. కడుపులో ఉన్నపుడే దండం పెట్టుకొని ఆ తరువాత మరచిపోయావు. కుయ్యో, మొర్రో అని బాధపడుతుంటే ఒక వెలుగు వచ్చి నీకు ఉపశమనం ఇచ్చి, ఆ వెలుగు నీలోకి రావటం వలన తల్లికి నొప్పులు రావటం, నీవు బయటికి రావటం జరుగు తుంది. మళ్ళీ ఇందులోకి రాను అని చెప్పి, దానికి కార్యక్రమం చేబట్టుతాను అని లెంపలు వేసుకున్నట్లుగా ఉంటాడు లోపల. కాని బయటికి రాగానే మరచిపోతాడు. అందుకే 'మరపే మృత్యువు' అన్నాడు సనత్సుజాతుడు. లోపల ఉన్నవాడిని చూస్తుంటే ఆకలి, దాహం అనిపించకూడదు. అలా నెలల తరబడి ఉన్న వాళ్ళున్నారు. ఒక ఉత్తమ ఆశయంకోసం పని చేస్తున్నప్పుడు అన్నీ నీకు సహకరిస్తాయి. అలాంటి అగ్ని పుట్టాలి. ఆ తపన అనే అగ్నియే తపస్సు. మనిషికి ఆత్మాభిమానం ఉంటే అది సాధించేవరకూ I don't care for food. I don't care for anything... అది సాధించిన తరువాత you never have to fear it takes care for itself. అన్నీ అప్రయత్నంగానే జరిగిపోతాయి. అప్రయత్నంగా జరిగే వాటిలో శ్రద్ధ చూపేవాడు మూర్ఖుడు.

ముండకోపనిషత్తులో "మొట్టమొదట ప్రయత్నం చేయ వలసినది మాని, అప్రయత్నంగా జరిగే వాటికోసం మానవుడు

ప్రయత్నిస్తే అలా జన్మపరంపరలో ఇరుక్కుపోతాడు" అని వ్రాయ బడింది. శరీరపోషణ కూడా ముప్పై ఐదేళ్ళ వయస్సుకు అయిపోవాలి. అక్కడినుండి ప్రయత్నము అటువైపుకు మారాలి. ఆ తరువాత పధ్నాలుగేళ్ళు రెండింటినీ సమతులనం చేయాలి. ఆ తరువాత నలభై తొమ్మిది ఏళ్ళ నుండి అటు ఎక్కువగా సాధన ఉండాలి. తానంతట తానే నడచి వచ్చే దాని వెంబడి నీడలా మనం వెంటపడుతుంటే నీడ వెంట పరుగెత్తినట్లే. కాని నీవు సూర్యుని వెంట పరుగెడుతూ ఉంటే నీ వెంట ఏది వస్తుంది! ఏది చేయటంవలన నీవు అన్ని విధాలుగా కడతేరుతావో అది చేయాలి తప్ప, ఏవేవో చేసుకుంటూ ఉండకూడదు. సాధన అన్నది ఒక తపన. అది ఉన్న వాడికే అది వస్తుంది. సత్కార్యాలు నడవటానికి ఎన్నో సాకులు. ఉద్యోగమంటే వృత్తి యోగమునకు అనుపానముగా పనిచేసేదది. జీవితంలో తెగువ లేనివాళ్ళకి ఏ పనీ కాదు. మన లోపలి ఆలోచన పవిత్రమైతే నష్టం వచ్చే అవకాశాలు తక్కువ.

దుష్ప్రవర్తన నుండి వైదొలగనివారు అంటే ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో మడతలు పెట్టేవారు. ఇంద్రియ నిగ్రహం లేనినాడు వీరందరికి ఏకాగ్రత ఉండదు. ఒకసారి పాఠం చదివితే జన్మంతా నిలబడాలి. వాడే ఏకసంథాగ్రాహి. ఏ పనిమీద ఉన్నావో ఆ పనిమీదే ఉండాలి. మనసులోని ఉద్రిక్తతలు ఉపశ

మించనివాడు ఎంత చదివినా వ్యర్థమే. జ్ఞానం, భుజబలం రెండూ ఎవరికి ఆహారంగా ఉన్నదో, మరణం ఎవరికి ఊరగాయ మాత్రంగా ఉన్నదో *(రసోప్యస్య)* వాడు అది ఎటువంటిదో తెలుసు కుంటాడు. మనలో ఇద్దరున్నారు, కాదు ముగ్గురున్నారు. జీవితం అనే వృక్షంమీద రెండు పిట్ట లున్నాయట. ఒక పిట్ట తింటూ వుంటే మరొక పిట్ట ఆనందిస్తుంది. పిట్టలో పిట్ట ఉందని చెబుతారు. చిన్నపిల్లలు తింటూ ఆనందిస్తుంటే పెద్దవాళ్ళు కూడా ఆనందించటం లేదా? అలాగే తన నుండి పుట్టిన శరీరం అవి ఇవి తింటూ ఉంటే లోపలున్నవాడు చూసి ఆనందిస్తూ ఉంటా డట. ఆ అనుభూతి తెలిస్తే, కర్మసన్యాసయోగం వచ్చినట్టు. చేయి కలుపుతుంది. కన్ను చూస్తుంది. నాలుక రుచి చూస్తుంది. అయితే ఆనందం పొందేదెవరు? మనసు. ఆ మనస్సు పొందే ఆనందాన్ని గమనించేవాడు ఆత్మ! దానిని అభ్యాసం చేయమని శ్రీకృష్ణుడు చెబుతాడు. ఇంద్రియాలు, శరీరంతో మనస్సు పని చేస్తుంటే బుద్ధితో కూడిన నీవు బుద్ధి ఆధారంగా దానిని చూస్తూ ఉండాలి. ఇది సాధన. కర్మసన్యాస యోగాన్ని అభ్యాసం చేయాలి.

కొత్తగా కారు నడిపేటప్పుడు మనస్సు, ఇంద్రియాలు అన్నీ నడుపుతూ ఉంటాయి. కొంత అలవాటయ్యాక పక్కవాడితో మాట్లాడుతూ కూడ నడపగలం. మనం కబుర్లలో ఉంటే మనస్సు

కారు నడుపుతుంది. సక్కుబాయి కూడ తానుగా కాక మనసుగా పనిచేసి బస్తా గోధుమలు విసిరింది. అలా మనసు దైవం మీద లగ్నం చేసి జీవించే వారికి ఈ బాహ్య జీవితం అప్రయత్నంగా జరిగిపోతుంది.

శరీరంలోవున్న సూక్ష్మమైన హృద్గుహలో ప్రవేశించిన వారు మహాత్ములు. మనలో ముగ్గురున్నాము. క్షరపురుషులుగ మానవు లున్నారు. వారి కాధారముగ అక్షర పురుషు లున్నారు. అక్షరుల కాధారంగ పురుషోత్తము డున్నాడు. క్షరపురుషులుగ ప్రతి జన్మమునకు ఒక రూపము, ఒక నామము, స్థితిగతులు కలిగి అదే తాముగ భావిస్తూ, మరణిస్తూ వుండేవారున్నారు. వీరికి తమ జన్మజన్మల కథ తెలియదు. ఏ జన్మకాజన్మయే కొత్తగ వుంటుంది. మానవులంతా ఎక్కువగ క్షరపురుషులే. కొందరు అక్షర పురుషు లున్నారు. వీరికి దేహములు మారినా, వారెవరో వారికి ఎప్పుడూ గుర్తు వుంటుంది. ఋషులు, యోగులు అట్టి వారు. వీరు చిరంజీవులు. దేహములు మారినా తమకు తాము తెలిసి వుంటారు. వారి పూర్వజన్మలు వారికి తెలిసి వుంటాయి. ఈ జన్మలో ఏం చేయాలో తెలిసి వుంటారు. వీరు సూక్ష్మ శరీరాలను సాధించుకొని, అవసరమును బట్టి భౌతిక శరీరం ధరిస్తూ వుంటారు. క్షర పురుషులకు, అక్షర పురుషులకు ఆధారంగా పురుషోత్తము డున్నాడు. అతడే ఈశ్వరుడు.

ఈ ముగ్గురిలో ఈశ్వరుడు, అక్షర పురుషుడు శాశ్వతులు. క్షర పురుషుడు జన్మిస్తూ, మరణిస్తూ వుంటాడు. ఇపుడీ కఠ ఉపనిషత్తులో యమదేవుడు తెలిపే విషయం ఏమిటంటే, ముందు క్షర పురుషుడు అక్షరుడుగ ఏర్పడాలి. పురుషోత్తముడితో కూడి వుండాలి. అలా శాశ్వతంగా వుండవచ్చు లేదా పురుషోత్తమునిలో లీనం కావచ్చు. క్షర పురుషుడు పాలవంటి వాడైతే, అక్షర పురుషుడు అందుండి తయారు చేయబడిన వెన్నవంటివాడు. ఈ అక్షరుడినే అంగుష్ఠమాత్ర పురుషు డంటారు. అంటే, బొటన వ్రేలంత రూపంలో దేదీప్యమానంగా వెలుగుతూ వుంటాడు. అది సూక్ష్మరూపం. కాంతివంతమైన రూపం. అది తయారు కావా లంటే అనిశం హృదయగుహ లోపల వసించటం అభ్యసించాలి. అందుకే ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ యోగములో ఇవ్వబడ్డాయి. అభ్యాస వైరాగ్యములు ప్రాతిపదికగ ఈ అంగుష్ఠ మాత్రునిగ, అక్షరునిగ, తనను తాను ఏర్పరుచుకోమని, అందుకే కఠ యోగమని యముడు బోధిస్తాడు.

మనసు, ఇంద్రియములు, శరీరము నాశ్రయించి మాత్రమే జీవించేవాడు క్షరుడు. తానాత్మగ, తన ప్రకాశము బుద్ధిగ, క్షరుని అధిష్ఠించి వుండేవాడు అక్షరుడు. క్షర, అక్షరులకు మూలం పురుషోత్తముడు. క్షరుడు రథమువంటి వాడు. అందు వసించే

వాడు అక్షరుడు. వారిరువురిని నడిపించేవాడు పురుషోత్తముడు. వీరినే వరుసగా అర్జునుని రథము, అర్జునుడు, అందే ఆసీనుడై యున్న కృష్ణునిగ తెలుపుతారు. రథాన్ని, అర్జునుని నడిపించిన వాడు కృష్ణుడే కదా! అర్జునుడు నరుడు. అంటే నశించనివాడు. అలాగే మనం కూడా నరులమే అని తెలియాలి. యుద్ధమైపోయిన తర్వాత రథం అగ్నికి ఆహుతి అయిపోతుంది. అర్జునుడు, కృష్ణుడు మిగులుతారు. అలాగే మనము, ఈశ్వరుడు మిగులుతాము. శరీరం ఆహుతి అయిపోతుంది.

శరీరం ఆహుతి అయిపోయే లోపల మనం శరీరం నుండి బయట పడటం నేర్చుకోవాలి. అందుకే కఠ ఉపనిషత్తు. అందుకే సమస్త జ్ఞానము. నీలోని ఈశ్వరుడు సత్యము. అతడే ధర్మజ్ఞుడు, యజ్ఞస్వరూపుడు కూడా. నీవతనిని ఎరిగి, ధర్మమాచరించాలి. అపుడు నీకు అక్షరుడవని తెలుస్తుంది. నీలోని ఈశ్వరుని నీవు అనుసరిస్తూ వుంటే నీలోని క్షరుడు (నీ స్వభావ పురుషుడు) నిన్ను అనుసరిస్తాడు. నీలోని పెద్ద అయిన ఈశ్వరుని నీవనుసరిస్తే, నీ నుండి పుట్టిన క్షరుడు నిన్ను అనుసరిస్తాడు. నీవు నీ తండ్రిని అనుసరిస్తూ వుంటే, నీ కుమారుడు నిన్ను అనుసరిస్తాడు. ఇలా మనలో గల ముగ్గురు సమన్వయం కలిగివుంటే, నీ నిజస్వరూపం నీకు ధారణ స్థితిలో గోచరిస్తూ వుంటుంది. నీవు ఈశ్వరునితోనూ

ఉండవచ్చు. దేహముతోనూ ఉండవచ్చు. ఈశ్వరునితో కూడి దేహమును కాలాంతరమున విడువవచ్చు.

అంతేకాక ఈశ్వరునితో పూనిక కలిగి ధర్మము నాచరిస్తూ, యజ్ఞార్థము జీవిస్తూ, ప్రాణాయామాది అభ్యాసము నిత్యము నిర్వర్తిస్తూ వుంటే, పాల నుండి వెన్న తీసినట్లు, నీ మనసేంద్రియ శరీరముల నుండి, అంగుష్ఠమాత్ర రూపంలో నిన్ను నీవు తేజో రూపంతో నిర్మాణం చేసుకొనవచ్చు. నిజానికి ఈ కార్యక్రమము నకు సద్గురువు తోడ్పాటు అత్యంత ప్రధానము. అతడి తోడ్పాటుతో అంగుష్ఠ రూపమును పొందవచ్చు. మాస్టర్ సి.వి.వి.గారు యీ వాగ్దానమును నిర్దిష్టంగా యిచ్చారు. అందరికీ అమరత్వ మిస్తానని వాగ్దానం చేశారు. వారిని ఆశ్రయించటం వలన ఈ ప్రయోజనం సాధకులకు దక్కుతుంది. వారి నాశ్రయించటం అంటే అనుస రించటమే కాని, ఆయన చిత్రపటములు పంచటం మాత్రమే కాదు.

అంగుష్ఠమాత్ర పురుషుడు తేజోమయుడు. బంగారు కాంతి, వజ్రకాంతి కూడ గలవాడు. అతడు అతి సూక్ష్మమగు రూపమునుండి అతి గంభీరమగు రూపముగ తరుగుట, ఎదుగుట చేయగలడు. ఆకాశ గమనము చేయగలడు. అదృశ్యముగను, దృశ్యముగను నుండగలడు. రామాయణ మందలి 'హనుమ'

యిలాంటి కృత్యములు నిర్వర్తించి చూపాడు. 'సూక్ష్మరూపధరి' 'వికటరూపధరి', కాంచన దేహము, వజ్రాంగ దేహము, ఆకాశ గమనము, చిరంజీవత్వము- యిత్యాదివన్నీ నిర్వర్తించి యోగేశ్వరునిగ భూమిపై నున్నవాడతడు. అతడును సద్గురువే! మనలో (లంక) రాక్షస సంహారము గావించి, మనలను రక్షించి ఉద్ధరించ గలడు. గణపతి, దత్తాత్రేయుడు, కపిలుడు, సుబ్రహ్మణ్య స్వామి వీరందరు యోగేశ్వరులే!

నచికేతుని యమదేవుడు, అంగుష్ఠమాత్ర పురుషునిగ ఏర్పడమని నచికేత విద్యనిచ్చి, జయము నిశ్చయముగ కలుగుటకు జయమాలను (రంగుల మాలను) కూడ ప్రసాదించాడు. హృదయ గుహయందు గోచరిస్తున్న కాంతిరేఖను ఆధారం చేసుకొని మూలం చేరమని ప్రోత్సహించాడు. హృదయగుహలో గోచరించు కాంతిరేఖయే సుషుమ్న నాడి. అది ఊర్ధ్వముఖమై శిరస్సు వరకు వ్యాపించి వుంటుంది. అనేకానేక నాడులు హృదయగ్రంథిలో వున్నా, ఊర్ధ్వానికి వెళ్ళేది అది ఒక్కటే.

ఆ ఊర్ధ్వముఖ నాడినే మధ్వులు 'హనుమ' అని, సద్గురువని భావిస్తారు. దానియందు ప్రవేశించి ప్రయాణం చేయటానికి ఉదాన వాయువు తోడ్పడుతుంది.

ఈ శరీరంలో పంచభూతాలు, పంచ ప్రాణాలున్నాయి.

ప్రాణాన్ని, అపానాన్ని హృదయంలో సమానం చేస్తే స్పందన వినిపిస్తుంది. ఆ సమాన వాయువే క్రమంగా ఉదానవాయువుగా ఉన్ముఖంగా బయలుదేరుతుంది. అది ఆజ్ఞకు చేరితే ప్రాణములు వశంలో ఉంటాయి. వ్యానవాయువు శరీరమంతా వ్యాపించి ఉంటుంది. ఆత్మ కూడ వ్యానవాయువులా శరీరమంతా వ్యాపించి ఉంటుంది. అపాన వాయువు ద్వారా విసర్జన చేస్తుంటుంది. ప్రాణవాయువు ద్వారా బయటినుంచి ప్రాణము తెచ్చుకుంటూ ఉంటుంది. రెండింటినీ సమానం చేస్తే సమాన వాయువుగా స్పందనాత్మకంగా ఉంటుంది.

సమానము స్పందనముగ గుర్తింపబడి, స్థిరపడినపుడు, క్రమముగ అది లోలోనికి హృదయ గుహలో ప్రవేశిస్తుంది. అపుడు ప్రజ్ఞ సూక్ష్మ స్పందనగ లోలోనికి ఏగుతుంది. దీనినే 'డిప్ డీప్' అని మాస్టర్ సి.వి.వి.గారు ఒక మంత్రంగ యిచ్చారు. గుహా మూలం ఆ విధంగా చేరిన ప్రజ్ఞకు ఉదానవాయువు పరిచయమై ఊర్ధ్వముగ శిరస్సునకు చేర్చగలదు. భ్రూమధ్యమున స్థిరమగు స్పందనగ నిలువ గలదు.

ప్రాణాపానములు స్పందన ప్రాణముగ, స్పందన ప్రాణము సూక్ష్మ స్పందనముగ ప్రజ్ఞ అనుభూతి చెందటమే ప్రాణా యామము. అటుపై ఊర్ధ్వముఖముగ ఉదానవాయువు

సహాయంతో భ్రూమధ్యం చేరటం ప్రత్యాహారము. అచ్చటనే ధ్యానమున సులభముగ, స్థిరముగ, సుఖముగ ప్రజ్ఞ వుండగలగటం ధారణ.

ఇలాంటి ధారణ స్థితికి చేరడం ప్రజ్ఞ ఉదానవాయువు సహాయంతోనే ఆజ్ఞను చేరగలదు. అభ్యాస వైరాగ్యముల పరిణితి బట్టి ఈ పరిణామం కలుగుతుంది. అచ్చట ఆజ్ఞ యందు తన రూపం, బొటనవ్రేలి పరిమాణంలో తనకే దేదీప్యమానంగ గోచరిస్తూంది. అదియే తన సూక్ష్మరూపం, అక్షరరూపం. ఆ రూపం వజ్రకాంతిని, బంగారు కాంతిని కలిగి వుంటుంది. అదియే తన అక్షర రూపం!

ఈ స్థితిని పొందమని యముడు ఉపదేశిస్తాడు.

అదే విషయం భగవద్గీత 15వ అధ్యాయంలో శ్రీకృష్ణుడు చెబుతాడు. నాలాగే నేను మిమ్ములను నా అంశలుగా ఏర్పాటు చేశాను. జీవాత్మలన్నీ పరమాత్మ అంశలే. అందులోనూ నరుడు పరిపూర్ణ రూపం. మానవుడు దాని రూపం. లోపలికి వెడితే దాని గురించే, అంటే 'అంగుష్ఠమాత్ర పురుషుడు' గురించే అక్షరుడుగా చెబుతాడు. లోపల అతనికి తన సహజమైన నమూనా కనబడుతుంది. నీ బొటనవేలంత ఒక రూపం ధగ ధగలాడుతూ ఉంటుంది. నీ రూపమే కదా! దాన్ని చూడటం 'స్వస్వరూప

సందర్శనం' అంటారు. అది ఏర్పడక ముందు ఎలా వుంది? పాల లాగా ఉంది. పాలలో వెన్న తీస్తే వచ్చింది. పాలలో వెన్న తనకు తానుగా రాదు. కాచి తోడు పెడితే పెరుగవుతుంది. అప్పుడు నీవు సాధనచేసి వెన్న తీయాలి. అలా నిన్ను నీవు మార్పు చేసుకోవాలి. దానినే 'ట్రాన్స్ఫర్మేషన్' అంటారు. సమీకరించి అగ్నిచేత అన్నిటినీ శుద్ధి పరచాలట. అగ్ని కార్యంలో 'ట్రాన్స్ మ్యుటేషన్' బాగా జరుగుతుందట. అప్పుడు 'ట్రాన్స్ఫర్మేషన్' ఆ తరువాత 'ట్రాన్సెండెన్స్' జరుగుతుంది. దానినే ట్రాన్సెన్ డెంటల్ యోగ' అన్నారు అరవిందులు. దానినే 'సుప్రామెంటల్' అంటారు. అంటే నీవు మనిషిగా ఉండేవాడివి. బుద్ధిలో ప్రవేశిస్తే నరుడవుతావు. మానవుడు నరుడయ్యాడు. అలా అయితే నీవు 'అక్షర పురుషుడు' అవుతావు అంటుంది గీత.

భగవంతుని నమూనా ప్రకారం ఎప్పుడు నీకు నీవు దర్శన మిస్తావంటే, ఆజ్ఞకు చేరినప్పుడే. ధ్రువునికి తపస్సులో విష్ణువు స్పష్టంగా తనలాగే కనిపించాడట. దేవుడు కనిపించడమంటే తాను దేవుడిలా ఏర్పడ్డాడు. అందరికన్నా ముందు పుట్టినవాడు 'విరాట్పురుషుడు'. వాడిలో నుండి నమూనాగా మానవుడు వచ్చాడు. ఆ నమూనా చుట్టూ రక్త మాంసాదులతో కూడిన ఒక రూపం ఏర్పడింది. పాలలోనుండి వెన్న తీసినట్టుగా, భౌతిక

శరీరం నుండి సూక్ష్మ శరీరాన్ని వేరు చేయాలి. దీనిని మనము ఎరిగి, మరచిపోయి మళ్ళీ వచ్చి చేరి అందులో ఇరుక్కు పోయాము. నీ మనస్సు నుండి వచ్చిన పుస్తకాలన్నీ నీతో బాటే వెళ్ళిపోతాయి. కాని, నీవు బుద్ధిలో ఉండి రాస్తే నీవు వెళ్ళినప్పటికీ చాలా కాల ముంటాయి. అందుకనే మహాత్ముల కార్యములన్నీ భూమిమీద ఉండిపోతాయి. రాముడు, కృష్ణుడు చేసిన కార్యాలు మరచిపోరు. మహాత్ములు అమృతత్వం సంపాదించారు కాబట్టి వారి కార్యాలు మరవడానికి వీలుపడదు. కాలం సత్యాన్ని మడిచిపెట్టక, వెలికి తీసుకొచ్చి చూపిస్తుంది. సత్పురుషులు కూడ కాలం మడతలో ఉండరు. సమాజం వాళ్ళను ఇమిడ్చినా కాలం వాళ్ళను తనలో ఇమడ్చుకోదు.

అందుకనే నీవు హృదయగుహలో ప్రవేశిస్తే ఆత్మ ప్రకాశం నీకు తెలుస్తుంది. ఉదానవాయువు సహాయంతో పైకి వెళ్ళాలి. తిన్నది మ్రింగుడు పడకపోయినా, త్రేన్పు రాకపోయినా ఉదాన వాయువు సరిగా లేదని అర్థం. ఇలా నీలోని విషయాలు తెలుసు కోవటం జ్ఞానం, బయటి విషయాలు తెలుసుకోవడం విజ్ఞానం. అందుకే పంచప్రాణాలను, పంచేంద్రియాలను వశంలోకి తెచ్చు కోవడం కూడా యజ్ఞం. అలాగే ప్రార్థన కూడా మూడుసార్లు వీలుకాదు అనక తప్పకుండా చెయ్యాలి. అలా ఉన్నవారే మూడుగా

నచికేతాగ్నిని అనుసరించగలరు. యజ్ఞాలు చెయ్యగలరు. అభయాన్ని ప్రసాదించే తీరాన్ని చేరుకోగోరిన వారికి అవినాశియైన ఏ భగవంతుడు కరుణామయుడో, ఆ భగవంతుని తెలుసుకోవటానికి సమర్థు లవుతారు. అందుకే ముందుగా లోపలికి వెళ్ళాలి, లోపలికి వెళ్ళి ఆరాధన చేయాలి. అలా ఆరాధన చేస్తూ సుషుమ్నా నాడి ద్వారా ఊర్ధ్వంగా వెళ్ళాలి. అదే ఉదాన ప్రాణం. దానినే మధ్వులు హనుమంతుడు అంటారు. ఆయన అలా దిగివచ్చి ఇలా కార్య క్రమం నడిపించి మరల వెళ్ళిపోతాడు.

సుషుమ్న ద్వారా ఆరాధిస్తూ ఉంటే చాలా అద్భుతాలు కనిపిస్తాయి. సువర్లోకం నుంచి తగిలేది మహత్తే. ఆ మహర్లోకంలో వెలుగులు, శబ్దాలు చాలా ఉంటాయి. చాలా మహత్తు కనిపిస్తుంది. అక్కడే సిద్ధులు దొరికేది. కాని నీ గమ్యం, నీ మూలం ఎక్కడినుండి వచ్చిందో అక్కడికి చేరాలి. అది చేరే మార్గంలో ఆజ్ఞ చేరితే ఆత్మ తత్వం తెలుస్తుంది.

అంగుష్ఠుడుగ ఏర్పడతావు. అక్షరుడ వవుతావు. కాంతి వంతుడుగ వుంటావు. ఈ అంగుష్ఠుడు క్రమముగ ఆజ్ఞ నుండి వెలుపలకు వెలువడటం, లోపలికి చనటం కూడ తెలుసు కుంటాడు. ఆదిశంకరులు, యోగీశ్వరులు ఈ మార్గం ద్వారానే దేహము నుండి బయటకు వచ్చి దివ్యకార్యాలు చక్కబెడుతూ

వుంటారు. ఇది జీవుని శరీరమునకు ముఖద్వారం! ముఖ్యద్వారం! దీనినే రాజద్వార మంటారు. యోగిరాజులు మాత్రమే ఈ ద్వారాన్ని వినియోగించుకోగలరు. *"రాజద్వారే, రాజముఖే, సర్వదా దిగ్విజయమస్తు!"* అని పురోహితులు ఆశీర్వదించటం, దీనిని పొందమనే.

ఆజ్ఞచేరిన సత్సాధకుడు తన జీవితానికి తానే రాజు. అతనిని ఎవ్వరూ పరిపాలించరు. అతనిని అతడే పరిపాలించు కుంటాడు. దీనినే "Independance – ఇండిపెండెన్స్" అని అంటారు. యిట్టి వారికి ప్రజ్ఞ పరిమితమై కాక, అపరిమితముగ వికాసం చెందుతూ వుంటుంది. దీనినే "Liberty – మోక్షం" అని అంటారు. ప్రస్తుతం ఈ రెండు పదాలు Independance and Liberty ఎక్కువగా వింటూ వుంటాము. ఈ స్థితి పొందినవారు తమ బుద్ధిపై, మనసుపై, ఇంద్రియములపై, శరీరముపై, జీవితముపై స్వామిత్వం కలిగి వుంటారు. దేనికీ బానిసలై బ్రతుకరు. ధ్యానులనగ వీరే! దైవము నెరిగి, ధర్మమును కాలమును అనుసరించి శాశ్వతముగ వుంటారు.

అటుపైన సమాధి. సమాధి చేరటానికి కూడ ఓంకార అనుస్మరణమే శరణ్యము.

ఓంకారమును అనుస్మరణ చేస్తూవుంటే నీవు లేక ఓంకార

మూలము మాత్రమే వుంటుంది! అపుడు ధ్యానించే నీవు ధ్యాన గమ్యమైన తత్త్వమునందు ఇమిడిపోతావు. కొంత తడవు నీవు వుండక అదియే వుంటుంది. అదియే వున్నది. అందుండి మనము, సృష్టి మరల ఏర్పడతాము. నిజమునకు ఉన్నది అదియే! అదియే యిదిగా ఏర్పడుతూ, మరల అది అయిపోతూ వుండటం తెలుస్తుంది. అపుడు యిది అంతా అదియే అని తెలుస్తుంది. అది యిది అవటానికి, యిది అది అవటానికి ఓంకారమే సంధానము. అందువల్ల ఈ ఉపనిషత్తులో అనేకమార్లు యముడు నచికేతునితో "ఓం ఇతి ఏతత్" అని పలుకుతాడు. పరమాత్మ నుండి దిగివచ్చిన జీవాత్మ పరమాత్మ వలెనే అక్షరుడు, అమరుడు. కాని ప్రకృతి ఆవరణలలో తనను తాను మరచి క్షరుడు, మర్త్యుడు అవుతాడు. అతడు హృదయ కమలమందు ప్రవేశించి, హృదయ కర్ణికలోని అనాహత శబ్దమగు ఓంకారమును చేరి, ఉదాన వాయువు ఆధారముగా ఊర్ధ్వగతి చెంది, ఆజ్ఞ యందు అంగుష్ఠ మాత్రునిగా, తేజోమూర్తిగా తనను తాను తెలుసుకొని, అటుపై ఓంకారాను సంధానమును కొనసాగించి, సహస్రారమున తన మూలస్థానము చేరి పరితృప్తుడై, బ్రహ్మమే తానని ఎరిగి పూర్ణజ్ఞాని అవుతాడు. నిజానికి యిదియే ఈ ఉపనిషత్తు సారాంశము.

# 11. ముక్తాయింపు

**ఈ** మొత్తము సాధనామార్గం 'శమంతకమణి' ఉపాఖ్యానములో దర్శించవచ్చు. శమంతకమణి కోసం బయలుదేరిన శ్రీకృష్ణుడు అశ్వారూఢుడై (ప్రాణములను యమించి), యానము చేస్తూ సింహము పడివుండటం చూస్తాడు (సింహరాశి లేక సోహం శబ్దము జరిగే గుహ లేక అనాహత పద్మము). సింహపు జాడలు (సోహం శబ్దముగా వినిపించే స్పందనము) అనుసరించి ఎలుగు బంటి గుహ (ఆజ్ఞాకేంద్ర ముఖద్వారము) చేరి, అందు ప్రవేశించి శమంతకమణిని గ్రహిస్తాడు. ఆ మణి సహస్రారమందు వున్న కాంతి. దానినే గౌతమబుద్ధుడు దర్శిస్తాడు. దర్శించి "ఓం మణిపద్మే హూం" అనే మంత్రమును ప్రసాదిస్తాడు.

ఈ విషయాలన్నిటినీ తెలుసుకోవాలన్న తీవ్రమైన స్ఫూర్తి నారదుడు ఇస్తాడు. నారదమహర్షి అనుగ్రహం వలన తెలియనిదంటూ ఏదీ ఉండదు. ఆ మహర్షి తోడ్పాటు వలన వాల్మీకి, ధ్రువుడు, ప్రహ్లాదుడు, వ్యాసుడు యిత్యాది మహర్షులు బ్రహ్మవేత్తలైనారు. ఇలా నరుడికి – నారాయణునికీ వారధి ఏర్పడుతుంది.

దానినే higher bridge అంటారు. హృదయం నుంచి ఆజ్ఞకు వెళ్ళేదాన్ని bridge అంటారు. ఆజ్ఞ నుండి సహస్రారం వెళ్ళేదాన్ని higher bridge అంటారు. ఆసక్తి ఉన్నవాడికి అన్నీ లభిస్తాయి. హృదయంలోకి వెళ్ళగానే గురువు 'వచ్చావా! చాలా రోజులయింది నిన్ను చూసి!' అంటాడు. అంటే 'అనవసరమైన పనులు చేస్తున్నావని, చేయవలసిన పనులు చేయలేదని' అర్థం. సద్గురువు తనవాడనుకున్న వాడినే ఇలా ప్రశ్నిస్తాడు. మొదట్లో చాలా చనువుగా ఉన్న శిష్యుడు తరువాత చాలా భయం, భయంగా ఉంటాడు. అలాగే సద్గురువు తమ ఇళ్ళకు రావాలని చాలామంది ఎదురు చూస్తుంటారు.

*నా యింటికి విచ్చేయుము*
*నీ యంఘ్రి సరోజరేణు నికరము సోఁకన్*
*నా యిల్లు పవిత్రం బగు*
*శ్రీయుత నీ భటునిఁ బెద్ద సేయం దగదే!*

అని అక్రూరుడిలా పిలవాలి. ఇంటికి అంటే మన హృదయం లోకి వచ్చేస్తాడు. విద్యలన్నీ నేర్పుతాడు. మన గురువుగారు, అంటే సి.వి.వి.గారు ఇక్కడి నుంచి అటు సప్తఋషి మండలం వరకు, అవతలపక్క Southern Star, అంటే శారమేయ మండలం వరకు తిరుగుతుంటారు. ఆయన సూర్య మండలం దాటి వెళ్ళి

వస్తుంటారు. ఆయన పని అలా ఉంటుంది. నీవు లోపల కూర్చొని 'గురువుగారూ!' అని పిలిస్తే వస్తారు. కాని *'పిలిచిన ఓయని పలుకునట కదా! సందేహంబయ్యె'* అన్నాడు గజేంద్రుడు. మనం హృదయం అనే టెలిఫోన్ బూత్ నుండి పిలిస్తే పలుకుతాడు.

*'ఆత్మానాం రథినం విద్ధి శరీరం రథం ఏవ చ ।*
*బుద్ధిం మే సారథి విద్ధిం మనః ప్రగ్రహమేవచ ॥*

ఆత్మ రథికుడు, శరీరం రథం, బుద్ధి సారథి, మనస్సు కళ్ళెము. మనస్సుతో ఇంద్రియాలను పట్టుకుంటే, మనస్సును బుద్ధి పట్టుకుంటే, బుద్ధిని నీవు పట్టుకుంటే, పడవు. ఎవరి తరువాత ఎవరు అన్న క్రమం వుంటే పని అవుతుంది. ఇంద్రియాలు, గుఱ్ఱాలు, విషయవస్తువులు. ఆ గుఱ్ఱాలు పరుగు తీస్తూ వెళ్ళే మార్గం, శరీరం, ఇంద్రియాలు, మనస్సు, వీటితో కూడిన జీవుడు, జీవితాన్ని అనుభవించే వాని ఆత్మ అని చెబుతారు. మనకు నచ్చిన సినిమా కన్ను చూపిస్తే, మనస్సు వెళ్ళమని చెబుతుంది. దానిని బుద్ధి సహాయంతో ఆపాలి. అందుకే బుద్ధి ఉన్నవాడు ఈ పని చేయడు అంటారు. మనసుకు తోచినది కాదు, బుద్ధి నిర్ణయించినదే చేయాలి. బుద్ధి ఎవరంటే నీలోని దైవం యొక్క వెలుగు. "నేను నీ పైనే ఉన్నాను. నీ లోపల బుద్ధిగా కూడా ఉన్నాను" (In every man my center is there as buddhi) అన్నాడు శ్రీకృష్ణుడు.

మనలో బుద్ధి – ప్రద్యుమ్నుడు, ప్రజ్ఞ – సనత్కుమారుడు. నలుగురిలో నాలుగవ కుమారుడు మనమైతే మూడో కుమారుడు బుద్ధి, రెండో కుమారుడు ఆత్మ, మొదటి కుమారుడు పరమాత్మ. పరమాత్మ – ఆత్మ – బుద్ధి – మనసు. ఆత్మ, బుద్ధి, మనస్సు అంటుంటారు బౌద్ధులు. పరమాత్మ, ఆత్మ, బుద్ధి, మనస్సు – నాలుగు. అందుకని నీ మనస్సు ఎప్పుడూ నీ బుద్ధిని అడుగు తుండాలి. అందుకనే మన బుద్ధి ఏర్పడేంతవరకు, బుద్ధి బాగా ప్రకటింపబడి వానిని తెలుసుకొని చేయటమే గురువుగారిని అడగటం అన్నారు. మన బుద్ధి పనిచేస్తుంటే అన్నింటికి గురువు గారి దగ్గరకు వెళ్ళనక్కర లేదు. మనకేదైనా ధర్మసంకటమొస్తే అడగవచ్చు. అప్పుడు గురువు నీ బుద్ధిని పెంచుతాడు కాని, తన బుద్ధిని నీలో నింపడు. అందుకే భగవంతుడి వెలుగు బుద్ధి రూపంలో ఉందన్నారు. ఆలోచనలన్నీ బుద్ధికి సమర్పణ చేస్తే అది ఖచ్చితంగా చెబుతుంది. నీకేది మంచిదో, నీకేది శ్రేయస్సో అది బుద్ధి చెబుతుంది. బుద్ధిని అనుసరించడం వలననే అర్జునుడు విజయుడయ్యాడు. ఎవడు జాగృతి చెందనివాడో, అదుపు తప్పిన మనసు గలవాడో, అతడి ఇంద్రియాలు సారథి వశంలో లేని గుఱ్ఱాలవలె వశం తప్పిపోతాయి. అతడు విజయం పొందడు. ప్రాపంచికతలో నశించిపోతాడు. జాగృతి చెందినవాడు,

మనోనిగ్రహం గలవాడు అతడి ఇంద్రియాలు సారథి వశంలో ఉన్న గుఱ్ఱాలవలె వశంలో ఉంటాయి. అతడు అక్షర స్థితిని పొందుతాడు.

ఎవడు జాగృతి చెందిన సారథితోనూ, కళ్ళెమనే మనస్సు పట్టుకున్నవాడుగా ఉంటున్నాడో అతడే ప్రయాణంలో గమ్యం చేరుకుంటాడు. అది భగవంతుని పరమపదం. అలాగే నీవు హృదయ గుహలోకి వెడితే, నీకు వెలిగేది బుద్ధి. దానిని అనుస రిస్తూ ఉంటే అది ఊర్ధ్వముఖంగా తీసుకెళ్ళి ఇంకా ఎక్కువ వికాసం కలిగిస్తుంది. మనస్సు సహకరిస్తుంది. మనస్సు సహకరించకపోతే బుద్ధిని వదిలేసి తన దారిన తాను తిరుగుతూ ఉంటుంది. **బుద్ధితో కూడిన మనస్సు గలవాడు బుద్ధిమంతుడు. మనిషి మనో మంతుడు. అతడు బుద్ధిమంతుడు కావాలి. బుద్ధిమంతుడైన మనిషి ఆత్మవంతు డవుతాడు.** బుద్ధి, మనస్సు పరస్పరం శత్రువులు. మనసు దారి మనసుదే, ఇంద్రియాల దారి ఇంద్రియా లదే. ఆ శత్రుత్వంలో లోపలున్న దివ్యజ్యోతి మసకేస్తుంది. మనలోని చైతన్యస్రవంతి ననుసరించి బొమ్మలకొలువు పెడతాము. వాటిలో ముందుగా జంతువులు, మనుషులు, దేవతలు, అన్నిటి కంటే పైన దేవుడు ఉండాలి.

యమధర్మరాజు ఓంకారమును ఉపదేశించాడు. దాని

మార్గము హృదయ కమలములో నిక్షిప్తమై వున్నదని తెలిపాడు. 4 పొరలుగా, 12 దళములుగా వున్న ఆ కమల కర్ణికలోనికి స్పందన ఆధారముగా ప్రవేశించమని సూచిస్తాడు. ఆ కర్ణిక నుండి 101 (నూట ఒకటి) నాడులలో వర్తిస్తాయని, అందు ఒక నాడి మాత్రము ఊర్ధ్వముఖముగా శిరస్సులోనికి వ్యాపించి వున్నదని, దానిని అనుసరించడము ద్వారా జీవుడు శరీరము నుండి విడి వడతాడని, తన నిజస్వరూపము తనకు ఆవిష్కరింప బడుతుందని తెలియజేస్తాడు. అదియే సుషుమ్నా నాడి. అదియే ముఖ్య ప్రాణ మార్గము. అదియే ప్రణవ మార్గము. యిదియే క్రమవృత్తి మార్గము. ఈ మార్గములో సర్వమూ అవగతమౌతుంది.

మనస్సు కన్నా బుద్ధి శక్తివంతమైనది. మహత్త్వం సంత రించుకున్నా ఆత్మ బుద్ధికన్నా శక్తివంతమైనది. అది అవ్యక్తం. భగవంతుడి కన్నా శక్తివంతమైనది ఏదీ లేదు. ఆయనే పరమ వస్తువు. ఆయనే చరమగమ్యం. ఈ ఆత్మ సమస్త జీవులలోనూ దాగి ఉన్నది. సూక్ష్మమైన బుద్ధి ద్వారా మహాత్ములు ఈ ఆత్మను దర్శించగలుగు తున్నారు. ఆంతరిక ఆకాంక్ష గల వ్యక్తి వాక్కును మనస్సులో లీనం గావించాలి. మనస్సు జాగృతి చెందిన బుద్ధితో లయింపచేయాలి. బుద్ధిని మహత్వం గల ఆత్మలో లీనం చేయాలి. ఆత్మను శాంతికి ఆలవాలమైన భగవంతునిలో లీనం చేయాలి.

అందుకు వాక్కు శుద్ధంగా ఉండాలి. 'వాగేవ ఋగ్వేదః' అన్నారు. వాక్కే అగ్ని. నాలుక అగ్నిస్వరూపం. తీసుకునే ఆహారం అగ్ని. అది ఇచ్చేది అగ్ని. అందుకే ఒక్క చెడ్డమాట మాట్లాడితే ఎంతో కష్టం కలుగుతుంది. జీవితాంతం బాధపడతారు. అన్న వాడికి ఏవీ గుర్తుండవు కాని విన్నవాడికి గుర్తు ఉంటుంది. హృదయం గాజు బొమ్మలాంటిది. అది పగిలితే అతకదు. నోరు దేవుడు మానవునికిచ్చిన వరమే కాదు శాపము కూడ. కొందరు లౌకికంగా, తెలివిగా ఎదుటివాడిని బాధపెడితే, కొందరు సూటి పోటి మాటలతో బాధ పెడతారు. కొందరికి ఎలా పలుకరించాలో తెలియదు. ఒక భావాన్ని భాషలో పెట్టడానికి ఏ పదం వాడాలి, ఏ పదం వాడకూడదో తెలియదు. మన మాటలను కూడ 'అది కాదు' అని కాక 'ఔను మరి' అని మొదలుపెట్టవచ్చు. కొంతమంది మాట్లాడుతూ ఉంటే కూర్చుని వినాలి. మరి కొంతమంది మాట్లాడితే మర్యాదగా, నొప్పించకుండా బయటికి వచ్చేయాలి. నీకు అంతరంగమందు ఆసక్తి ఉంటే మాట తగ్గించాలి. 'సత్యం వద' సత్యాన్ని ప్రియంగా పలకాలి. అప్రియంగా సత్యాన్ని పలకకు. కుండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పడం అనాగరికత. సత్యాన్నే ప్రియంగా పలకాలి. ఏదైనా మన దగ్గరకు వచ్చి అడిగితేనే చెప్పాలి.

సత్యసాయి 'మనిషి అంటే ఎన్ని రకాలు?' అని అడిగారు.

నేను 'మూడు రకాలు' అన్నాను. ఎవరు వాళ్ళు? చెప్పమన్నారు. మనుషులలో పశువులున్నారు, మనుషుల్లో మనుషులున్నారు, మనుషుల్లో దేవుళ్ళున్నారు అని చెపితే, ఆయన 'బంగారూ!' అని కావలించుకున్నారు. ఎదుటి వాడు తెలుసుకుందామని అడుగు తున్నాడా? లేక వెటకారంగా అడుగుతున్నాడా? అది తెలుసుకొని చెప్పాలి. అందుకే ప్రశ్న వేరు, పరిప్రశ్న వేరు. పరిప్రశ్నకే జ్ఞానం. అందుకే *'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా'* అన్నారు. గురువుగారికి ఎన్నో పరిచర్యలు చేసి, శిరసు వంచి అడిగితే అప్పుడు ఆయన చెప్పేవారు. అందుకే ప్రాజ్ఞులు "లేవండి, మేలుకోండి. అర్హుడైన గురువు నాశ్రయించి అనుభూతి పొందండి" అన్నారు. పదునైన కత్తి అంచుమీద నడవటం వంటిది భగవన్మార్గం. అది కత్తితో సాము కాదు, కత్తిమీద సాము. ఎక్కడా తేడా పడకుండా జాగ్రత్తగా అడుగువెయ్యాలి.

*'స్వాధ్యాయ ప్రవచనాయ ప్రమదితవ్యం'* లోపల గురువుతో కూర్చుని అధ్యయనం చేసి, బయటికి వచ్చి పదిమందికి చెప్పు. ఉపనిషత్తులలోని ఈ వాక్యాలన్నీ నీవు పెరిగినకొద్దీ అనేక అర్థా లను ఇస్తుంటాయి.

పరమాత్మ దగ్గరకు వెళ్ళటానికి బుద్ధితో మొదలుపెడితే ముందు ఆత్మదర్శనం, తరువాత పరమాత్మ దర్శనం కలుగుతుంది.

అందుచేత నచికేతుడికి, యమధర్మరాజు చెప్పిన ఈ ప్రాచీనమైన విషయం జాగృతి చెందిన మనిషి చెప్పడం, వినడం చేస్తే అతడు ఉన్నత లోకాల్లో ప్రశంసను పొందుతాడు. అత్యంత గోప్యమైన ఈ ఉపనిషత్తును ప్రాజ్ఞుల సభలోను, శ్రాద్ధ సమయంలోనో పావనుడైన వ్యక్తి పఠిస్తే అనంతమైన ఫలితాన్ని కలిగిస్తుంది. ఇంద్రియములను బాహ్య పరిమాణ ఉద్దేశ్యంతో భగవంతుడు ఏర్పాటు చేశాడు. అందుచేత అవి వెలుపలి విషయాలను మాత్రం చూడగలవు. దాని లోపల ఉన్న ఆత్మను చూడలేవు. అమరత్వం కోరే ప్రాజ్ఞుడు అంతర్ముఖుడై ఆత్మను చూడగలుగుతాడు. కాని నీవు లోపలికి వెళ్తే లోపల చూపించగల ఇంద్రియాలు తయారవుతాయి. అవే అంతర్ ఇంద్రియాలు, అంతఃకరణములు. వాటితో కూడిన శరీరమే అంతఃకరణ శరీరం. బాహ్యకరణములతో కూడినది బాహ్యశరీరం.

లో కన్ను, లో చూపు, లో వినికిడి, లో రుచి అలవాటుపడ్డ వాడు బయటి రుచులకు తాపత్రయపడడు. ముక్కు అంతరంగం లోని సుగంధాన్ని ఆఘ్రాణిస్తుంది. ఈ శరీరంతోనే వాడు నిర్మాణమవుతాడు. ఆ తరువాత నీవు వాడితో భూమి కక్ష్యలో ఎక్కడైనా తిరగవచ్చు. అది తయారైతే స్వప్నదర్శనం యిచ్చి ఎదుటివాడికి ఉపశమనం కలిగించవచ్చు. ఆదేశం కూడా ఇవ్వవచ్చు. ఆ

శరీరాన్ని పెంచవచ్చు. దించవచ్చు. వెడల్పు చేయవచ్చు. ఎగర వచ్చు. దానికి చావులేదు. దాని కాంతి బంగారు కాంతి నుండి వచ్చే వజ్రకాంతి. అలా ఎన్ని కాంతులైనా ఉంటాయి. దీని గురించి రామకృష్ణ పరమహంసను అడిగితే పాలలో వెన్న దాగి ఉన్నప్పుడు కనబడదు. పాలలో నుండి వెన్న తీసి ఆ ముద్దని పాలలో పెట్టినా అది అలాగే ఉంటుంది. అలాగే ఈ రక్త మాంసాదులతో కూడిన శరీరం దానిలోనుండి ఈ నచికేతాగ్ని, అగ్నికార్యం చేసి ఆరడుగుల శరీరంలోనుండి అంగుష్ఠమాత్రంగ తయారవుతుంది. ఇలా ఆత్మను చూడగల మనోప్రకృతి లేనివారు బాహ్యంలో భోగవస్తువు లను కాంక్షిస్తారు. సర్వత్ర నిలకడ వున్న మృత్యువులో పడిపోతూ ఉంటారు. కాని అనిత్య ప్రపంచంలో అమరమైన శాశ్వతమైన దొకటి ఉందని ప్రాజ్ఞులు తెలుసుకుంటారు. కనుక వారు భోగ వస్తువులను కాంక్షించరు. బాహ్యభోగాలు నీ శరీర సారాన్నంతా లాగేస్తాయి.

యోగజీవనం, భోగజీవనం, రోగజీవనం. పచ్చిగా ఉన్నప్పుడు వేరుశెనగపప్పు తొక్కతో కలిసి ఉంటుంది. కాని ఎండబెడితే పప్పు వేరు, తొక్కవేరు అవుతాయి. ధాన్యమైనా అంతే. అలాగే బాహ్య శరీరం క్షరమైతే అంతరంగ శరీరం అక్షరం. అలాగే గణపతిపూజను లోపలకూడా చేసుకోవచ్చు. గురువు

కూడా అదేపీఠం మీదికి వస్తాడు. నీ గురువును చూడు. ఆయన కనులను నీ కనులు చూస్తున్నట్లుగా చూడు. ఆ తరువాత లోపల కూర్చొని ఆరాధన చేస్తుంటే, ఆయన ప్రసారంతో ఆకర్షణ పెరిగి బయట విషయముల యెడ వికర్షణ కలుగుతుంది. కాయ కూడా మొదలు లోపలినుండే పండుతుంది. జీవి అంతఃకరణ శరీరంలో ఇంకిపోయాడు. ఆ ఇంకిపోయిన వాడిని ముందుగా బయటకు లాగాలి. అప్పుడు వాడు ఎంతదూరమైనా చూడగలడు.

స్వప్న, జాగ్రత్ అనే రెండు స్థితులున్నాయి. ఒకడు దేనిచే అన్ని విషయాలను గ్రహిస్తున్నాడో అదే ఆత్మ. అది మహత్తర మైనది. సర్వత్రా వ్యాపించి ఉన్నది. ఆ అనుభూతితో ప్రాజ్ఞులు శోకం నుండి విడివడతారు. కర్మఫలములను అనుభవించే ప్రాణానికి ఆధారమైన ఈ ఆత్మను దగ్గరలో ఉన్నట్లు, అదే సమయంలో భూత, భవిష్యత్ కాలాలకు, నేతగా తెలుసుకునేవాడు ఎవడినీ ద్వేషించడు. ఎవరు పంచభూతాలకన్నా ముందు తపస్సు చేసి ఉద్భవించారో, ఎవరు ప్రాణహృద్గుహలో నెలకొన్నారో, ఆయనే సమస్తాన్ని దర్శిస్తాడు. అదే నీవు. లోపల దర్శనం వల్ల అనుభూతి మిగులుతుంది. అందుచేత ప్రాణరూపమైనది, సమస్త దేవతల రూపమైనది. పంచభూతాలతో ఉద్భవించినదైన ఏ దేవి ప్రాణుల హృద్గుహలలో చేరి పని చేస్తున్నదో ఆ దేవి రూపములో

ఉన్నది నీవే. ఆత్మాగ్ని నీవు. ఆజ్ఞాపించేది నీవు. ఇక్కడ, అక్కడ ఉన్నది నీవు. ఈ సత్యాన్ని గ్రహించటానికి మనసే పరికరము. సర్వత్రా వ్యాపించినవాడు, భూత, భవిష్యత్ కాలాలకు ప్రభువు, పొగలేని కాంతిపుంజంలాంటి భగవంతుడు శరీరం మధ్య హృద్గుహలో బొటనవేలు ప్రమాణంతో కొలువై ఉన్నాడు. ఆయనను తెలుసుకుంటే ఎవరినీ ద్వేషించము. నీవు అడిగిన వస్తువు ఆయనే. అదే ఆత్మ వస్తువు.

శరీరము నుండి, యింద్రియముల నుండి, మనస్సు నుండి, సాధనద్వారా వేరుచేయబడి, అంతర్మనస్సుతో, అంతఃకరణలతో, అంతఃకరణ శరీర నిర్మాణము జరిగి, నీయందు నీవలెనే గోచరించు తేజోమయమైన రూపము నీ బొటనవ్రేలు అంత నీకు గోచరిస్తుంది. అతడే నీ అంతరాత్మ స్పష్ట రూపము. అదియే నీ శుద్ధ రూపము! పవిత్ర రూపము! అదియే నీవు – పరిశుద్ధ ఆత్మవు, పవిత్ర ఆత్మవు! పాల నుండి వెన్న తీసినట్లు నీ నుండి నిన్ను యిలా వేరుచేసుకొని దర్శించవచ్చును. అట్టి నీ అంగుష్ఠ రూప హృదయములో, పరమాణు రూపములో పరమాత్మ దర్శనము గావించవచ్చు.

ఇలా ఈ శరీరములో వుండగానే ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ స్థితులను నీ యందలి అంగుష్ఠ పురుష దర్శనము కలిగి,

మరణము దాటి యుండవచ్చును. శరీర మందును వుండ వచ్చును. లేదా శరీర విసర్జనా నంతరము వుండవచ్చును. ఇలా శరీర మరణానంతరము జీవించే చిరంజీవులు ఉన్నారు. మహర్షులు, బ్రహ్మర్షులు అట్టివారే!

ఇక్కడ ఈ శరీరములో వుండగానే నిర్మల హృదయముతో ఈ సాధన చేస్తే మర్త్యుడైన మానవుడు అమరుడు అవుతాడు.

మనలోపల ఒక దివ్యమంగళ స్వరూప మేర్పడుతుంది. అది అమ్మవారు లేదా అయ్యవారు కావచ్చు. అది దివ్యలింగం రూపంలో ఉండే ఆత్మలింగం కావచ్చు. దానిని జ్యోతి స్వరూపంగా గాని, మానవ రూపంలో గాని, లింగ స్వరూపంగా గాని ఆరాధన చేయవచ్చు. లోపల దానిని చూస్తూ, ఆరాధన చేస్తూ ఉంటే క్రమంగా నీవు కూడా లోపల ఏర్పడతావు. అలా ఏర్పడినవాడు ఊర్ధ్వముఖంగా బయలు దేరుతాడు. ఇక అక్కడినుండి రకరకాల శబ్దాలు, వాయిద్యాల నాదాలు వింటూ ఉంటాడు. రంగులు, కళలు చూస్తూ ఉంటాడు. ఆజ్ఞకు చేరేసరికి బయటకు రాగలడు, లోపలికి వెళ్ళగలడు. పెద్దవాడు కాగలడు, చిన్నవాడు కాగలడు. అప్పుడు అతడు ఆత్మస్వరూపుడుగా కాగలడు. **అందుచేత హృదయగుహలో ప్రవేశించి చేసే సాధన నిజమైన సాధన.** హృదయగుహలో ప్రవేశించేదాకా దానికోసమే సాధన చేయాలి.

దానికి ప్రాణ, అపానములు ఆధారము. ఉచ్ఛ్వాసద్వారా లోపలికి వెళ్ళవచ్చు. నిశ్వాస నుండి బయటకు వస్తావు. ఇలా చేస్తూ ఉంటే లోపల ఉండే సమయం వస్తుంది. అలా ఉండటాన్ని ప్రార్థన, ఆరాధనలలో పొందవచ్చు. శ్వాస సూక్ష్మం అవుతుంది. స్పందన సూక్ష్మమై లోపలికి వెళ్తాము. అక్కడ నీకు సమాన, ఉదాన వాయువు దొరుకుతుంది.

కనులు మూసుకొని బయట చేసే ఆరాధన యాంత్రికం. లోపలి ఆరాధనే సత్యం. అట్లా చేస్తూ, చేస్తూ రామకృష్ణుడు ఆరాధనలో ఎక్కువ నిమగ్నమై బయట ఆపేసేవాడు. ఆ పూజలో ఆయనే పూజారి. ఆయన లోపల అమ్మవారు. లోపలి పూజ జరుగుతుంటే బయట పూజ ఆగిపోయేది. అలా గంటలు గంటలు గడిచిపోయేది. ఆయనది అంతరంగ పూజ. బయటి వాళ్ళకు ఆందోళన. మనం కూడా *"ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురుపాదుకాం"* అని గురుపాదుకలను పూజిస్తాము కదా! అందుకే అంతరంగ పూజ బాగా లోపల జరుగుతుంటే బాహ్యపూజ ఎవరికైనా అప్పచెప్పాలి. మాస్టర్ సి.వి.వి. గారు అలా అప్ప చెప్పారు. ఆయన మొదట కృష్ణ ఆరాధకులు. ఆ అప్పచెప్పినవాడు సరిగా చేయకపోతే మళ్ళీ జన్మ ఎత్తి మన చుట్టూ తిరుగుతూ ఉంటాడు.

గర్భవతియైన స్త్రీలు గర్భాన్ని ఎలా పరిరక్షించుకుంటారో, అంతరంగం చేరిన జీవుడు తనను ఆ విధంగా పరిరక్షించుకోవాలి. గర్భిణీ స్త్రీ బయట ఏ పని చేసినా అది తన గర్భానికి దెబ్బ తగులకుండా కాపాడుకుంటూ వుంటుంది. అలా అని పనులు మానేయరు. కొన్ని పనులు మాని నిత్యకృత్యాలు చేసుకుంటూ గర్భాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటుంది. గర్భం ఒక బుడగలాగా ఏర్పడి, చిన్న ముద్దలా మెత్తగా ఉంటుంది. ఆ ముద్దలో ముందు నోరు తరువాత కళ్ళు, నాసాపుటాలు, చెవులు ఏర్పడతాయి. ఆ తరువాత క్రమంగా వెన్నెముక ఏర్పడుతుంది. ఇలా ఏడు నెలల్లో శిశువు ఏర్పడతాడు. అక్కడి నుండి శిశువు పెరిగి తొమ్మిదివ నెలలో బయటకు వస్తుంది. అలా ఉన్నప్పుడు బయటి జీవితానికి కూడా ఏ అడ్డూ ఉండదు. కాకపోతే Essentials, Non essential and Un essential లో నుండి Non essential and Un essential తీసివేయాలి. Non essential ని marginal గా ఉంచుకొని సాధన చేయాలి. అలాగని తీవ్రంగా సాధన చేస్తే రిపల్షన్ వస్తుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అని చెప్పారు. అన్నీ ఉండాలి కాని దేనికీ అతుక్కుపోకూడదు. సద్గ్రంథ పఠనము, సత్కాలక్షేపం నుండి వైదొలగకూడదు. రుచి పెరిగినకొద్దీ కట్టుబాట్లు అవి వస్తుంటాయి. బలవంతంగా కట్టుబాటు చేస్తే అది విపరీతమై మరల వెనక్కి వచ్చేస్తుంది.

గొంగళిపురుగు ఆ విధంగానే ఒక గూడు కట్టుకొని, ఆ గూటి లోకి వెళ్ళిపోతుంది. ఆ గూటిలో క్రమంగా అది సీతాకోక చిలుకలా మారిపోతుంది. ప్రకృతి చూపిస్తూ ఉంటుంది. ఫలవృక్షం పిందె లుంటాయే అవి ఆకు చాటుగా పెరుగుతుంటాయి. ఎందుకు పిందె ఆకుచాటున పెరుగుతుంది? ఎందుకంటే ఆ పిందెకు నేరుగా సూర్యరశ్మి తగులకూడదు. ఆకు ఒక తెరలా వుండి ఆ పిందెను ఆదుకుంటుంది. బలం పట్టే వరకు అలాగే వర్షానికి, సూర్యరశ్మికి చుట్టూ వుండే ఆకులు ఆ పిందెను రక్షిస్తాయి. అలా ఈ శరీరంలో అంగుష్ఠమాత్ర పురుషుడు ముందు సరిగా పుట్టాలి. ఆ పుట్టడాన్నే 'ద్విజత్వం' అంటారు. ఇలా నిర్మాణం చేసుకున్న బ్రాహ్మణుడు ద్విజుడు. కేవలం బ్రాహ్మణుడే కాదు, ఎవరు అలా నిర్మాణం చేసుకుంటే వాళ్ళందరూ ద్విజులే. ఋషు లలో అన్ని వర్ణాల వారున్నారు. మనం కూడా అలా నిర్మాణం చేసుకుంటే ఉత్తరోత్తర నీవు కూడా తప్పక ఋషి అవుతావు.

అదెలా ఉంటుందంటే సూర్యుడు పెరుగుతున్నట్లుగా వుంటుంది. ఆ పుట్టిన బాలభానుడు క్రమంగా ఉదయ భానుడు, ఆ తరువాత మార్తాండ భానుడైనట్లుగా కాంతి పెంచుకుంటూ పోతూ ఉంటుంది. అదొక ఉపమానం. చక్కని వెలుగుతో కూడి నటువంటి ఒక ఆకారము, నీ ఆకారములాంటిదే. దానివల్ల నీవు

వచ్చావు. నీ లోనుండి దానిని బయటకు తీస్తున్నావు. ఇదే జరిగేది. ఇది జరిగిననాడు తన్ను తాను దర్శిస్తాడు. వాడు అక్షరుడు. ఆ అక్షరుడు ఈ క్షరుని దర్శిస్తాడు. నిన్ను నీవు దర్శించటం అదే. అందుకే పెద్దలు 'నిన్ను నీవు చూసుకో' అంటారు. ఈ ప్రక్రియ అంతా ప్రాణాయామ, ప్రత్యాహారంలో వస్తుంది. ధారణస్థితిలో అది ఏర్పడుతుంది.

*తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ।*
*సబ్రహ్మ సశివ స్సహరి స్సేన్ద్రసోऽక్షరః పరమస్స్వరాట్ ।*

*'రాజాధిరాజాయ ప్రసహ్యాసాహినే*
*నమోవయం వైశ్రవణాయ కుర్మహే'* అంటూ ఉంటాము.

అందుకని హృదయపద్మం, దానిలోపల వడ్లగింజంత ఉంటే ఆయన, ఆ వడ్లగింజ మొన అంత ఆయన హృదయ ముంటుంది. అంటే నీవు ఎంత తీక్షణంగా దర్శిస్తూ ధ్యానం చేస్తున్నావో, నీ లోపల ఉన్నవాణ్ణి ధ్యానం చేయమంటారు. బొమ్మలో బొమ్మ, ఆ బొమ్మలో మరో బొమ్మలా ఉంటుంది. అందుకే 'దేవుడెక్కడో లేదురా, నీలోనే ఉన్నాడు వెతుక్కో' అని చెబుతుంటారు. వాడు నారాయణుడు, లోపలివాడు నరుడు, నీవు మనిషివి.

*'అంగుష్ఠమాత్ర పురుషః మధ్యే ఆత్మన్ తిష్ఠతి, ఈశానో భూత భవస్యనతతో నిజ గుప్సతే ఏతద్ వైతద్'* నీవు కోరుకున్న

భగవంతుడు వాడే. వాణ్ణే ఈశ్వరుడంటారు. 'ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే తిష్ఠతి' ఎవరి హృదయంలో అంటే, అక్షర పురుషుడి హృదయంలో ఉంటాడు. ఆ లోపలివాడే పురుషోత్తముడు. ఆ పురుషోత్తముడి చుట్టూ ఒక పురుషుడు, ఆ పురుషుడి నుంచి ఈ కనబడుతున్న పురుషుడు. ఇలా ముగ్గురు పురుషులు ఏర్పడతారు. రెండవవాడిని పెంచుకుంటే వాడికి సిద్ధులు వస్తాయి. వాడు అక్షరుడు. ఈ రెండవవాడు పెరగాలంటే ఆ రెండవవాడి లోపల ఉండేవాడిని ఆరాధన చేయాలి. అంటే ఆరాధన హృదయంలో జరగాలి. సత్యాన్ని ఆరాధన చేయాలి. అప్పుడు ఆరాధన ఫలిస్తుంది. అప్పుడు నరుడు జయించలేనిది ఏమీ ఉండదు. నారాయణుడు నరునితో కూడినప్పుడు సమస్తాన్నీ జయిస్తాడు. ఇదే నర నారాయణుల కథ. అందుకని నరుడు పనిచేస్తుంటే నారాయణుడు బలం ఇస్తుంటాడు. నారాయణుడు తాను పనిచేయక నీతోనే చేయిస్తాడు. అందుకే కృష్ణుడు నేను నీ రథంలో ఉంటాను. నీవు నాకు ఉన్ముఖుడవై ఉంటే నీ చేత యుద్ధం చేయిస్తాను. కాకపోతే నీకు తోచినట్లు చేస్తావు. అప్పుడు నీవు ఇబ్బంది పడతావు. నేను సారథిగా కూర్చుంటాను. నీవు నన్ను చూస్తూ యుద్ధం చేయి. నేను వాళ్ళను దర్శిస్తా, అప్పుడు వాళ్ళందరూ నాలోకి వచ్చేస్తారు. ఇక మిగిలింది కొట్టుకో అన్నాడు. కృష్ణుడు చెప్పింది అర్థంకాక అర్జునుడు నానా కష్టాలు పడ్డాడు. అలా అభిమన్యుని పోగొట్టుకుంటాడు.

మన లోపలున్నవాడు నాకు తెలుసు అనుకోవడానికి వీలు లేదు. లోపలివాడిని మరచిన రావణుడు, హిరణ్యకశిపుడు బలహీను లయ్యారు. ఉపేంద్రుని నిర్లక్ష్యం చేసిన ఇంద్రునికి పదవిపోయి బాధ పడుతుంటే వాళ్ళమ్మ మళ్ళీ ఇంకోసారి ప్రార్థన చేసి విష్ణువు సాన్నిధ్యం పొందమని చెబుతుంది. విష్ణు సాన్నిధ్యంతో మళ్ళీ తన స్థానం పొందుతాడు. పారిజాతాపహరణం కథ ఇలాంటిదే. పదవి పోయిన ఇంద్రుడు కృష్ణుని శరణు వేడితే, నరకాసుర సంహారం కోసం అమ్మవారిని తీసుకొని వెళ్తాడు. నరకాసురుడు ఆమె చేతిలో చావాలి. తాను ఏదో మూర్ఛపోయి నట్లుగా నటించి, తన బలాన్ని ఆవిడలో ప్రవేశపెట్టి, ఆవిడచేత సంహరింపచేస్తాడు. సత్యభామ తానే గెలిచినట్లుగా భావిస్తుంది. భగవంతుడికి కీర్తి ప్రతిష్ఠలు అవసరం లేదు. ఆ కీర్తి సత్యభామకే ఇస్తాడు. దానితో ఆవిడ రెచ్చిపోతుంది. దాంతో నారదుడు రావటం, వస్తూ పారిజాత పుష్పం తీసుకొనిరావటం జరుగు తుంది. కృష్ణుడికి నారదుడుకి పరస్పర అవగాహన ఉంది కదా! దానిని కృష్ణుడు 'మగవాడిని నాకెందుకు' అని రుక్మిణికి ఇవ్వడం, రుక్మిణి తలలో పెట్టుకోవడం జరుగుతుంది. It is not a case of show. It is an inner case of show. ఆ సువాసన సత్యభామ గ్రహించటం, నారదుడి ద్వారా విషయం తెలుసుకొని కృష్ణుడు రాగానే కినుకతో చాలా చాలా చేస్తుంది. గరుత్మంతుని పిలుస్తాడు.

మనలోని స్పందనే గరుత్మంతుడు. మీరు సహస్రారం వరకు చేరితే గరుత్మంతుడు మీతో మాట్లాడుతాడు. గరుత్మంతుడే రామునికి సహాయం చేశాడు.

రామలక్ష్మణులపై ఇంద్రజిత్తు నాగాస్త్రం వేస్తే వారిద్దరూ కట్టుబడి పోతారు. అప్పుడు గరుత్మంతుడు రెక్కలు ఆడించు కుంటూ వస్తే ఆ పాములు భయపడిపోయి వదిలేస్తాయి. అప్పుడు వాళ్ళిద్దరూ 'ఎవరు నీవు? దివ్యమంగళ స్వరూపుడిగా వచ్చి ఉపకారం చేశావు' అని అడుగుతారు. దానికి గరుత్మంతుడు 'మనిద్దరం చిరకాల మిత్రులం. అవసరానికి సహాయం చేయాలి కదా! అందుకే వచ్చాను' అన్నాడు. రామునికి అవతార తత్త్వంలో తనకు తాను గుర్తురాడు. అందుకే ఋషులందరూ నీవు నారాయణుడవు అన్నారు. కాని రాముడు 'నాపేరు రాముడు. మా నాన్న పేరు దశరథుడు' అన్నాడు. అతడు పరిపూర్ణ స్వరూపుడు కాబట్టి ప్రకృతి దేవతలందరూ సహాయం చేస్తారు. మనకైనా అంతే. ఎంత ధర్మంలో ఉంటే అంత దేవతా సహాయం లభిస్తుంది. అలా గరుత్మంతుని సహాయంతో పారిజాతపు చెట్టుకోసం ఇంద్రుడితో యుద్ధం చేస్తాడు. ఇంద్రుడి తల్లి వచ్చి మందలిస్తే కృష్ణుడు ఆ చెట్టును సత్యభామకు ఇస్తాడు. అప్పుడు సత్యభామలో పెరిగిన అహంకారాన్ని తులాభారంతో ఒక్కసారిగా

తుంచేస్తాడు. రుక్మిణీదేవి *"సర్వేశ్వరుడగు శౌరి కింకరుచేయుట ధనము కలదె - భక్తి ధనము కాక"* అని భక్తి ధనమైన తులసీదళంతో కొలుస్తుంది.

ఇవన్నీ హృదయంలో చేరినవారి కథలే. ఇలా లోపల ఆరాధన పెరిగితే బయట వైభవం పెరుగుతుంది. అప్పుడు 'ఏతావాన్ అస్య మహిమా' అనిపిస్తుంది. ఋషులందరూ అలాగే ఉన్నారు. ఋషి, భక్తుడు ఏది చేసినా తన మహిమ అనుకోక భగవంతుని మహిమే అనుకుంటారు. పురుషోత్తముడు పురుషుడికి ప్రసన్నమైతే ఆ పురుషుడు చేసే కార్యక్రమాలు అత్యద్భుతంగా ఉంటాయి. సర్వత్ర వెలసి ఉన్నవాడు, భూత భవిష్యత్ కాలాలకు ప్రభువు అయిన భగవంతుడు పొగలేని కాంతిపుంజంలా బొటన వ్రేలు ప్రమాణంలో ఉన్నాడు. ఆ బొటనవ్రేలు ఎవరిది? అది తెలియాలి. ఆ బొటనవ్రేలు ఎంత ఉంటే నీవు అంతే ఉంటావు. అది వడ్లగింజంత ఉన్నదని 'నీవారశూకవర్తన్వీ పీతాభాస్వ త్యణూపమా' అని మంత్రపుష్పము చెబుతుంది. అంటే వడ్లగింజ నెత్తిన చిన్న తలకాయలా ఉంటుంది, అది కాంతివంతగా మెరుస్తూ ఉంటుంది.

*'తస్యమధ్యే వహ్ని శిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః ।*
*నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా ।'*

ఆ తల బంగారు కాంతితో ఉంటే దానిలోపల అణువుకన్నా సూక్ష్మమైనది, అణోరణీయంగ ఉంటుంది. అది నీలంగా వెలుగుతూ ఉంటుంది. అది అణువువలె ఉంటుంది. బ్రహ్మాండం అంతా అదేగా ఉంటుంది. అలాంటి దర్శనం చేయాలంటే ఈ మంత్రాలు నోటికి వచ్చి చెబుతూ దర్శనం చేయాలి. నారాయణ సూక్తంలో, మంత్రపుష్పంలో ఉంది. అలా రామకృష్ణుడు లోపలికి వెళ్ళి చదువుతూ, బయట చదవటం మానేసేవాడు. అదే రామకృష్ణ పరమహంస పదహారుసార్లు ప్రయత్నం చేస్తాడు. ఆయన శిష్యులు 'మీరు చూసిన దేవుని మాకు వర్ణించండి' అని అడిగితే ప్రతిసారి వర్ణిస్తూ, వర్ణిస్తూ తన్మయస్థితిలో లోపలికి వెళ్ళి ఆయన వర్ణిస్తూనే ఉంటాడు. ఎందుకంటే ఆ లోపలివాడు విని ఆనందిస్తాడు. తరువాత బయటకి వచ్చి అర్థమైందా? అని అడిగితే వాళ్ళు 'సగంలో ఆపేశావు' అంటారు. అందుకు ఆయన 'చెప్పానుగా' అంటాడు. అలా ఆయన పదహారుసార్లు బయటకు కూడా చెప్పాలని ప్రయత్నం చేస్తాడండి. రామకృష్ణ జీవిత చరిత్రతోబాటు, అరవిందుల దర్శనం కూడా చదవాలి. ఏ గురువు చెప్పినా లోపలికి వెళ్ళమనే.

మాస్టర్ సి.వి.వి.గారు కూడా అదే చెబుతారు. లోపల చెబుతాను, లోపల విను, లో చెవితో విను, లో కన్నుతో చూడు.

నీకు ఎప్పుడు ఎంత అవసరమో అంత నేను లోతట్టు నుండియే బోధిస్తాను. ఒక్కసారి తన నామాన్ని ఉచ్చరించమన్నారు. దానినే మాస్టర్ ఇ.కె. గారు ఇంకొంచెం ప్రభావపూర్ణంగా ఉంటుందని మూడుసార్లు చెప్పమని చెప్పారు. మాస్టర్ ఎం.ఎన్. గారు లోపలే అనిపించేవారు. ఎప్పుడో ఒకసారి మంత్రం బయటికి చెప్పేవారు. మాస్టర్ ఇ.కె.గారిది రామానుజాచార్యుల సంప్రదాయము. రామానుజాచార్యులతో ఆయన గురువు నీకు మోక్షానికి వెళ్ళే మంత్రం చెబుతాను, తీసుకో అని అంటే 'నిజంగా వస్తుందా' అని అడిగి వెంటనే శ్రీరంగంలో గోపురంపైకి ఎక్కి గట్టిగా చెప్పేశాడు. గురువుగారు కోప్పడితే రామానుజాచార్యులు "నేనొక్కడినే మోక్షం పొందితే సరిపోతుందా? నేనది భరించలేను స్వామీ! వీరందరూ నావారే, నావాళ్ళు కాని వాళ్ళు లేరు. వాళ్ళకు కూడా మోక్షం దొరకాలిగా. అందుకే అందరూ చేసుకుందామని చెప్పాను" అన్నాడు. అది ప్రేమతత్త్వం. ఆ గురువు ఏం చెప్పాలో తోచక వదిలేశాడు. ఇంతకూ ఆయన తరించిన మంత్రం *'ఓం నమో నారాయణాయ'* అన్న అష్టాక్షరి. దానికే మాస్టరుగారు **లోపల చెప్పినా, బయటికి చెప్పినా మంత్రం రహస్యమే.** శ్రద్ధ ఉండాలి. అలాంటి శ్రద్ధ ఉండటం వలననే రామకృష్ణుడికి, రామానుజాచార్యులవారికి అలా జరిగింది. అది లేనివాడికి ఎన్ని మంచి విషయాలు చెప్పినా మరచిపోతాడు. అంతరంగ ఆరాధన జరగాలి అన్నారు.

శిఖరాల మీద కురిసిన వాననీరు ఏ విధంగా దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తుందో, అదే విధంగా జీవ జనాలని వివిధాలుగా చూసేవాడు మళ్ళీ మళ్ళీ వాటిగానే జన్మిస్తాడు. దేనినైతే లోపల చూస్తావో దాన్నే బయట కూడా చూస్తావు. అదే ఇది. దానినే 'ఓం ఇతి ఏతత్' అంటారు. ఎన్ని నదులున్నాయో, జలం కదా! దానికి అనేక పేర్లు పెట్టాము. దీనినే వివేకానందుడు చెప్పాడు చికాగోలో...

*'ఆకాశాత్ పతితం తోయం యథాగచ్ఛతి సాగరం ।*
*సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి ।'*

ఒక్కటే యిలా దిగివచ్చి యిన్నిగా ఏర్పడింది. దిగివచ్చింది అదే. ఈ ఏర్పడింది అదే. అందుచేత వాడిని, వీడిని ఎవరిని చూసినా అదే ఇదిగా ఉంది. అలాంటివారికి అందరిలో అదే కనిపిస్తుంది. నీలో ఉన్నదే వాడిలో కూడా ఉంది. అదే సమదృష్టి. తెలిసినవాడిని చూచినా, తెలియనివాడిని చూచినా, కుక్కను చూసినా, కుక్క మాంసము తినేవాడిని చూచినా అదే కనిపించే వాడు సమదర్శనుడు. వైవిధ్యము చూడక ఏకత్వము చూడ మంటాడు.

మన శరీరంలో వసిస్తున్న ఆత్మ బొటనవ్రేలు ప్రమాణంలో ఉంటుంది. అది జీవాత్మ. అది జనుల హృదయాల్లో ఎల్లపుడు

విరాజిల్లుతూ ఉంటుంది. ముంజగడ్డి నుండి ఈనెలను వేరుచేసిన తీరులో దానిని స్వంత శరీరమునుండి ఓర్పుతో వేరు చేయాలి. ఆ ఆత్మ పావనము, అమరము అని తెలుసుకో అన్నాడు. ముందుగా అది తెలుసుకొని లోపల ఉన్నవానిని ఆరాధన చేయాలి. లోపలికి వెళ్ళకుండా చేసేవాళ్ళు ఏం చేస్తారంటే చెప్పే దొకటి, చేసేదొకటి, ఆలోచించేది ఇంకొకటి. (ఇలా త్రికరణ శుద్ధి లేనివారి గురించి కొన్ని వందల పద్యాలు రాశాడు వేమన.)

ఈ విద్య 'మరణ రహస్యము' తెలిపిన మరణదేవత అగు యమదేవుడు ఉపదేశించాడు. అతడు ఆత్మవంతుడు. ఆత్మవంతుడే ఆత్మవిద్యను అర్హుడైనవానికి ఉపదేశిస్తాడు. ఆత్మ మాటలద్వారా, కన్నులద్వారా, మనస్సుద్వారా పొందడానికి సాధ్యపడదు. అది వున్నది అని తెలిసినవారి ద్వారానే దానిని ఉపదేశముగా పొంది సాధన చేయాలి.

ఆత్మవంతునియందు బుద్ధి, మనస్సు, యింద్రియములు, శరీరము ఒదిగిపోయి నిశ్చలమై వుంటాయి. ఆత్మ సంకల్పమునకు పూర్తిగా లోబడి వుంటాయి. స్వతంత్రించవు. మంత్రి, సేనాధిపతి, దళపతులు, సైన్యము రాజు అధీనములోవున్న వాడు రాజు. అలాగే నీ యందలి సమస్తము నీ అధీనములో వుంటే నీవు రాజయోగివి.

అట్టి యోగి బుద్ధినుండి ప్రకటితమవుతూ వుంటాడు. తనయందలి పరమాత్మ సంకల్పమెరిగి కాలమును, దేశమును బట్టి బుద్ధి నుండి, మనస్సు నుండి, యింద్రియముల నుండి, శరీరము నుండి ఆత్మవంతుడు ప్రకటితమవుతూ వుంటాడు.

యమధర్మరాజు చెప్పిన ఈ విద్యను, అన్ని యోగవిధులను స్వీకరించిన నచికేతుడు పావనుడై మృత్యురహితుడయ్యాడు. తరువాత భగవంతుని ప్రార్థించుకున్నాడు. ఇతరులు కూడా ఈ విద్యను తెలుసుకొని ఆచరణలో పాటించినప్పుడు భాగవత స్థితిని పొందుతారు. ఇదే కఠోపనిషత్తు యొక్క సారాంశము. విష్ణు లోకములో అందరూ విష్ణుమూర్తులుగానే కనిపిస్తారట. తిరుపతిలో జయ విజయులు అదే. వాళ్ళకూ శంఖచక్రాలుంటాయి. లోపలి మూర్తికి అలంకారం చేస్తే, బయటివాళ్ళకు తక్కువ అలంకారం ఉంటుంది. బయటివాళ్ళు కూడా ఆయన ప్రతిరూపాలే. కాని ప్రతిరూపాల్లో అసలు రూపం దాగి ఉంటుంది. ఆ లోపలి రూపాన్ని ధ్యానం చేయాలి. అందుకే కఠోపనిషత్తు లోపలికి వెళ్ళమంటుంది.

ఈ కథలో సారాంశం ఏమిటంటే మీరు బయట సవ్యంగా ప్రవర్తిస్తే లోపలకు రావటానికి వీలుంటుంది. దేనినీ మానమని చెప్పలేదు. వాక్కు, చేత, ఆలోచనచేత దానిని గురించే తాపత్రయ

పడండి. దాన్ని గురించే ప్రార్థన పెంచండి. ఒకడి లోపల ఒకడున్నాడు. వాడి లోపల ఒకడున్నాడు. ఇది గుర్తు పెట్టుకొనే భగవద్గీత చదువుకోవాలి. అందులో కృష్ణుడు అక్షరుడుగా, పురుషోత్తముడిగా రెండు రకాలుగా మాట్లాడుతాడు. అంతా నేనే అంటున్నా, మధ్యలో ఒక్కోసారి నారాయణుడుగా, ఒక్కోసారి వాసుదేవుడిగా, ఒక్కోసారి కృష్ణుడిగా మాట్లాడుతాడు. ఇదంతా నాచేత శాసించ బడుతుందని అంటాడు. నేనే సూర్యుడికి చెప్పాను అంటాడు. ఎవడు వాడు? వాడే లోపలివాడు. నేను, నీవు ఎప్పుడూ ఉన్నా మంటాడు. ఇద్దరూ అక్షరులు. కాని నీవు మరచిపోయావు. నాకు గుర్తుంది అంటాడు. అంటే ఇద్దరూ అక్షరులే అయినా ఆయన నారాయణుడుగా అతడు ఒక్కడే ఉన్నాడు. నారాయణుడిలో నరుడు వున్నాడు.

ఈ నేను ఆ లోపల నేను అయితే, ఇంకో నేను అయి ఉంటుంది. ఒక 'నేను'లో ముగ్గురు 'నేను'లు ఉన్నాయి. ఈ మూడో నేను, వీడి కథ చాలా చిన్న కథ. ఆ రెండవ 'నేను' కథ పెద్ద కథ. ఆ రెండు 'నేను'లు అసలు నేను ఉందే, అది అసలు కథ.

మాస్టర్ సి.వి.వి. 'మాస్టర్ నమస్కారమ్' అన్నారు. ఆ మాస్టర్ ఎవరు? ఆ మాస్టర్‌కి మాస్టర్ ఎవరు? అతడు అంతర్యామి.

ఆ మాస్టర్‌కి ఈయన వాహిక. ఈయన మాస్టర్ కదా! అందుకనే మొట్టమొదటి మంత్రం 'మాస్టర్ నమస్కారమ్' అని ఇచ్చారు. ఇక ఆయన వెళ్ళిపోయేటప్పుడు 'మాస్టర్ సి.వి.వి. నమస్కారమ్' అని నీవే చెప్పరా అని చెప్పారు. ఆయన 'మాస్టర్ సి.వి.వి. నమస్కారమ్' అంటే ఎవరికి? మరి ఆయన 'మాస్టర్ నమస్కారమ్' అంటే అది సి.వి.వి.గారికి కాదు. సి.వి.వి.గారు ఎవరికి దండం పెట్టారో ఆయన అందరిలో ఉన్నాడు. అంతటా వున్నాడు. అందరిలోవున్న మాస్టర్ మొదటివాడు–పురుషోత్తముడు. ఆ మాస్టరును అందించిన సి.వి.వి. రెండవ వాడు – అక్షర పురుషుడు.

సి.వి.వి. గారిని అనుసరించి మాస్టర్ యమ్.యన్. అక్షరులైనారు. అలాగే మాస్టరును, మాస్టర్ సి.వి.వి. గారిని, మాస్టర్ యమ్.యన్. గారిని అనుసరించిన మాస్టర్ ఇ.కె. గారు అక్షరులై మనల నందరనూ నడిపిస్తూ వున్నారు. ఇలా క్షరులు అక్షరులై, శాశ్వతులై లోకశ్రేయస్సుకు తోడ్పడాలనే శుభ సంకల్పములో కఠోపనిషత్తు అనుగ్రహింపబడింది. సమస్త గురుపరంపర కోరేది మనల నుండి ఒకటే– "అక్షరులుగ ఏర్పడండి. శాశ్వతులై ఈశ్వర సాన్నిధ్యంలో లోకశ్రేయస్సుకు తోడ్పడండి. మీరు జనన మరణములను దాటి లోకహితులై అలరారండి!" ఇది వారి ఆకాంక్ష, ఆశయము, ప్రణాళిక కూడ.

# 12. పునరాగమనము

నచికేతుడు యముని వద్ద నచికేతాగ్నిని సిద్ధింప జేసుకొనెను. అటుపిమ్మట ఓంకారము ననుస్మరణము చేయు విధానమును అనుగ్రహముగ పొందెను. అటుపిమ్మట యముని అనుమతితో భూలోకమున తన స్వగ్రామమును చేరెను. నచికేతుని రాక తెలిసిన అతని తండ్రి వాజశ్రవసుడు అమితానందముతో ఎదురేగి, నచికేతుని కౌగలించుకొనెను. నచికేతుడు తండ్రికి పాద నమస్కారముచేసి యమధర్మరాజుతో జరిపిన సంవాదము, యముని ఉపదేశము తండ్రికి తెలిపి, తనవారి నందరిని పరామర్శించి తనదైన మార్గమున 'మరణ రహస్యము'ను ఇతరులకు బోధించుచు, చిరంజీవియై యున్నాడు. శ్రద్ధా పూర్వులగువారు నచికేతుని స్మరణవలన అతని సాన్నిధ్యమును పొందుచు, నచికేతాగ్నిని, ఓంకార యజ్ఞమును నిర్వర్తించుకొనుచు పరమపదప్రాప్తిని పొందుచు నున్నారు.

*స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం*
*న్యాయ్యేణ మార్గేణ మహీం మహీశాః ।*
*గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం*
*లోకా సమస్తా స్సుఖినో భవంతు ॥*

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ।

**పాఠకులకు మనవి**

కఠోపనిషత్తులోని యమధర్మరాజు ఉపదేశములు అనేకము మరొక పుస్తకముగా అందించబడును. మూలమైన విషయము మాత్రము యిందు ప్రస్తుతించబడినది. గమనించ గలరు. ఇవి గురుపూజా ప్రవచనములు. యముని ఉపదేశ ముతోపాటు అనేక సాధనాపరమగు విషయములు అందించ బడినాయి. పాఠకులు అవగాహన చేసుకొనగలరని భావిస్తున్నాము.

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Ashram Regulation for Entry | E/G/S |
| 13. | An insight into the WTT | E |
| 14. | Atmasadhana Sutramulu | T |
| 15. | Avathara of Synthesis | E |
| 16. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 17. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 18. | Book of Prayers | E |
| 19. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 20. | Bricks for the Temple | E |
| 21. | Cow | K/T/E/Hi |
| 22. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 23. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |

| | | |
|---|---|---|
| 24. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 25. | Dhanakamuni Katha | T |
| 26. | Doctrine of Eternal Presence | E |
| 27. | From the Teachers Pen | E |
| 28. | Gayatri Mantra Avagahana | T |
| 29. | Geetopanishad - Gnana Yogamu | T |
| 30. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 31. | Geetopanishad - Karma Yogamu | T |
| 32. | Geetopanishad - Sankya Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 34. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 35. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 36. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 37. | Good Friday | E/S |
| 38. | Healers Handbook | E |
| 39. | Health & Harmony | E/G |
| 40. | Health & Harmony-2 | E |
| 41. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 42. | Himalaya Guruparampara | T/Hi/K |
| 43. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 44. | Just Adjust | E |
| 45. | Jyotirlinga Yatra | T |
| 46. | Kapila and Kardama | E/G/S |
| 47. | Katha Deepika | T |
| 48. | Kumara Sambavam | T |
| 49. | Lectures on Secret Doctrine - I | S/E |
| 50. | Lectures on Secret Doctrine - II | E |
| 51. | Lectures on Secret Doctrine - III | E |
| 52. | Listening to the Invisible Master | E/S/K |

| | | |
|---|---|---|
| 53. | Lord Maitreya - The World Teacher | E/S |
| 54. | Life and Teachings of Master Jupiter | E |
| 55. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 56. | Mana Master garu | T |
| 57. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 58. | Mars - The Kumara | E/G/S |
| 59. | Mercury - The Alchemist | E/G/S |
| 60. | Maria Magdalena | E/S |
| 61. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 62. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 63. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 64. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 65. | MASTER C.V.V. - Yogamu | T |
| 66. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 67. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 68. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 69. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 70. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 71. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 72. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 73. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 74. | Master CSG | E |
| 75. | Messages of Master E.K. | E |
| 76. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 77. | Moon - The Key | E |
| 78. | New Age Hospital Management | E |
| 79. | Nutrients For Discipleship | E |
| 80. | OM | T/K/E |

| | | |
|---|---|---|
| 81. | Occult Meditations | E/G/S |
| 82. | Om Namo Narayanaya | E/G/S |
| 83. | On Change | E/S |
| 84. | On Healing | E |
| 85. | On Love | E/G/S |
| 86. | On Service | E/G/S |
| 87. | On Silence | E/G/S |
| 88. | PARIKSHIT-The World Disciple | E |
| 89. | Pranayamam | T |
| 90. | Prayers | E/G/S |
| 91. | RUDRA | E |
| 92. | Rukmini Kalyanam | T |
| 93. | Sai Sukthulu | T/K |
| 94. | Sai Ki Amruthavani | Hi |
| 95. | Sanghaneethi | T |
| 96. | SAM | E |
| 97. | Saraswathi-The Word | E/G/S |
| 98. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 99. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 100. | Shodosopachara Pooja - Avagahana | T |
| 101. | SOUND-The Key and its Application | E/G/S |
| 102. | Spiritualism-Business and Management | E/G |
| 103. | Spiritual Healing | S/G |
| 104. | Sri Dattatreya | E/G/S/T |
| 105. | Srimadramayana Dharmakusumalu | T |
| 106. | Sri Guru Paadukastavamu | T |
| 107. | SRI LALITHA (Set 10 Books)<br>(Comentary on Sri Lalitha Sahasranamam) | T |

---

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

"శరీరం ఆహుతి అయిపోయే లోపల మనం శరీరం నుండి బయటపడటం నేర్చుకోవాలి. అందుకే కఠ ఉపనిషత్తు. అందుకే సమస్త జ్ఞానము. నీలోని ఈశ్వరుడు సత్యము. అతడే ధర్మజ్ఞుడు, యజ్ఞస్వరూపుడు కూడా. నీవతనిని ఎరిగి, ధర్మ మాచరించాలి. అపుడు నీకు అక్షరుడవని తెలుస్తుంది. నీలోని ఈశ్వరుని నీవు అనుసరిస్తూ వుంటే నీలోని క్షరుడు (నీ స్వభావ పురుషుడు) నిన్ను అనుసరిస్తాడు. నీలోని పెద్ద అయిన ఈశ్వరుని నీవనుసరిస్తే, నీ నుండి పుట్టిన క్షరుడు నిన్ను అనుసరిస్తాడు. నీవు నీ తండ్రిని అనుసరిస్తూ వుంటే, నీ కుమారుడు నిన్ను అనుసరిస్తాడు. ఇలా మనలో గల ముగ్గురు సమన్వయం కలిగివుంటే, నీ నిజస్వరూపం నీకు ధారణ స్థితిలో గోచరిస్తూ వుంటుంది."

**మరణ రహస్యం-1**
(మార్కండేయుడు)

**మరణ రహస్యం-2**
(సతీ సావిత్రీదేవి)

ISBN 978-81-89467-76-0

9 788189 467760

ధనిష్ఠ